


ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

ఒంగోలు



జోయల్ మోకిర్ ఫిలిప్ అఘియాన్ పీటర్ హోవిట్

## ముగ్గురు ఆర్థికవేత్తలకు నోబెల్ 2లో

: fb.com/vaartha Digital

Published from Ongole,Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

14-10-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 253 పేజీలు: 12 వెల: 6.50

# దేశ ప్రగతిలో ఎపి కీలకం



సోమవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీకి జ్ఞాపికను అందజేస్తున్న సిఎం చంద్రబాబు

### అంతర్జాతీయ పెట్టుబడులకోసం నిర్వహిస్తున్న విశాఖ సమ్మిట్‌కు రండి: ప్రధాని మోడీని ఆహ్వానించిన సిఎం చంద్రబాబు

### సదస్సుకు రానున్న 29 మంది వాణిజ్య మంత్రులు, 80 మంది గ్లోబల్ సిఇఒలు, 40 దేశాల ప్రతినిధులు, 13 మంది కేంద్ర మంత్రులు

**విజయవాడ,అక్టోబరు13,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధాని నరేంద్రమోడీని సిఎం చంద్రబాబు నాయుడు సోమ వారం సాయంత్రం ఢిల్లీలో కలిసారు. విశాఖపట్నంలో నవంబరు 14, 15 తేదీల్లో జరగనున్న కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌కు ప్రధానిని ఆహ్వానిస్తూ అధికారికంగా ఆహ్వానం అందజే శారు. దేశ ప్రగతిలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషించేందుకు సన్నద్ధమవుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టంచేశారు. దేశ ఆర్థిక, సాంకేతిక అభివృద్ధిలో ఎపి అగ్రగామిగా నిలవాలని, దానికోసం అంతర్జాతీయ పెట్టుబడులు ఆకర్షించడమే తమ లక్ష్యమని ఆయన అన్నారు. ఈ క్రమంలో పిఎం నరేంద్ర మోడీని కలుసుకుని విశాఖపట్నంలో జరగనున్న సిఐఐ పార్టనర్షిప్ సమ్మిట్‌కు ముఖ్య >>2

సిఆర్‌డిఎ భవనం ప్రారంభం 2లో

# కల్తీ మద్యంలో జోగి రమేష్ పాత్ర!

### ములకలచెరువు కేసులోని నిందితుడు జనార్దన్ రావు ఆరోపణ



జోగి రమేష్

### ఆరోపణ పూర్తి నిరాధారం: రమేష్

**విజయవాడ, అక్టోబరు 13,ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపిలో ములకల చెరువులో బయటపడిన నకిలీ మద్యం కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఏ1 నిందితుడుగా ఉన్న అద్దెపల్లి జనార్దన్ రావు తాజాగా సంచలనం సృష్టించారు. వైఎస్సార్సీ నేత జోగి రమేష్ చేసిన కుట్ర వల్లనే ఇదంతా జరిగిందని ఆయన ఓ వీడియోలో ఆరోపించారు. జోగి రమేష్ ఇచ్చిన రూ.3కోట్లుఆఫర్‌కు ఆశ >>2



జనార్దన్ రావు

## కల్తీ మద్యం కేసులో మరొకరి అరెస్టు 2లో

# ఇక తుపాకులు పేలవు..



### గాజాలో యుద్ధం ముగిసింది 2లో

పాక్, అఫ్గాన్ ఉద్రిక్తతలూ తగ్గిస్తా

యుద్ధాలు ఆపడంలో నిపుణుడిని..

ఇజ్రాయెల్ పార్లమెంటులో అమెరికా అధ్యక్షుడు ట్రంప్

# అమరావతిలో స్పోర్ట్స్ సిటీ

### అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు: హోంమంత్రి అనిత

**విజయవాడ,అక్టోబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో స్పోర్ట్స్ సిటీని నిర్మిస్తున్నట్లు హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. పోలీస్ వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ లాంటి క్రీడా కార్యక్రమాలు పోలీస్ శాఖలోని క్రీడా సామర్థ్యాన్ని, శిక్షణను, పరస్పర సహకారాన్ని ప్రతిబింబించేందుకు గొప్ప వేదికగా నిలుస్తాయన్నారు. రెండవ ఆల్ ఇండియా వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ 2025-26 పోటీలు ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం 6వ బెటాలియన్, ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ క్రీడా ప్రాంగణం. మంగళగిరిలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా రాష్ట్ర హోం మరియు విపత్తుల నిర్వహణశాఖ మంత్రి వంగలపూడి అనిత, విశిష్ట అతిథిగా రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా పాల్గొన్నారు. ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు ఢిల్లీ వారి ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతున్నాయి. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, సీపీవోల నుంచి వచ్చిన 32 టీమ్ లు మార్చ్ ఫాస్ట్ చేసి ముఖ్య అతిథులకు గౌరవ వందనం సమర్పించాయి. అనంతరం హోం మంత్రి అనిత, డిజిపి హరీష్ కుమార్ గుప్తా పోటీలను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఈ జాతీయస్థాయి క్రీడా సమ్మేళనంలో వెయిట్‌లిఫ్టింగ్, పవర్‌లిఫ్టింగ్, యోగా అంశాల్లో పురు >>2

# కోర్టుకు వచ్చి వివరణ ఇవ్వండి

### హోంశాఖ ముఖ్యకార్యదర్శికి హైకోర్టు ఆదేశం

**విజయవాడ,అక్టోబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఒక ట్రాన్స్‌జెండర్‌కు ఎస్ఐ ఉద్యోగ కల్పన విషయంలో పోలీసు ఉన్నత ఉద్యోగుల తీరును ఎపి హైకోర్టు తప్పుపట్టింది. గతంలోఒక ట్రాన్స్ జెండర్‌కు ఎస్ఐ ఉద్యోగ కల్పన విషయంలో జారీ చేసిన ఆదేశాల అమలు గురించి వివరణ ఇచ్చేందుకు ఈ నెల 27న జరిగే విచారణకు వ్యక్తిగతంగా హాజరుకావాలని హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్‌కు హైకోర్టు ఆదేశించింది. ఈమేరకు జస్టిస్‌బట్టు దేవానంద్, >>2





కర్నూలులో ప్రధాని పర్యటన ఏర్పాట్లను సోమవారం పరిశీలిస్తున్న రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, బిసి జనార్దన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కేశవ్ రాజేష్, సత్యనారాయణరాజు, దామర్ల సత్య, బిటి వెంకట రాముడు తదితరులు

# ప్రధాని పర్యటనకు పకడ్బందీ భద్రత

## డ్రోన్ల ఎగురవేతపై నిషేధం: జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

**కర్నూలు, అక్టోబర్ 13, ప్రభాతవార్త:** ఈ నెల 16వ తేదీన కర్నూలులో జరిగే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటనను దృష్టిలో ఉంచుకొని 7,500 మంది పోలీసులతో పకడ్బందీ భద్రత ఏర్పాట్లు చేపట్టామని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. సోమవారం కర్నూలు పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని యూబీఆర్ కన్వెన్షన్ హాల్‌లో బందోబస్తు విధుల్లో పాల్గొననున్న అడిషనల్ ఎస్పీ నుండి ఎస్సై స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ప్రధాని పర్యటన ప్రాంతాల్లో 200 సిసి కెమెరాలతో నిఘా, డిజిటల్ కంట్రోల్ రూమ్ నుండి మానిటరింగ్, మరియు ఎయిర్‌పోర్ట్, సభా ప్రదేశం, పార్కింగ్ ప్రాంతాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఉంటుందని చెప్పారు. బహిరంగ సభ ప్రాంతానికి ఏడు మంది ఎస్పీ స్థాయి అధికారులను కేటాయించామని, అధికారులు సెక్టార్ ఇంచార్జ్‌ల సమన్వయంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఫోటోలు, వీడియోలు తీయరాదని బందోబస్తు సిబ్బందికి హెచ్చరిక జారీచేశారు. డ్రోన్ల వినియోగం పూర్తిగా నిషేధించబడిందని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కర్నూలు, నంద్యాల జిల్లాల నుండి సుమారు 7,000 బస్సుల్లో ప్రజలు బహిరంగ సభకు రానున్నారు. ఇందులో 3,000 ఆర్టీసీ బస్సులు, 4,000ప్రైవేట్ బస్సులు ఉన్నాయనితెలిపారు. భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేస్తున్నామని, ప్రజలు, అధికారులు అందరూ సహకరించాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ కోరారు.

# కల్తీ మద్యంలో జోగి రమేష్ పాత్ర!

>> పడే ఇదంతా చేశానని జనార్దన్‌రావు చెబుతున్నాడు. వైఎస్సార్సీ హయాం లోనే పెద్ద ఎత్తున నకిలీ మద్యం వ్యాపారం చేశామని జనార్దన్ రావు తెలిపారు. పోలీసులు పట్టుకుంటే బెయిల్ ఇప్పిస్తానని హామీ ఇచ్చారన్నారు. అయితే వైఎస్సార్సీ ఓడిపోయిన తర్వాత నిఘా ఎక్కువకావడంతో నకిలీ మద్యం తయారీ ఆపేశామ న్నారు. ఏప్రిల్‌లో జోగి రమేష్ మద్యం తయారీ ప్రారంభించా లని సూచించారని పోలీసులకు చెప్పారు. ఒక వేళ దొరికతే.. ప్రభుత్వంపై బురదచల్లవచ్చని.. తంబళ్లపల్లెనుంచే ప్రారంభిం చాలని సూచించారన్నారు. దొరికితే అన్ని విధాలుగా అండగా ఉంటాననిచెప్పి ఇప్పుడు పట్టించుకోవడం లేదని ఆయన చెప్పారు. అద్దేపల్లి నర్సింగరావు స్టేట్‌మెంట్ సంచలనం సృష్టి స్తోంది. ఈ క్రమంలో ఎన్టీఆర్‌జిల్లా ఇబ్రహింపట్టణం సమీ పంలో జనార్దన్‌రావు కాల్‌లిస్టు ఆధారంగా పలువురిని విచారి స్తున్నట్లు సమాచారం!

**పక్కా వ్యూహంతో బాబు కుట్ర: జోగి రమేష్**

మద్యం కేసులో డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా తనను ఇరికించాలని సిఎం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని మాజీ మంత్రి జోగి రమేష్ ఆరోపించారు.అద్దేపల్లి జనార్దన్‌తో ఆ కుట్రలో భాగంగానే అభియోగాలు చేయిస్తున్నారన్నారు.ఈ మేరకు రమేష్ ఒక ప్రకటన విడుదల చేసారు.నకిలీ మద్యం కేసులో పీకలలోతుకు ఇరుక్కుపోయారన్నారు.ఈ విషయం నుంచి ప్రజల దృష్టి మరలించడానికి నానా పాట్లు పడుతున్నారన్నారు. నకిలీ మద్యం విషయంలో ప్రజలు ఇప్పటికే ఒక అవగాహనతో ఉన్నారన్నారు,లిక్కరు మంచిదా, నారావారి మార్కు మద్యమా అని ప్రశ్నిస్తున్నారన్నారు.

# కల్తీ మద్యం కేసులో మరొకరి అరెస్టు

**విజయవాడ,అక్టోబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** కల్తీ మద్యం కేసులో దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో మరో అరెస్టు చోటుచేసుకుంది. పోలీసులు చైతన్యబాబు (ఎ22) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. చైతన్యబాబు పెద్దతిప్ప సముద్రం మండలంలోని ఆంధ్రా వైన్స్‌లో పని చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు. తంబళ్లపల్లె కోర్టులో చైతన్యను ఎక్సైజ్ పోలీసులు హాజరుపరిచారు. ఇప్పటికే ఈ కేసులో ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దన్‌రావు సహా 13 మందిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ తాజా అరెస్టుతో కేసులో మొత్తం 14 మంది నిందితులు అయ్యారు.

**ప్రభుత్వం లక్ష్యం అసలైన నెట్ వర్క్‌ను బట్టబయలు చేయడం:**

నకిలీ మద్యం కేసు రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టించింది. ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడేలా అక్రమంగా మద్యం తయారీ, సరఫరా జరిగిందనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారి తీశాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఎవరినీ వదలకుండా, వాస్తవాలు వెలికి తీయాలని స్పష్టం చేసింది. మద్యం తయారీలో పాల్గొన్న సరఫరాదారులు, ఆర్థిక మద్దతుదారులు వంటి వారందరినీ గుర్తించాలన్నది సిట్ ప్రధాన లక్ష్యంగా ఉంది.

# ముగ్గురు ఆర్థికవేత్తలకు నోబెల్

**న్యూఢిల్లీ, అక్టోబరు 13:** ఆర్థిక శాస్త్రంలో ఈ ఏడాది ముగ్గురికి నోబెల్ పురస్కారం లభించింది. జోయల్ మోకిర్, ఫిలిప్ అఘియాన్, పీటర్ హోవిట్‌లను 2025 సంవత్సరానికి గాను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సోమవారం ప్రకటించింది. కొత్త ఆవిష్కరణలు ఆర్థిక వృద్ధిని ఎలా నడిపిస్తాయో వివరించినందుకు గాను వారికి ఈ గౌరవం దక్కింది. నిరంతర వృద్ధికి కొత్త సాంకేతికత ఎలా దోహదం చేయగలదో వారు వివరించారని పేర్కొంది. గత రెండు శతాబ్దాల్లో చరిత్రలో మొదటసారి ప్రపంచవ్యాప్తంగా నిరంతర వృద్ధి నమోదైనట్లు స్వీడిష్ అకాడమీ తెలిపింది. పెద్దసంఖ్యలో ప్రజలు పేదరికం నుంచి బయటపడమే కాకుండా ప్రపంచ శ్రేయస్సుకు పునాది వేసినట్లు పేర్కొంది.

నూతన ఆవిష్కరణలు ప్రపంచ పురోగతికి ఎలా దోహదం చేస్తాయో జోయల్ మోకిర్, ఫిలిప్, పీటర్ వివరించినట్లు స్వీడిష్ అకాడమీ తెలిపింది. మోకిర్, హోవిట్‌లు అమెరికాకు, అఘియన్ బ్రిటన్‌కు చెందిన ఆర్థిక నిపుణులు. గత రెండు శతాబ్దాలుగా ప్రపంచం చూస్తున్న నిరంతర ఆర్థిక ప్రగతి వెనుక ఉన్న కీలక సూత్రాలను ఈ ముగ్గురు తమ పరిశోధనల ద్వారా వెలుగులోకి తెచ్చారు. మానవ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా కొనసాగుతున్న ఈ వృద్ధి, కోట్లమందిని పేదరికం నుంచి బయటపడేసి నేటి మన సంపదకు పునాది వేసింది. ఈ ప్రగతికి వెనుక ఆవిష్కరణల పాత్రను అర్థమయ్యేలా చెప్పడమే వీరి పరిశోధనల సారాంశం. ఫిలిప్ అగియాన్, పీటర్ హోవిట్ కలిసి 'సృజనాత్మక విధ్వంసం' అనే సిద్ధాంతాన్ని రూపొందించారు. మార్కెట్‌లోకి ఒక కొత్త, మెరుగైన టెక్నాలజీ లేదా ఉత్పత్తి వచ్చినప్పుడు, పాత టెక్నాలజీపై ఆధారపడిన కంపెనీలు దెబ్బతింటాయని వీరు వివరించారు. ఈ ప్రక్రియ ఒకేసారి సృజనాత్మకంగా, అదే సమయంలో విధ్వంసకరంగా ఉంటుందని తెలిపారు. కొత్త ఆవిష్కరణ సమాజాన్ని ముందుకు తీసుకెళితే, పాత పద్ధతులు కనుమరుగవడం వల్ల జరిగే నష్టాన్ని 'విధ్వంసం'గా పేర్కొన్నారు. "ఆర్థిక వృద్ధిని తేలికగా తీసుకోలేమని ఈ విజేతల పరిశోధన స్పష్టం చేస్తోంది. మనం తిరిగి స్తబ్దతలోకి జారిపోకుండా ఉండాలంటే, సృజనాత్మక విధ్వంసానికి ఆధారమైన వ్యవస్థలను కాపాడుకోవాలి" అని ఎకనామిక్ సైన్సెస్ ప్రైజ్ కమిటీ ఛైర్మన్ జాన్ హాస్లర్ తెలిపారు.

# దేశ ప్రగతిలో ఎపి కీలకం

>> అతిథిగా ఆహ్వానించారు.సోమవారం జరిగిన ఈ సమావేశంలో సిఎం చంద్రబాబుతో పాటు కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్‌శేఖర్, అలాగే టిడిపి పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. మోడీతో భేటీకి ముందు ముఖ్యమంత్రి సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ, వాణిజ్య శాఖ, సిఐఐ ప్రతినిధులు పాల్గొన్నారు. చంద్రబాబు మాట్లాడుతూ సిఐఐ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి భారీ స్థాయిలో పెట్టుబడులను తీసుకురావడమే కాకుండా, ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పెంచుకోవాలి. ఈ వేదిక సరికొత్త ఆలోచనలకు, ఇన్నోవేషన్ భాగస్వామ్యానికి దారితీయాలి" అని అన్నారు. ఈ సదస్సు టెక్నాలజీ, ట్రస్ట్, ట్రేడ్ నావిగేటింగ్ ది జియోఎకనామిక్ ఆర్డర్ అనే థీమ్‌తో జరగనుంది. మొత్తం 13 సెషన్లు జరుగుతాయి. ఇందులో 29 మంది వాణిజ్య మంత్రులు, 80 మంది గ్లోబల్ సిఇఒలు, 40 దేశాల ప్రతినిధులు, 13 మంది కేంద్ర మంత్రులు పాల్గొనే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. అమెరికా, యూరప్, మధ్యప్రాచ్యం, ఆసియా, పశ్చిమాసియా దేశాల నుంచి ప్రతినిధులు పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. ఈ సమ్మిట్ నవ్యాంధ్రప్రదేశ్‌లో నాలుగోసారి జరుగుతోంది. గతంలో 2016, 2017, 2018 సంవత్సరాల్లో విశాఖపట్నం ఈ సదస్సుకు ఆతిథ్యం ఇచ్చింది. ఇప్పుడు నాలుగోసారి అదే నగరంలో జరిగే ఈ సదస్సు దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారి తీస్తోంది. చంద్రబాబు అధికారులకు సూచిస్తూ, విశాఖను సుందరంగా తీర్చిదిద్దాలి, విదేశీ అతిథులకు అత్యుత్తమ ఆతిథ్యం ఇవ్వాలి. ఈ సదస్సు ద్వారా ఎపి పెట్టుబడుల గమ్యస్థానంగా నిలవాలి" అని ఆదేశించారు. గ్రీన్ ఎనర్జీ, కృత్రిమ మేధస్సు, డిజిటల్ ఇన్నోవేషన్ రంగాల్లో ఆంధ్రప్రదేశ్ దేశానికి ఆదర్శంగా మారుతోందని చంద్రబాబు పేర్కొన్నారు. "గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, వంటి గ్లోబల్ టెక్ దిగ్గజ సంస్థలు రాష్ట్రంపై దృష్టి సారిస్తున్నాయి. త్వరలోనే ఎపి కృత్రిమ మేధస్సు, ఇన్నోవేషన్ హబ్‌గా మారుతుంది" అని అన్నారు. సదస్సు ఏర్పాట్లకు సమయం తక్కువగా ఉండటంతో అధికారులు వేగంగా సన్నాహాలు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ, సిఐఐ ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఎపిని గ్లోబల్ ఎకానమిక్ మ్యాప్‌లో ముందుండే రాష్ట్రంగా మార్చాలన్నదే మా లక్ష్యం. టెక్నాలజీ, విశ్వాసం, వాణిజ్య భాగస్వామ్యం ఈ సదస్సు ప్రధాన సూత్రాలు అవుతాయి" అని చంద్రబాబు స్పష్టం చేశారు. విశాఖ సదస్సు రాష్ట్ర భవిష్యత్తుకు మార్గదర్శిగా, పెట్టుబడుల ప్రవాహానికి వేదికగా నిలుస్తుందని ఆయన నమ్మకంగా చెప్పారు.ఈ బేటీలో భాగంగా ప్రధాని మోడీని సిఎం చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వం తరపున దుశ్శాలువాతో సత్కరించి.,వెంకటేశ్వరస్వామి ప్రతిమను జ్ఞాపికగా అందజేసారు.

# కోర్టుకు వచ్చి వివరణ ఇవ్వండి

>> జస్టిస్ ఎ హరిహరనాథ శర్మతో కూడిన ధర్మాసనం సోమవారం ఆదేశించింది. 2018 నవంబర్‌లో జారీ చేసిన ఎస్ఐ పోస్టుల భర్తీ నోటిఫికేషన్‌లో ట్రాన్స్ జెండర్లకు రిజర్వేషన్ కల్పన కాలమ్ లేదు. దీనిపై ట్రాన్స్ జెండర్ గంగాభవానీ 2019లో పిటిషన్ వేశారు. అప్లికేషన్‌లో స్త్రీ, పురుష కాలమ్స్ మాత్రమే ఉంటే, స్త్రీగా ఐచ్ఛికం తీసుకుని అప్లికేషన్ పెడితే రాతపరీక్షలో 35 శాతం మార్కులు సాధించినప్పటికీ తనను అనర్హురాలిగా ప్రకటించారనితెలిపారు. గంగా భవానీ పిటిషన్‌ను సింగిల్ జడ్జి కొట్టేయడంతో డివిజన్ బెంచ్ వద్ద 2022లో అప్పీల్ దాఖలు చేశారు. దీనిపై గతేడాది బెంచ్ విచారించి, గంగాభవానీకి ఉద్యోగ కల్పనపైచర్యలు తీసుకోవాలని ఆదేశించింది. హైకోర్టు ఆదేశాల మేరకు గంగా భవానీకి ఉద్యోగ వ్యవహారంపై హోంశాఖ ముఖ్య కార్యదర్శి నివేదిక ఇవ్వకపోవడంతో హైకోర్టు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. అదనపు ఎజి సాంబశివ ప్రతాప్ వాదిస్తూ, కుమార్ విశ్వజిత్ సెలవులో ఉన్నారని చెప్పారు. ఇన్‌ఛార్జి ముఖ్య కార్యదర్శిగా హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కుమార్ కోర్టుకు హాజరయ్యారని చెప్పారు. తదుపరి విచారణకు హాజరుకావాలని విశ్వజిత్‌ను ఆదేశించిన హైకోర్టు విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది.



సోమవారం ఇజ్రాయెల్ పార్లమెంటులో ట్రంప్‌కు జయజయధ్వానాలు చేస్తున్న ఎంపీలు

# ఇక తుపాకులు పేలవు..

## మారణహోమం అంటూ పలువురు ఎంపీల నిరసన

## ట్రంప్‌కు అత్యున్నత పురస్కారాలు అందించిన ఇజ్రాయెల్, ఈజిప్టు

## 20 మంది బందీలను విడుదల చేసిన హమాస్

## ఇజ్రాయెల్ జైళ్లనుంచి 2 వేల మంది ఖైదీల విడుదల

**టెల్‌అవీవ్, అక్టోబర్ 13:** ఇజ్రాయెల్ – హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం విషయంలో తాము విజయం సాధించామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌లో పర్యటిస్తున్న ఆయన ఆ దేశ చట్టసభలో మాట్లాడుతూ, "థ్యాంక్యూ వెరీమచ్ బీబీ, గొప్ప పని చేశావ్" అంటూ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును ప్రశంసించారు. మధ్యప్రాచ్యంలో సరికొత్త చరిత్ర ఆరంభమవుతోందని, ఈ పవిత్ర భూమిలో శాంతి నెలకొనడంతో ఆకాశం నిర్మలంగా మారిందని అన్నారు. ఈ ప్రాంతంలో తుపాకులు మూగబోయాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం అమెరికాలో ఉన్న స్వర్ణయుగం ఇజ్రాయెల్‌లో ప్రారంభమైందని, బందీలు తిరిగి రావడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. కాల్పుల విరమణ ఒప్పందం విషయంలో తాము సమయం వృథా చేస్తున్నామని చాలామంది అభిప్రాయపడ్డారని, కానీ చివరకు విజయం సాధించామని ట్రంప్ అన్నారు. అమెరికా ఎల్లప్పుడూ అండగా ఉంటుందని బాధిత కుటుంబాలకు ఆయన భరోసా ఇచ్చారు. ఇజ్రాయెల్, హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంలో మధ్యప్రాచ్యంలో అమెరికా ప్రత్యేక రాయబారిగా ఉన్న స్టీవ్ విట్కాఫ్, ఆయన సలహాదారు జేర్డ్ కుష్నర్ కీలక పాత్ర పోషించారని ట్రంప్ కొనియాడారు. ట్రంప్ ప్రసంగిస్తున్న సమయంలో కొందరు ఎంపీలు నిరసన వ్యక్తం చేశారు. "మారణహోమం" అంటూ నినాదాలు చేయడంతో వారిని సభ నుంచి బయటకు పంపించేశారు. ఈ నిరసనలపై సభాపతి ట్రంప్‌కు క్షమాపణ చెప్పారు.

**ఈ ప్రపంచానికి మరింత మంది ట్రంప్‌లు కావాలి**

ఇజ్రాయెల్ చట్టసభ సభ్యులు లేచి నిలబడి, చప్పట్లు కొడుతూ, ట్రంప్‌నకు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. ట్రంప్ లాంటి నేతలు ఈ ప్రపంచానికి మరింత మంది కావాలని కొనియాడారు. ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో స్పీకర్ అమీర్ ఒహానా డొనాల్డ్ ట్రంప్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. "జెరూసలేంకు వచ్చిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు స్వాగతం. తాము ఈ రోజు కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం. ట్రంప్ కేవలం మరొక అమెరికా అధ్యక్షుడు కాదు. ఆయన యూదుల చరిత్రలోనే ఒక గొప్ప దిగ్గజం. ఆయన సైరస్ ది గ్రేట్‌తో సమానం. నేటి ప్రపంచానికి కావాల్సింది ధైర్యవంతులు, బలవంతులు, దృఢ నిశ్చయం ఉన్న నాయకులు. అలాంటి లక్షణాలు ఉన్న వ్యక్తే ట్రంప్. ఆయన లాంటి నేతలు మరింత మంది ఈ ప్రపంచానికి అవసరం" అని ఇజ్రాయెల్ పార్లమెంట్ స్పీకర్ అమీర్ ఒహానా అన్నారు. దీనిపై ట్రంప్ తనదైన రీతిలో స్పందించారు. "ఇది నాకు దక్కిన గౌరవం" అని అన్నారు.

**డెడ్లీ వార్నింగ్‌తో...**

సుదీర్ఘకాలంగా ఇజ్రాయెల్–హమాస్ మధ్య గాజా స్ట్రిప్‌లో యుద్ధంజరుగుతోంది. దీనిని ఆపేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 21 సూత్రాలతో ఒక శాంతి సూత్రాన్ని రూపొందించారు. దీనిని భారత్, చైనా, రష్యాల సహా పలు ముస్లిం దేశాలు సమర్థించాయి. శాంతి ఒప్పందంలో భాగంగా హమాస్, తన చెరలోని బందీలు విడుదలచేయాలని, ఇజ్రాయెల్‌లో ఉన్న 2వేలకుపైగా పాలస్తీనా ఖైదీలను విడుదల చేయా లని ట్రంప్ సూచించారు. అంతేకాదు నెతన్యాహూను ఈశాంతి ఒప్పందానికి అంగీకరించేలా చేశారు. మరో వైపు, హమాస్‌కుకూడా డెడ్లీవార్నింగ్ఇచ్చారు. ఒకవేళ ఈ ఒప్పందాన్నిఅంగీకరించకపోతే, హమాస్‌కు నరకం చూపిస్తానని దిమ్మదిరిగేలా బెదిరించారు. దీనితో హమాస్‌దిగివచ్చి, ఒప్పందానికి అంగీకారం తెలిపింది.

**ట్రంప్‌కు ఇజ్రాయెల్, ఈజిప్టు అత్యున్నత పౌర పురస్కారాలు**

గాజా శాంతి ఒప్పందం కుదిర్చి, బందీల విడుదలకు కృషి చేసినందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఇజ్రాయెల్, ఈజిప్టు దేశాలు అరుదైన గౌరవాన్ని అందించనున్నట్లు ప్రకటించాయి. ఇజ్రాయెల్ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన "ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఆనర్"ను అమెరికా అధ్యక్షుడికి ప్రదానం చేయనున్నట్లు మాస్కో అధ్యక్షుడు ఇస్సాక్ హెర్జోగ్ వెల్లడించారు. ఈజిప్టు 'ది ఆర్డర్ ఆఫ్ ది నైల్' అవార్డును ఇవ్వనున్నట్లు అధ్యక్ష కార్యాలయం పేర్కొంది. బందీల విడుదల, చరిత్రాత్మక శాంతి ఒప్పందాన్ని సాధించడంలో చేసిన కృషికి గాను ఈ గౌరవాన్ని అందుకోవడానికి ట్రంప్ అర్హుడని ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఇస్సాక్ హెర్జోగ్ తెలిపారు. రానున్న నెలల్లో సమయం, వేదిక నిర్ణయించి ఇస్తామని పేర్కొన్నారు.

**బందీలను విడుదల చేసిన హమాస్**

మరోవైపు 20 మంది ఇజ్రాయెల్ బందీలను హమాస్ విడుదల చేసింది. తొలి విడతగా ఏడుగురిని విడుదల చేసిన కొద్దిసేపటికే మరో 13మంది విడుదల చేసింది. హమాస్ విముక్తి కల్పించిన వారిని రెడ్‌క్రాస్‌కు చెందిన బస్సుల్లో ఇజ్రాయెల్ సరిహద్దుల వరకు తీసుకెళ్తుండగా అక్కడి నుంచి హెలికాప్టర్లలో ఇజ్రాయెల్ సైన్యం తమ దేశానికి తీసుకెళ్లి చికిత్స అందిస్తోంది. రెండేళ్లుగా నరకయాతన అనుభవించిన తమ వారు విడుదల వడంతో కుటుంబసభ్యులు, శ్రేయాభిలాషుల్లో సంతోషం నెలకొంది. ఇందుకు ప్రతిగా ఇజ్రాయెల్ కూడా పాలస్తీనా ఖైదీలను మొత్తం 2వేల మంది బందీలను ఇజ్రాయెల్ విడుదల చేసింది.

# ఏడు రోజులుగా మార్చురీలోనే పూరన్ కుమార్ మృతదేహం

**హైదరాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** హరియాణాలో ఆత్మహత్యకు పాల్పడిన జైళ్ల శాఖ ఐజి ఎపికి చెందిన పూరన్ కుమార్ మృతదేహం ఏడు రోజులుగా ఛండీఘడ్‌లోని పోస్టు గ్రాడ్యుయేట్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసర్చ్ హాస్పిటల్‌లోనే వుంది. తన భర్త ఆత్మహత్యకు కారణమైన మాజీ డిజిపి శతృజిత్ సింగ్ కపూర్, రోహతక్ ఎస్పి నరేంద్ర బిజ్రానియా సహా ఇతరులపై చర్యలు తీసుకునే వరకు ఆయన మృతదేహాన్ని పోస్టుమార్టం చేసేందుకు అంగీకరించబోయని పూరన్ కుమార్ సతీమణి, సీనియర్ ఐఎఎస్ అధికారిణి అమ్నీత్ కుమార్ స్పష్టం చేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో ఛండీఘడ్ పోలీసులు దీనిపై ఎటూ తేల్చుకోలేక పూరన్ కుమార్ మృతదేహాన్ని పోస్టు గ్రాడ్యుయేట్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసర్చ్ హాస్పిటల్‌లోనే భద్రపరిచారు. ఈ విషయంలో సర్కారు తదుపరి ఆదేశాల కోసం ఛండీఘడ్ పోలీసులు ఎదురు చూస్తున్నారు. ఈ నెల ఏడవ తేదీన తన సర్వీస్ రివాల్వర్‌తో ఛండీఘడ్‌లోని తన బావమరిది ఇంట్లో పూరన్ కుమార్ ఆత్మహత్య చేసుకోవడం తెలిసిందే. పూరన్ కుమార్ ఆత్మహత్యపై స్పందించిన హరియాణా సర్కారు దీనిపై విచారణకు సిట్‌ను ఏర్పాటు చేసింది. అప్పట్లో డిజిపిగా వున్న శతృ జిత్ సింగ్ కపూర్‌ను, రోహతక్ ఎస్పి నరేంద్ర బిజ్రానియాలను తప్పించి ఇద్దరిని దీర్ఘకాలిక సెలవుపై పంపింది. పూరన్ కుమార్ సతీమణి చెబుతు న్నట్లుగా ఆయన ఆత్మహత్యకు కారకులైన అధికారులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం తప్పించి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అయితే సర్కారు చర్యలపై పూరన్ కుమార్ సతీమణి అమ్నీత్ కుమార్ సంతోషంగా లేరు. వీరిని సస్పెండ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు తెలంగాణ డిప్యూటీ సిఎం బట్టి విక్రమార్క సోమవారం నాడు ఛండీఘడ్ వెళ్లి పూరన్ కుమార్ సతీమణి అమ్నీత్ కుమార్‌ను పరామర్శిం చారు. అనంతరం ఆయన ఛండీఘడ్‌లోని పోస్టు గ్రాడ్యుయేట్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసర్చ్ హాస్పిటల్‌లో భద్రపరిచిన పూ ర న్ కుమార్ మృతదేహానికి నివాళులు అర్పించారు.

## వారం - వర్జ్యం

14-10-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
అష్టమి ఉ.11.13
పునర్వసు ఉ.11.58
వర్జ్యం : రా.7.59-9.36
దు.ఉ.8.22-9.09,
2) రా.10.31-11.18
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** అనుకూల ఫలితాలు అధికంగా ఉండటం వలన చెప్పుకోదగిన ఇబ్బందులు ఉండవు.

**వృషభం:** నూతన ప్రయత్నాలు ఫలిస్తాయి. సంబంధబాంధవ్యాలు మెరుగ్గా ఉంటాయి.

**మిథునం:** మిత్రులతో ఏర్పడిన వివాదాలు తొలుగుతాయి. ప్రయాణాలు.

**కర్కాటకం :**అనుకోని అవకాశాలు లాభిస్తాయి. వాహనాలు, స్థలాలు కొనుగోలు.

**సింహం:**దూరపు బంధువులను కలుసుకొని ఉల్లాసంగా గడుపుతారు.

**కన్య :** సమస్యల నుండి బయటపడతారు. ఉద్యోగలకు బదిలీలు వుంటాయి.

**తుల :** కాలానుగుణంగా పరిస్థితులను మార్చుకోగలుగుతారు.

**వృశ్చికం:**కుటుంబ పురోభివృద్ధి, సంఘంలో గౌరవమర్యాదలు పెంపొందుతాయి.

**ధనుస్సు:** స్పెక్యులేషన్ లాభించదు. వృత్తి ఉద్యోగ వ్యాపారాలు సానుకూలంగా ఉంటాయి.

**మకరం:** కార్యాలయంలో సెలవు కోసం మీరు చేసే యత్నాలు ఫలవంతం కాకపోవచ్చు.

**కుంభం:**మధ్యవర్తిత్వాలు చేయకండి. నూతన వస్తు, వస్త్రాలు కొనుగోలుచేస్తారు.

**మీనం :** ఇతరుల సలహాలు అతిగా స్వీకరిస్తారు. కానీ మీ మనస్సుకు తోచిన పనులనే చేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# అమరావతిలో స్పోర్ట్స్ సిటీ

>> షుల మరియు మహిళల విభాగాల్లో పోటీలు జరుగుతాయి. వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్ యూ) గుంటూరులోను, యోగా పోటీలు వెల్లూరు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విట్) అమరావతిలో జరుగుతాయి. 32 జట్లకు చెందిన 1010 మంది క్రీడాకారులు ఈ వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ లో పాల్గొంటున్నారు.ఈ పోటీలు సందర్భంగా హోం మంత్రి శ్రీమతి అనిత మాట్లాడుతూ.ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం క్రీడలకు పెద్దపేట వేస్తుందన్నారు.అమరావతి కేంద్రంగా నిర్మిస్తున్న " స్పోర్ట్స్ సిటీ"కి ఈ పోటీలు స్ఫూర్తిగా నిలిచి, భవిష్యత్తుల్లో నిర్వహించబోయే జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు వేదికగా నిలుస్తాయన్నారు. పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ లతో పాటు యోగాకు కూడా ఈ పోటీల్లో ప్రాధాన్యత ఇవ్వడం ఎంతో సంతోషకరమన్నారు. ఇటీవల విశాఖలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 3,20,000 మందితో యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి గిన్నీస్ వరల్డ్ రికార్డు నెలకొల్పిందన్నారు. యోగ మన సంస్కృతిలో, దైనందిన జీవితంలో భాగమైందన్నారు. శారీరక దృఢత్వానికి మరియు మానసిక స్థైర్యానికి ప్రతీకలుగా నిలిచే వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ మరియు యోగా వంటి క్రీడలు పోలీసు శాఖలో స్ఫూర్తిని నింపే అంశాలన్నారు.

# గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రమోషన్లు!

**విజయవాడ,అక్టోబరు 13,ప్రభాతవార్త ప్రతినిధి:** గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు కల్పించేలా ప్రభుత్వం కార్యాచరణ అడుగులు వేస్తోంది. ఈ ప్రక్రియలో భాగంగా సోమవారం జిఒ ఆర్‌టి నెంబరు 1859ని విడుదల చేసింది. ఉద్యోగుల ప్రమోషన్లు, వారి సమస్యలపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని మంత్రివర్గ ఉపసంఘాన్ని ఆదేశించింది. మంత్రివర్గ ఉపసంఘంలో సభ్యులుగా డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, మంత్రులు డోలా బాలవీరాంజనేయస్వామి, పయ్యావుల కేశవ్, పి నారాయణ, సత్యకుమార్ యాదవ్, కింజరాపు అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, సంధ్యారాణి, గొట్టిపాటి రవికుమార్ ఉన్నారు. మంత్రుల కమిటీ తన బాధ్యతలను నిర్వహించేందుకు అవసరమైతే ఏ ఇతర శాఖనుంచైనా నిపుణుడి సహకారం తీసుకోవచ్చని జిఒలో పేర్కొంది. మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించడం పట్ల గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక ఛైర్మన్ ఎమ్‌డి జానిపాషా, సెక్రటరీ జనరల్ విప్పర్తి నిఖిల్‌కృష్ణ, కన్వీనరు షేక్ అబ్దుల్ రజాక్ హర్షం వ్యక్తం చేశారు.

# వైద్య కళాశాలల్లో 300 ఎంబిబిఎస్ సీట్ల పెంపునకు కేంద్రం అనుమతి

**విజయవాడ,అక్టోబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో అదనంగా వైద్య కళాశాల్లో 300ల ఎంబీబీఎస్ సీట్లు పెంపుకు కేంద్ర ప్రభుత్వం(జాతీయ మెడికల్ కౌన్సిల్) అనుమతినిచ్చింది.దేశంలో ఈ ఏడాది కొత్తగా 9,075 ఎంబీబీఎస్‌సీట్లుకు కేంద్రం అనుమతినిచ్చింది.ఈ క్రమంలో ఏపీ 300 ఎంబీబీఎస్ సీట్లు కేటాయించింది.ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాలకు ఇప్పటికే 50 అదనపు సీట్లు.నంద్యాలలోని శాంతి రామ్ వైద్య కళాశాలకు అదనంగా 100 సీట్లు.తిరుపతిలో అన్నా గౌరీ కళాశాలకు 150 సీట్లు.. నేషనల్ మెడికల్ కౌన్సిల్ అనుమతులిచ్చింది.

# సిఆర్‌డిఏ భవనం ప్రారంభం

**విజయవాడ,అక్టోబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని నిర్మాణానికి భూ సమీకరణ అనే కొత్త విధానాన్ని తెచ్చామని ఎపి సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు.సమీకరణ విధానాన్ని సక్సెస్ చేసిన చరిత్ర అమరావతి రైతులదేనన్నారు. ప్రపంచంలో ఎక్కడా ల్యాండ్ పూలింగ్ విధానం లేదు.. మనమే ఈ విధానాన్ని తెచ్చాంసక్సెస్ చేశామన్నారు.రాజధాని అమరావతిలో సిఆర్‌డిఏ ప్రధాన కార్యాలయ భవనాన్ని సిఎం చంద్రబాబు సోమవారం ప్రారంభించారు. ఇందుకు సంబంధించిన శిలా ఫలకాలను ఆవిష్కరించారు. మొదట పూర్ణకుంభం, వేదాశీర్వచనాలతో ఆయనకు వేద పండితులు స్వాగతం పలికారు. భూములిచ్చిన రైతులను సిఎం ఆత్మీయంగా పలకరించారు. భవనాన్ని ప్రారంభించినసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధాని అమరావతి ప్రాంత రైతుల త్యాగాలను ఎప్పటికీ మరువనని అన్నారు. రైతుల అవస్థలు చూశానని, రోడ్డెక్కి ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. రాజధాని ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. అమరావతిలో సిఆర్‌డిఏ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం సిఎం మాట్లాడారు. అమరావతి పనుల రీస్టార్ట్‌తర్వాత మొదటిగా సిఆర్‌డిఏ బిల్డింగ్ ప్రారంభమైందన్నారు.ఇది నాకు సంతోషంగా ఉందన్నారు.అమరావతి మహిళా రైతులు రోడ్డెక్కి పోరాడారు.అనేక ఉద్యమాలు చేశారన్నారు.రైతుల ఉద్యమానికి మద్ధతుగా నేను కూడా జోలె పట్టాను...ఉద్యమానికి అండగా నిలిచానన్నారు.వారు పడిన కష్టాలు మరిచిపోవద్దు. మీరు చేసిన త్యాగాల ఫలితాలను మీరే అనుభవించాలన్నారు.నేను దానికి పూర్తిగా కట్టుబడి ఉన్నాను. ఫేజ్1లో ల్యాండ్ పూలింగ్ కింద భూములిచ్చారు. భూములిచ్చినందుకు గత పాలకులు మిమ్మల్ని నానా హింసలు పెట్టారు.రాజధాని ఎడారి అన్నారు వేశ్యల రాజధాని అన్నారుఎంతో అపహాస్యం చేశారు.మీకు రెట్టింపు గౌరవం దక్కేలా...రెట్టింపు ఫలాలు అనుభవించేలా మేము చేస్తాం.హైటెక్ సిటీ నిర్మాణం మొదలు పెట్టే నాటికి అక్కడ ఎకరం రూ. లక్ష ఉండేది ఇప్పుడు రూ.177 కోట్లకు చేరింది. అమరావతి ప్రాజెక్టు సెల్ఫ్ ఫైనాన్స్ విధానంలో నిర్మిస్తున్నాం... విమర్శలు చేసే వారంతా ఈ విషయాన్ని గమనించాలన్నారు. అమరావతి ఓ మునిసిపాలిటీగా మిగిలిపోకూడ దంటే అందుకు తగ్గ మౌలిక సదుపాయాలు అవసరమన్నారు. అమరావతి పరిపాలనకు కేంద్ర బిందువుగా ఉంటుంది.రైతులు వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుంటే అనుకున్న లక్ష్యాలుసాధిస్తారు.అమరావతి అభివృద్ధికి ఆటంకాలు లేవన్నారు.అమరావతిని క్వాంటంవ్యాలీ చేస్తున్నాం. అమరావతి రైతుల అభివృద్ధికి అండగా ఉంటాం. ఒకసారి జరిగిన తప్పుకు రైతులు, నేను, రాష్ట్రం ఎంత నష్టపోయిందో అందరికీ తెలుసు.మళ్లీ అలాంటి తప్పులు జరగకూడదు.కూటమి ప్రభుత్వం శాశ్వతంగా ఉండాలి.పవన్ కల్యాణ్, బిజెపిలతో కలిసి ముందుకెళ్తున్నాం మీరంతా సహకరించాలి అన్నారు.



సోమవారం సిఆర్‌డిఏ భవనాన్ని ప్రారంభించిన సిఎం చంద్రబాబు

# అమరావతి రైతుల త్యాగాలు మరువను :సీఎం చంద్రబాబు

## - రైతులను సత్కరించిన ముఖ్యమంత్రి



రైతులు,ఇతరులతో చంద్రబాబు సముహ ఛాయా చిత్రం

**విజయవాడ,అక్టోబరు 13,పభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతి ప్రాంత రైతుల త్యాగాలను ఎప్పటికీ మరువనని సీఎం చంద్రబాబు అన్నారు. రైతుల అవస్థలు చూశానని...రోడ్కెక్కి ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. రాజధాని ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. అమరావతిలో సీఆర్డీఏ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం సిఎం మాట్లాడారు. 'ఇవాళ చాలా ఆనందంగా ఉంది. మొదటిగా సీఆర్డీఏ భవనం ప్రారభమైంది.'ఇవాళ చాలా ఆనందంగా ఉంది. మొదటిగా సిఆర్డీఏ భవనం ప్రారంభమైంది. తొలిసారి ల్యాండ్ పూలింగ్ కింద భూములిచ్చిన చరిత్ర అమరావతి రైతులది. రాబోయే రోజుల్లో ప్రభుత్వ,ప్రైవేటు భవనాలు వస్తాయి.భూములిచ్చిన రైతులను ఆయన వేదికపై సత్కరించారు.వారితో సముహ ఛాయా చిత్రం దిగారు.ఇదొక అనుభూతే కాదు,మీ త్యాగాలను భవిష్యత్తు తరలాలకు తెలిపే మహోన్నత చరిత్ర పుటల్లో నిలిచే సాక్ష్యమని చంద్రబాబు వ్యాఖ్యానించారు.రాష్ట్ర విభజన జరిగినప్పుడు రాజధాని కూడా లేని పరిస్థితి రాజధాని ఎక ్కడో చెప్పకుండా అప్పటి కేంద్ర ప్రభుత ్వం రాష్ట్ర విభజన చేసింది. రాష్ట్ర భవిష్యత్తుకు ఉపయోగపడేలా...ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా నిర్మించాలని ఆనాడు నిర్ణయం తీసుకున్నాం. విజయవాడ-గుంటూరు మధ్యలో రాజధాని ఉంటే బాగుంటుందని నిర్ణయించాం.అప్పటికే ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్ తయారు చేశాం.రాజధాని నిర్మాణానికి భూములు ఇచే ్చందాఉకు రైతులు స్వచ్ఛంధంగా ముందుకొచ్చారు. ప్రపంచ చరిత్రలో ఇంత పెద్ద మొత్తంలో భూసమీకరణ జరిగింది. ఒక్క అమరావతిలోనే గతంలో హైటెక్ సిటీ నిర్మించినప్పుడు నా విజన్ చెబితే అవహేళన చేశారు. హైదరాబాద్‌లో 5వేల ఎకరాల్లో ఎయిర్‌పోర్టు నిర్మించాం. ఎయిర్‌పోర్టుకు భూమి ఇవ్వాలని ఆనాడు కోరితే రైతులు వెంటనే ఇచ్చారు. అక్కడ భూములు కొన్నవారు బ్రహ్మాండంగా బాగుపడ్డారు' అని చంద్రబాబు అన్నారు. రాజధాని రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ముగ్గురికి చంద్రబాబు భాధ్యతలు అప్పగించారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్,మంత్రి నారాయణ, ఎంఎల్ఏ శ్రావణ్‌కుమార్‌కు అప్పగిస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఏ సమస్య ఉన్నా ఈ ముగ్గురు నేతలతో చెప్పి పరిష్కరించుకోవాలని సూచించారు. నేతలు సైతం తరచూ రైతులతో సమావేశాలు నిర్వహించాలని సిఎం ఆదేశించారు. అమరావతిలోని సీఆర్డీఏ ప్రాజెక్ట్ కార్యాలయ భవనం ప్రతిష్టాత్మకమైన నెట్ జీరో ఎనర్జి(డిజైన్) ధృవపత్రం సాధించింది. ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీఎస్) ప్రతినిథులు ఈ అవార్డును ఆదివారం ఏపీ సీఆర్‌డీఏ కమీషనర్ కన్నబాబుకు ప్రదానం చేశారు. అమరావతిలో ఈ తరహా గుర్తింపు పొందిన తొలి భవనంగా సీఆర్డీఏ ప్రాజెక్ట్ కార్యాలయం నిలవడం విశేషం. వార్షిక విద్యుత్ అవసరాలన్నింటినీ పునరుత్పాదక శక్తి వనరుల ద్వారా సమకూర్చుకునేలా ఈ భవ నాన్ని రూ పొం దిం చా రు. దీని కోసం 540 కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ సిస్టంను అమర్చారు. మిగిలిన అవసరాల కోసం పునరుత్పాదక శక్తి వనరుల సమర్థ వినియోగం ద్వారా పూర్తి స్థాయిలో నెట్ జీరో ఎనర్జీ' సాధించింది. ఈ సందర్భంగా కమీషనర్ కె.కన్నబాబు మాట్లాడుతూ...ఈ గుర్తింపు పర్యావరణ పరిరక్షణను ప్రతిబింబిస్తుందన్నారు.

## 15 నుంచి హుబ్లీ - గుంతకల్లు

# మెమో పాసింజర్




**గుంతకల్లు రైల్వే , అక్టోబర్ 13, ప్రభాత వార్త:** ప్రస్తుతం హుబ్లీ గుంతకల్లు హుబ్లీ మధ్య తిరిగే పాసింజర్ రైలుకు ఈనెల 15 అత్యాధునిక యాంత్రిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన మెమో బోగీలతో నడుపుతున్నట్లు రైల్వేవర్గాలు తెలిపాయి. ప్రతి రోజూ నైరుతి రైల్వే హుబ్లీదక్షణ మధ్య రైల్వే గుంతకల్లు మధ్య తిరిగే నెంబర్ 56911/12 పాసింజర్ రైలుకు ఈనెల 15 నుంచి అత్యాధునిక యాంత్రిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన మెయిన్ లైన్ ఎలెక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్ (మెమో) బోగీలతో నడుపుతున్నట్లు తెలిపారు.

# సమాచార పౌర సంబంధాల సంచాలకుడుగా కె.ఎస్. విశ్వనాథన్ బాధ్యతల స్వీకారం



**విజయవాడ,అక్టోబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్ర ప్రదేశ్ సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులుగా కె.ఎస్. విశ్వనాథన్ బాధ్యతలు స్వీకరించారు.సోమవారం ఉదయం ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ లో గల సమాచార పౌర సంబంధాల శాఖ రాష్ట్ర కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సమాచార శాఖ సంచాలకులుగా ఉన్న హిమాన్షు శుక్లా శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా నెల్లూరు కలెక్టర్ గా ప్రభుత్వం బదిలీ చేసిన అనంతరం ప్రఖర్ జైన్ కు సమాచార పౌర సంబంధాల శాఖ అదనపు బాధ్యతలు అప్పగించారు. విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్మెంట్ అథారిటీ కమిషనర్ గా ఉన్న కె.ఎస్. విశ్వనాథన్ ను సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు గా నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. గతం లో ఆయన అనంతపురం అసిస్టెంట్ కలెక్టర్ గా, నరసాపురం సబ్ కలెక్టర్ గా, ప్రకాశం, విశాఖపట్టణం జిల్లాల జాయింట్ కలెక్టర్ గా బాధ్యతలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో బాధ్యతలు స్వీకరించిన విశ్వనాథన్ కు సమాచార శాఖ ఉన్నతాధికారులు, అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం శాఖ కార్యకలాపాలు, నిర్వర్తిస్తున్న విధులపైఅధికారులతోనూతనసంచాలకులు సమీక్షించారు.

# గిరిజన విద్యార్థినిల మృతిపై ఎన్ హెచ్ ఆర్ సి కి ఫిర్యాదు

## అరకు ఎంపి ఆధ్వర్యంలో గిరిజన మాజీ ఎమ్మెల్యేలు

**కురుపాం (పార్వతీపురం మన్యం జిల్లా), అక్టోబర్ 13 ప్రభాతవార్త:** పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం కురుపాం కేంద్రంగా ఉన్న రెండు గిరిజన పాఠశాలల్లో పచ్చకామెర్ల వ్యాధితో ఇద్దరు మృతి చెంది వందల సంఖ్యలో వ్యాధితో గిరిజన విద్యార్థినిలు ఆసుపత్రిలో చికిత్స పొందినప్పటికీ మెరుగైన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని కనుక వెంటనే చర్యలు తీసుకోవాలని ఢిల్లీలో ఎన్ హెచ్ ఆర్ సి ఛైర్మన్‌కి ఫిర్యాదు చేశారు. సోమవారం ఢిల్లీలో గల నేషనల్ హ్యూమన్ రైట్స్ ఛైర్మన్‌కు అరకు ఎంపీ తనుజారాణి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ గిరిజన మాజీ ఎమ్మెల్యేలు మాజీ ఉప ముఖ్యమంత్రిలు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన్యం జిల్లా కురుపాం మండలంలో గల గురుకుల పాఠ శాలలో కల్పన, అంజలి అనే గిరిజన విద్యార్థినిలు మృతి చెందారని, ఇప్పటికీ విశాఖ కేజీ హెచ్, పార్వతీపురం మన్యం జిల్లా కేంద్ర ఆస్పత్రిలోనూ, కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రంలోనూ చికిత్స పొందుతున్నారని అన్నారు. అంతేకాకుండా గురుకుల సమీపంలో గల ఏకలవ్య పాఠశాలలో కూడా సుమారు 30 మంది వరకు వ్యాధి సోకి ఆసుపత్రి పాలయ్యారని అన్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన వైద్యం చేయించటంలో చర్యలు చేపట్టలేదని వారు ఫిర్యాదుల పేర్కొన్నారు. ముఖ్యంగా నీటి కాలుష్యం అవ్వడం, మలం నీరు కలవడం వలన వ్యాధి విద్యార్థులందరికీ వ్యాపిస్తుందని వారు పేర్కొన్నారు. చనిపోయిన విద్యార్థుల తల్లిదండ్రులకు నష్టపరిహారమైనా చెల్లించలేదని వారు అన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని ఛైర్మన్‌ను కోరినట్లు తెలిపారు. విద్యార్థినిలకు ఇలా జరగడం దురదృష్టకరమని విద్యార్థులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని ఎన్ హెచ్ ఆర్ డి ఛైర్మన్ స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ తనుజా రాణి, పుష్ప శ్రీవాణి, రాజన్నదొర, పార్వతీపురం మన్యం జిల్లా వైసీపీ పార్టీ అధ్యక్షుడు పరీక్ష రాజ్, అరకు పార్లమెంట్ పరిధిలో గల ఎమ్మెల్యేలు, మాజీ గిరిజన ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# అమరావతి షాపింగ్ ఫెస్టివల్ పోస్టర్లను ఆవిష్కరించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ



**విజయవాడ,అక్టోబరు13,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్ 2025 నేటి నుంచి 19వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ కలెక్టర్ కార్యాలయంలో వివిధ మోటారు వాహనాల షోరూముల యజమానులు, ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. షాపింగ్ ఫెస్టివల్ కు సంబంధించిన వివరాలను తెలియజేశారు. జీఎస్టీ సంస్కరణల ఫలాలు ఇటు వినియోగదారులకు అటు వ్యాపార, వాణిజ్య సంస్థలకు అందేలా ప్రత్యేక ప్రచారంతో అవగాహన కార్యక్రమాలతో పాటు వివిధ వినూత్న కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్ లో స్టాళ్లు ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. మోటార్ వాహనాలకు సంబంధించి తగ్గిన జీఎస్టీ వివరాలను స్టాళ్లలో ప్రదర్శించడంతోపాటు బ్రాండ్ ప్రమోటింగ్ చేసుకోవచ్చన్నారు.సమావేశంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ అలీ, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ లక్ష్మీశ.. కార్లు, బైకులు, ఆటోలు తదితర వాహనాల షోరూంల యజమానులు, ప్రతినిధులతో కలిసి గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్ కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. సమష్టి భాగస్వామ్యంతో ఫెస్ట్ ను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ వాణిజ్యం, వినోదానికి వేదికగా నిలిచే షాపింగ్ ఫెస్టివల్‌లో వ్యాపారులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, హస్తకళాకారులు.. ఇలా వివిధ వర్గాలవారు తమ స్టాళ్లను ఏర్పాటుచేసుకొని బ్రాండ్ ప్రమోటింగ్ చేసుకోవచ్చన్నారు. వ్యాపార, వాణిజ్య సంస్థలు జీఎస్టీ ప్రయోజనాలు కల్పించడంతో పాటు దీపావళి పండగ సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు, రాయితీలు ప్రకటిస్తాయన్నారు. మెగా లక్కీ డ్రాలతో పాటు ఉత్తమ స్టాళ్లకు అవార్డులు కూడా అందించనున్నట్లు వెల్లడించారు. దాదాపు 100 స్టాళ్లతో ఏర్పాటుచేసే ఈ ఫెస్ట్‌లో జీఎస్టీ సంస్కరణల ఫలాలపై మేధోమథన చర్చలు, సమావేశాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ భాగస్వాములై ఈ ఫెస్ట్‌ను విజయవంతం చేయాలని, స్థానిక వ్యాపారులు, ప్రజలు ఫెస్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు...సూపర్ జీఎస్టీతో ప్రతి కుటుంబానికి రూ. 12 వేల వరకు ఆదా.. సూపర్ జీఎస్టీతో రాష్ట్ర ప్రజలకు దాదాపు రూ. 8 వేల కోట్లు, జిల్లా ప్రజలకు రూ. 250 కోట్లు రూ. 300 కోట్లు ఆదా అవుతుండగా ప్రతికుటుంబానికి నెలకు రూ. 6 వేలు నుంచి రూ. 12 వేల వరకు ఆదా అవుతుందని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలపై గతంలో 28 శాతం జీఎస్‌టీ ఉండగా జీఎస్‌టీ 2.0 సంస్కరణలతో అది 18 శాతానికి తగ్గిందన్నారు. సోలార్ వాటర్ హీటర్లు, కుట్టు మిషన్లు, వాకీటాకీలపై గతంలో 12 శాతం ఉన్న జీఎస్టీ నేడు 5 శాతానికి తగ్గిందని.. అదేవిధంగా సబ్బులు, టూత్‌పేస్టులు, వంటనూనెలు, డిటర్జెంటులు వంటి నిత్యావసర ఎఫ్ఎంసీజీ వస్తువులపై గతంలో 18 శాతం జీఎస్టీ ఉండగా అది 5 శాతానికి తగ్గిందని వివరించారు. బీమా, ఆరోగ్య పాలసీలపై గతంలో 18 శాతం జీఎస్టీ ఉండగా అది నేడు సున్నా శాతం అయిందన్నారు. హస్తకళల ఉత్పత్తులు, టెక్స్‌టైల్స్‌పై 12 శాతం ఉన్న జీఎస్టీ అయిదు శాతానికి తగ్గిందని.. మిక్సీలు, కుక్కర్లు, గ్రైండర్లు, ఫ్యాన్లు వంటి వస్తువులపై గతంలో 18 శాతం జీఎస్టీ ఉంటే అది అయిదు శాతానికి తగ్గిందని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు.

# ఖరీఫ్‌లో 30లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కొనుగోలు లక్ష్యం

## : ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు

**సచివాలయం,అక్టోబర్ 13,ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఈఏడాది ఖరీఫ్‌సీజన్‌లో భారత ప్రభుత్వం ద్వారా 30లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణకు కేంద్ర ప్రభుత్వం అనుమతించిందని భారత ఆహార సంస్థ రాష్ట్రస్థాయి సంప్రదింపుల కమిటీ ఛైర్మన్,పార్లమెంట్ సభ్యులు,లావు శ్రీకృష్ణ దేవరాయలు తెలిపారు.నగరంలోని పటమట యనమలకుదురు రోడ్డులోని భారత ఆహార సంస్థ ప్రాంతీయ కార్యాలయంలో భారత ఆహార సంస్థ రాష్ట్రస్థాయి సంప్రదింపుల కమిటీ సమావేశాన్ని ఛైర్మన్ లావు శ్రీకృష్ణ దేవరాయలు అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా ఛైర్మన్ లావు శ్రీకృష్ణ దేవరాయలు పాత్రికేయులతో మాట్లాడుతూ రైతు పండించిన ప్రతిగింజను కొనుగోలు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు.గత ఏడాది ఖరీఫ్‌లో 15.92లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సంస్థ ద్వారా కొనుగోలు చేశామన్నారు.ఈ ఏడాది ఖరీఫ్‌లో 30లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణకు కేంద్ర ప్రభుత్వం అనుమతించినట్లు తెలిపారు.ఎఫ్‌సీఐ నుంచి పంజాబ్ రాష్ట్రం తర్వాత 14లక్షల టన్నుల బియ్యాన్ని 10శాతం బ్రోకెన్‌తో సేకరించడానికి అనుమతి ఉన్న రెండో రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని అన్నారు.రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిశాయని దాంతో పంట దిగుబడి మరింత పెరిగే అవకాశం ఉందని,దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# రాష్ట్రంలో ట్రాన్స్‌కోను మరింత బలోపేతం చేయడమే లక్ష్యం

## నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రాధాన్యం - జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్

**విజయవాడ, అక్టోబర్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా నిరంతరం నాణ్యమైన, నమ్మకమైన, నిరంతర విద్యుత్ సరఫరాను సమర్థవంతంగా కొనసాగించడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ (ఏపిట్రాన్స్‌కో) నిరంతర అభివృద్ధికి, సంస్థను మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఏపిట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ జి. సూర్య సాయి ప్రవీణ్ చంద్ తెలిపారు. ఏపిట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా సోమవారం స్థానిక విద్యుత్ సౌధలో బాధ్యతలు స్వీకరించారు. విద్యుత్ ప్రసార నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడం, ఆపరేషనల్ సామర్థ్యాన్ని పెంచడం, నాణ్యతా ప్రమాణాలను పాటించడం కోసం ఏపిట్రాన్స్‌కో అనేక ఉత్తమ పద్ధతులను అమలు చేస్తోందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది అందరి సమిష్టి కృషితో ఏపిట్రాన్స్‌కో దేశంలోనే అగ్రభాగాన నిలుస్తుందని, ధీమా వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఇంధన శాఖా మంత్రి గొట్టిపాటి రవి కుమార్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. విజయానంద్‌లు తనపై విశ్వాసం ఉంచి ఈ బృహత్తర బాధ్యతలు తనకు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ఇంధన రంగ లక్ష్యాలను సాధించేందుకు పూర్తి నిబద్ధతతో పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఏపిట్రాన్స్‌కో అభివృద్ధికి ఉద్యోగులందరి సహకారం, టీమ్ వర్క్ ప్రధాన బలంగా ఉంటాయని ఆయన పేర్కొంటూ అధికారులు, ఇంజినీర్లు, సిబ్బంది అందరూ సమిష్టిగా, కొత్త ఉత్సాహంతో కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. విద్యుత్ రంగంలో సేవ చేయడం ఒక గొప్ప అవకాశం గా భావిస్తున్నానని, రాష్ట్ర అభివృద్ధి కి అనుగుణంగా విద్యుత్ ప్రసార, మౌలిక సదుపాయాల పురోగతికి కృషి చేస్తానని తెలిపారు.ఈ సందర్భంగా ఏపిట్రాన్స్‌కో డైరెక్టర్లు ఏ కె వీ భాస్కర్ , జె వీ రావు , ఎన్ వీ రమణ మూర్తి , ఏ పీ ట్రాన్స్కో అడిషనల్ సెక్రటరీ పెద్ది రోజా, విద్యుత్ సంస్థల సీనియర్ అధికారులు, సిబ్బంది ప్రవీణ్ చంద్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఇక ప్రవీణ్ చంద్ 2019 బ్యాచ్ ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్) అధికారి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆయన ఐఐటీ పాట్నా నుండి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో బాచిలర్ డిగ్రీ పొందారు. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్ష 2018లో ఆల్ ఇండియా 64వ ర్యాంక్ సాధించి 27 ఏళ్ల వయసులో ఐఎఎస్‌గా చేరారు. తన సర్వీస్ లో అనేక కీలక పదవులను నిర్వర్తించారు అనంతపురం అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనింగ్ లో), మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ మరియు అర్బన్ డెవలప్‌మెంట్ శాఖలో అండర్ సెక్రటరీ, విజయవాడ సబ్ కలెక్టర్, కడప మునిసిపల్ కమిషనర్, ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (ఏపీసీఆర్‌డీఏ) అదనపు కమిషనర్‌గా పనిచేస్తూ ఏపీ ట్రాన్స్కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గా నియమితులయ్యారు.



# తిరుమల సమాచారం

## టిటిడి ట్రస్ట్‌లకు రూ.1.05కోట్ల విరాళం



**తిరుమల,అక్టోబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలతిరుపతిదేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు ట్రస్ట్‌లు, పథకాలకు భక్తులైన దాతలు తమవంతుగా విరాళా లందించి అవసరమైన వారికి సేవలందిం చేందుకు ముందుకు వస్తున్నారు. ఇందులో భాగంగా తిరుమలకు వచ్చిన భక్తులకు ఆకలి అనేది తెలియకుండా నిరంతరాయంగా రుచిగా శుచిగా అందిస్తున్న ఉచిత అన్నప్రసాదం ట్రస్ట్‌కు గుంటూరుకు చెందిన అభయహస్త ఫైనాన్స్ సర్వీసెస్ సిఎఫ్ఓ సింహాద్రి వెంకట శివప్రసాద్ 10,00,116 రూపాయలు విరాళాల డిడిని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు అందజేశారు. సోమవారం సాయంత్రం ఈ విరాళాలను టిటిడి బోర్డుసభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, జంగా కృష్ణమూర్తితో కలసి దాత అందించారు. అలాగే టిటిడి ఎస్వీప్రాణదానం ట్రస్ట్‌కు హైదరాబాద్‌కు చెందిన ఏడిఓ ఫౌండేషన్ ఎన్జీఓ సంస్థ 75లక్షల రూపాయలు డిడిని ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు అందజేశారు. టిటిడి బర్డ్ ట్రస్ట్‌కు బెంగుళూరుకు చెందిన ఎం. రాకేశ్‌రెడ్డి టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరిని కలసి 10లక్షలు రూపాయలు డిడి అందజేశారు. తిరుపతికి చెందిన బాలాజీ రైల్వేడివిజన్ సాధనసమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ ఎస్వీ విద్యాదానం ట్రస్ట్‌కు 10లక్షలు రూపాయలు చెక్కును అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు. ఈ సందర్భంగా దాతల ఉదారతను టిటిడి అభినందించింది.

## 'తుంబురుతీర్థం'లో నిరంతర పుణ్యస్నానాలెప్పుడో?

### - సకల పాపాలు తొలగిపోతాయని విశ్వాసం



**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** శేషాచలంకొండల్లో వెలసిన కలియుగవైకుంఠం తిరుమల పవిత్ర పుణ్యక్షేత్రంలో మూడున్నరకోట్ల పుణ్యతీర్థాల్లో తుంబురుతీర్థం పుణ్యస్నానాలకు సాధారణ రోజుల్లోనూ భక్తులను అనుమతించే విషయంపై చర్చ మొదలైంది. ఈ పుణ్యతీర్థం తిరుమల రిజర్వుఫారెస్ట్ పరిధిలో ఉండటంతో సాధారణ రోజుల్లో భక్తులను అనుమతించడంలేదు. సప్తగిరులపై ప్రకృతి సిద్దంగా వెలసిన తీర్థాలలో ఏడుతీర్థాలు అత్యంత పవిత్రమైనవిగా ధర్మ,జ్ఞాన, భక్తి,వైరాగ్య ముక్తి ప్రదాయాన్ని కలిగిస్తాయని ప్రగాఢ విశ్వాసం. శ్రీవారిపుష్కరిణి, రామకృష్ణ తీర్థం, ఆకాశగంగ, పాపవినాశనం, కుమారధార, తుంబురుతీర్థం,పాండవతీర్థం ఈ పుణ్యతీర్థాల్లో ఏడాదికోసారి మాత్రమే కొన్ని పుణ్యఘడియలు ప్రవేశిస్తాయి. ఈ సమయాల్లో ఆయా తీర్థాల్లో ముక్కోటి ఉత్సవాలు నిర్వహించి ,భక్తులు స్నానాలాచరించేలా టిటిడి అధికారులు ఏర్పాట్లు చేస్తారు. తుంబురుతీర్థంలో స్నానమాచరిస్తే సకల పాపాలు తొలగి ముక్తికలుగుతుందని భక్తుల విశ్వాసం. ఇదే ప్రగాఢనమ్మకంతో తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అటవీశాఖ అధికారులతో కలసి రెండునెలల ముందు తుంబురుతీర్థం పర్యటించారు. ఈ తీర్థంలో ఉన్న సదుపాయాలు, సాధారణ రోజుల్లోనూ భక్తులను అనుమతించి పుణ్యస్నానాలాచరించేలా చూస్తే ఎలా ఉంటుందనే కోణంలో ఆరా తీశారు. తుంబురుతీర్థ ముక్కోటి మార్చి,ఏప్రిల్ నెలల్లో పాల్గుణ పౌర్ణమి, చైత్ర పౌర్ణమి రోజుల్లోమాత్రమే అనుమతించడం వల్ల చాలామంది భక్తులు తుంబుతీర్థంను సందర్శించలేకపోతున్నారని తెలుసుకున్నారు. ఆ రెండుప్రత్యేక రోజుల్లో సుమారుగా 25వేల మంది వరకు భక్తులు ఈ తీర్థంలో పవిత్ర స్నానాలాచరిస్తారు. రిజర్వుఫారెస్ట్‌లో ఉండటంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా టిటిడి పెద్దఎత్తున ఏర్పాట్లుచేస్తుంది. నిరంతరాయంగా అన్నప్రసాదాలు, మజ్జిగ,తాగునీరు, వైద్యశిబిరాలు వంటివి సౌకర్యాలు కల్పిస్తారు. తీర్థానికి చేరుకునేందుకు సులభంగా అవసరమైన నిచ్చెనలు,తాగునీటి కొళాయిలు ఏర్పాటుచేస్తారు. దీర్ఘకాలిక వ్యాధులైన ఆస్తమా, స్థూలకాయం, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడే వారిని తీర్థానికి అనుమతించరు. ఈ నేపథ్యంలో తిరుమలలో పాపవినాశనం జలాశయాంలో ప్రతిరోజూ భక్తులు స్నానమాచరించినట్లే తుంబురుతీర్థంకు అనుమతించే విషయంపై స్వయంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ప్రత్యేక చొరవ తీసుకోవడంతో టిటిడి అధికారులు, అటవీశాఖ నుండి ఎలాంటి సహకారం, అనుమతులు లభిస్తాయనేది కూడా చూడాల్సి ఉంది. తిరుమల శ్రీవారి ఆలయానికి ఉత్తరదిక్కున ఉన్న తుంబురుతీర్థంలో స్నానం చేయడం వల్ల పుణ్యం కలుగుతుందని విశ్వాసానికి టిటిడి సహకారం అందిస్తుందనే భక్తులు ఆశిస్తున్నారు.

## అందుబాటులోకి టిటిడి క్యాలెండర్లు, డైరీలు



**తిరుమల,అక్టోబర్ 13ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామికి సంబంధించి ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ముద్రించిన 2026 నూతన సంవత్సరం క్యాలండర్లు, డైరీలు భక్తులకు అందు బాటులోకి వచ్చాయి. వీటిని గతనెల 24వతేదీ సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించిన విషయం విదితమే. ప్రస్తుతం తిరుమల,తిరుపతితోబాటు హైదరాబాద్, విజయవాడ,విశాఖపట్నం, హిమాయత్ నగర్, న్యూఢిల్లీ,ముంబై, బెంగుళూరు, వేలూరు,చెన్నైలతోబాటు ఆంధ్రప్రదేశ్‌లో కర్నూలు, రాజమండ్రి, కాకినాడ, నెల్లూరులోని టిటిడి కల్యాణమండపాల్లో టిటిడి నూతన సంవత్సరం క్యాలండర్లు, డైరీలు భక్తులకు అందుబాటులో ఉన్నాయి. 12పేజీలు క్యాలండర్, ఆరపేజీల క్యాలండర్, టేబుల్ టాప్ క్యాలండర్, డీలక్స్ డైరీలు, పెద్దడైరీలు ఇలా స్వామివారి ప్రతిమల క్యాలండర్లు కొనుగోలుచేసుకునే అవకాశం కలిగింది. టిటిడి వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా భక్తులు బుక్‌చేసుకునే సదుపాయం టిటిడి కల్పించింది. ఆన్‌లైన్‌లో బుక్‌చేసుకున్న వారికి తపాలశాఖ ద్వారా ఇంటివద్దే టిటిడి డైరీలు, క్యాలండర్లు అందజేయబడుతాయి. "డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. తిరుమల.ఓఆర్‌జి,టిటిదేవస్థానమ్స్.ఎపి.జిఒవి.ఇన్ వెబ్‌సైట్‌లో పొందవచ్చు.

# చిరుతలొస్తున్నా పట్టించుకోవడం లేదు

## - బోనులు ఏర్పాటుచేయాలని విద్యార్థుల ఆందోళన

**తిరుపతి,అక్టోబర్13ప్రభాతవార్తప్రతినిధి:** అలిపిరి అటవీప్రాంతానికి ఆనుకుని ఉన్న తిరుపతిలోని శ్రీవేంకటేశ్వరవిశ్వవిద్యాలయం, వేదవిశ్వవిద్యాలయం, స్విమ్స్ ఆస్పత్రి ప్రాంగణాల్లో తరచూ చిరుతపులుల సంచారం ఎక్కువైంది. చీకటిపడితే చిరుతపులులు రెండు మూడు సంచరిస్తున్నట్లు విశ్వవిద్యాలయాల విద్యార్థులు చెబుతూన్నారు. సిసికెమెరాల పుటేజీల్లో స్పష్టంగా చిరుతల జాడ కనిపిస్తున్నా అటవీశాఖ అధికారులుగానీ, విశ్వవిద్యాలయం భద్రత సిబ్బంది తగిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు బలంగా ఉన్నాయి. గత రెండునెలల క్రిందట నుండి అలిపిరి -జూపార్కు మార్గంలోని అడవినుండి చిరుత పులులు ఎస్వీయూనివర్సిటీ హాస్టల్స్ వద్ద, ఎస్వీఆరవింద్ కంటి ఆస్పత్రి పరిసరాల్లో, స్విమ్స్ ఆస్పత్రి పరిసరాల్లో, వేదవిశ్వవిద్యాలయం పరిసరాల్లో సంచరిస్తున్నాయి. అలిపిరి మార్గంలో ఇద్దరు టిటిడి ఉద్యోగులపై దాడికి ప్రయత్నించాయి. తృటిలో వాళ్ళు తప్పించుకోవడంతో ప్రాణాలుతో బయటపడ్డారు. ఇటీవల ఎస్వీయూ ప్రాంగణంలో బోన్లు ఏర్పాటుచేసి ఒక చిరుతను బంధించి అడవిలో వదలి పెట్టారు. మళ్లీ అదే చిరుత సంచరిస్తున్నదనే భయం విద్యార్థులు వ్యక్తం చేస్తున్నారు.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
"e" Procurement Tender Notice
No. 1/2025-26/SE(P)/EE-(PD-I)/DB/GVMC.10.10.2025
Number of works 02, Value of works Rs. 4.00 Crores
Tender Opening Dt. 13.10.2025, Closing Date. 28.10.2025
Note: Further details at http://www.tender.apeprocurement.gov.in
O/o the EE(PD-I) Cell No. 9848308824 For Commissioner,GVMC

నిరంతరం జీవిత క్రమంలో పాత విషయాలు మరిచి కొత్త విషయాలు గ్రహిస్తూ జీవించేవారికి మృత్యుభయం ఉండదు.

-రోజర్

# ఆరోగ్యశ్రీ సేవలకు అనారోగ్యం!

తెలుగు రాష్ట్రాల్లో ఆరోగ్యశ్రీ లేదా ఆరోగ్యశ్రీ రోగుల సేవలకు ఆయా ఆరోగ్య సంస్థలు మొండికేస్తున్నాయి. ప్రభుత్వ ప్యాకేజీలకులోబడి తమకు గిట్టుబాటు కాకున్నా అన్ని ఆరోగ్యసేవలను సజావుగా చేస్తూ 'మేముసైతం' అనుకుంటున్న కార్పొరేట్ ఆస్పత్రులకు ప్రభుత్వం నుంచి బకాయిలు అందడం లేదు. తమవద్దకు నేరుగా వచ్చే రోగులకు తాము నిర్దేశించుకున్న మేరకు ఫీజులు, వైద్యసేవలు వగైరా ఎంతైనా తీసుకోవచ్చు. దాని మీద ఎలాంటి అదుపు లేదు. కానీ ప్రభుత్వం కేటాయించిన ఉద్యోగులకు, జర్నలిస్టులకు దారిద్ర్య రేఖకుదిగువనున్న కుటుంబాల కోసం ప్రత్యేకించి ప్రభుత్వం అందచేస్తున్న ఏరకమైన కార్డులైనా ప్రభుత్వ నిర్దేశిత ప్యాకేజీ మాత్రమే బిల్లింగ్ చేయాలి. అంతకన్నా పైసా ఎక్కువ వసూలు చేయరాదు. ఆ బిల్లులు అందచేసిన తర్వాత ఎప్పటికో కానీ ప్రభుత్వం నిధులు విడుదల చేయదు. దాంతో కార్పొరేట్ ఆస్పత్రులు నడిపేందుకు నిధుల్లేవని డీలా పడిపోతున్నాయి. చివరాఖరుకు తాము పేదల వైద్యానికి దూరమని తేల్చి చెప్పేస్తున్నాయి. వైద్య సేవలకు ఆరోగ్య శ్రీ ఎన్టీఆర్ వైద్యసేవ అని ఏ పేరిట అందిస్తున్నా చికిత్సల బిల్లుల విషయంలో 800 కార్పొరేట్ ఆస్పత్రులు ఇప్పుడు సత్వర వైద్యానికి 'నో' చెబుతున్నాయి. ఒకసారి బకాయిపడితే అధికార వర్గం కొంత కాలం వ్యవహారాన్ని సాగతీయడం, ఆపైన ఎంతో కొంత చెల్లింపుల కోసం నిధులు విడుదల చేస్తుంటాయి. ఈ విధమైన తాత్సారంతో కార్పొరేట్ ఆస్పత్రులు అడకత్తెరలో పోకచెక్క చందాన ఆర్థిక వెసులుబాటు లేక నలిగిపోతున్నాయి. ఆయా కార్డుల మీద రోగులకందించే వైద్యసహాయానికి ఆస్పత్రుల వారుబిల్లు అందించిన 45 రోజుల్లోగా ప్రభుత్వం బిల్లు పేమెంట్ చేయాలన్న ఒప్పందం ఉన్నా దాని ప్రకారం నిధులు అందించడంలో వెనకడుగు వేస్తున్నందున ఇలాంటి సమస్య పుడుతోంది. ప్రభుత్వనిర్దేశిత ధరలకే వైద్య చికిత్సలు అందివ్వడంలో కూడా కార్పొరేట్ ఆసుపత్రులకు వచ్చే ఆర్థిక లబ్ధి ఏమీ ఉండదు. అయినా కారుణ్య భావంతోనూ, ప్రభుత్వ పథకాలకు చేయూతనందించడం ద్వారా తమ ఆస్పత్రుల ప్రాభవాన్ని పెంచుకోవాలని కొన్ని ఆస్పత్రులు ముందుకొస్తున్నాయి. కాగా ప్రభుత్వం కోరినప్పుడు మిగిలిన ఆసుపత్రులు కూడా ప్రజాసేవలో భాగంగా ప్రభుత్వానికి కలిసిరావాల్సిందే. స్టాఫ్ జీతాలు, మందులు, చికిత్సా పరికరాల ధరలు బాగా పెరిగినందున వాటిని భరించడం కష్టంగా ఉందని కార్పొరేట్ ఆస్పత్రులు ఆవేదనవ్యక్తం చేస్తున్నాయి. ఆరోగ్య శ్రీ ఆసుపత్రులు మొండికేసి సేవలు నిలిపివేస్తున్నప్పుడల్లా కొన్ని నిధులు ప్రభుత్వం నుండి వస్తుంటాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదేపద్ధతి అమలవుతోంది. కనీసం ఆపరేషన్ ఖర్చులు కూడా రావడం లేదని ఆస్పత్రి యాజమాన్యాలు ఆందోళనపడ్తున్నాయి. ప్రభుత్వ ఉచిత వైద్య సేవలుఆపి ప్రైవేట్ ఆస్పత్రులుగా నడుపుకుంటే ప్రభుత్వపర వైద్యసేవల అందుబాటుకు మరింత కష్టతరమవుతోంది. అయినా కార్పొరేట్ ఆస్పత్రులన్నీ తెగించి ప్రస్తుతం వైద్యసేవలను నిలిపివేశారు. తెలంగాణలో 477 ఆసుపత్రులలో ఆరోగ్యశ్రీ వైద్యం లభిస్తుంది. ఈమధ్యనే తెలంగాణలో 62ఆసుపత్రులు తాము తక్కువ ప్యాకేజీకీకాదు. సకాలంలో బకాయిల్లేకుండా పూర్తిస్థాయిలో బిల్లులు సొమ్ము విడుదల చేయగలిగితేనే తాము వైద్యసేవల్ని కొనసాగిస్తామని అల్టిమేటం జారీ చేశాయి. దాంతో కొన్ని నిధులను తెలంగాణ ప్రభుత్వం విడుదల చేయడంతో కాస్త ఉపశమనం కలిగింది. ఇక ఆంధ్రప్రదేశ్‌లోని కార్పొరేట్ ఆస్పత్రులలో అనేక ప్రైవేట్, నెట్‌వర్క్ ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ ఔట్‌పేషంట్ సేవలను తాత్కాలికంగా నిలిపివేశాయి. కొన్ని ఆసుపత్రులు అత్యవసర కేసులను మాత్రమే చూస్తున్నాయి. ప్రభుత్వం నుంచి దాదాపు రూ. 1500 కోట్లకుపైగా బకాయిలుంటాయని లెక్క చెబుతున్నారు. ఒకవేళ ప్రభుత్వానికి పెట్టిన బిల్లుల మంజూరులో కూడా వ్యత్యాసాలున్నట్లు కొన్నిఆస్పత్రులు ఆరోపిస్తుంటాయి. రాష్ట్రమేదైనా ఆర్థిక సంబంధిత అంశాల్లోనే'ఆరోగ్యశ్రీ' చికిత్సలు ఆగిపోతున్నాయి. ప్రభుత్వం తక్షణం నిధుల బకాయిలు విడుదల చేయలేకపోతోంది. ప్రయివేటు ఆస్పత్రులు వైద్యసేవలకు ముందుకురాలేకపోతున్నాయి. ఈ సమస్యలు ఎప్పటికప్పుడు తాత్కాలిక పరిష్కారానికే పరిమితమవడంతో తరచు ఇలాంటి విరామం వస్తోంది. రోగులు ఇక్కట్లకు గురవుతున్నారు. ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిల మొత్తంపై రెండు రకాల వాదనలు వినిపిస్తున్నాయి. సెంట్రలైజెడ్ ఫైనాన్సియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో రూ.674 కోట్ల మేరకు బకాయిలున్నట్లు చూపెడుతోంది. ఇవిగాక తాజాగా పేరుకున్న బకాయిలు 3వేల కోట్లకుపైగానే ఉన్నాయని తేల్చారు. ఒక నిర్దిష్టమైన పరిష్కారం లేకుంటే ఆరోగ్యశ్రీని నమ్ముకున్న రోగులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిందే. ఆయా ప్రభుత్వాలు తమకు ఉన్న ఆర్థిక లోటుతోనో, బడ్జెట్‌లోటుతోనో ముడిపెట్టకుండా ఏటా బడ్జెట్‌లలో ఆరోగ్యశ్రీ, తదితర వైద్యసేవలకు ప్రత్యేక కేటాయింపు చేసి ఆదుకోవాల్సిన అవసరముంది. డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్ట్ పథకం కింద పేద రోగులకు అందించే ఉచిత చికిత్ససేవలను గత 3 రోజులుగా ఆరోగ్యశ్రీ ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రులన్నిటా ఓపిడి సేవలు నిలిపివేయడం వల్ల గ్రామీణ రోగులు బాగా ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వ పరిశీలనలో ఆసుపత్రులకు కేవలం రూ.2700కోట్ల బకాయిలే ఉన్నాయి. పెండింగ్ బకాయిలు కూడా ఇవ్వాల్సి ఉన్నందున ప్రభుత్వ ఆర్థిక భారాన్ని అత్యవసరంగా మోయగల పరిస్థితి లేదని ప్రభుత్వవర్గాల వివరణ. ప్రత్యామ్నాయం ఏర్పాట్లు లేకపోవడం అర్థాంతరంగా ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయడం పేద రోగులకు అసౌకర్యం కలిగింది.

వ్యక్తులు ఇతరుల బోధన ద్వారా కంటే తమ కష్టాల ద్వారానే ఎక్కువ నేర్చుకుంటారు.



స్వామి వివేకానంద

సంతోషాన్ని ఇచ్చేది సంపద, లేదా వైభవం కాదు. ప్రశాంతమైన మనసు, వృత్తి మాత్రమే.



థామస్ జెఫర్సన్

# ప్రజావాక్కు



### పెరుగుతున్న వైద్యం ఖర్చులు

రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రతి కుటుంబం ఏటా వేల కోట్ల రూపాయలు వైద్య చికిత్సలకే ఖర్చు చేస్తున్నాయనే గణాంకాలు తీవ్రఆందోళన కలిగిస్తున్నాయి. ఈఖర్చు ఎక్కువ శాతం నేరుగా ప్రజల జేబు నుండి వెళ్లిపోతుండడం, ప్రభుత్వ ఆరోగ్య సేవల లోపాన్ని స్పష్టంగా చూపిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్య సదుపాయాల లేమి, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిపుణుల కొరత, మందుల లభ్యత లోపం వంటి అంశాలు ప్రజలను ఖరీదైన ప్రైవేట్ ఆసుపత్రుల వైపుమళ్లిస్తున్నాయి. ఈఆర్థికభారంతో అనేక కుటుంబాలు అప్పుల ఊబిలో పడుతూ, జీవన ప్రమాణం దిగజారుతున్నది. ప్రైవేట్ వైద్య రంగంపై అధిక ఆధారపడడం, ఆరోగ్యరంగంలో అసమానతలను మరింతగా పెంచుతోంది. ప్రజారోగ్యంపై సరైన పెట్టుబడులు లేకపోవడం, పేదలకు నాణ్యమైన వైద్యం అందుబాటులో లేకపోవడం పరిస్థితిని మరింత విషమం చేస్తోంది.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### పిల్లలపై ఒత్తిడి పెంచొద్దు

పిల్లల జీవితంలో ప్రేమ, ప్రోత్సాహం, అర్థం చేసుకోవడం చాలా అవసరం. అయితే నేడు చాలా మంది తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మంచి మార్కులు, ర్యాంకులు లేదా విజయాల కోసం పిల్లలపై అత్యధిక ఒత్తిడి తెస్తున్నారు. అది వారిలో భయం, ఆందోళన, నమ్మకం కోల్పోవడం వంటి ప్రతికూల భావాలను పెంచుతుంది. ప్రతి పిల్లవాడు తనదైనవేగం, తనదైన ప్రతిభతో ఎదుగుతాడు. అందుకే, వారిని ఇతరులతో పోల్చకూడదు తప్పులు చేసినా నేర్చుకునే అవకాశం ఇవ్వాలి. పిల్లల మనసులు సున్నితమైనవి.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### విద్యా ప్రమాణాలు పెంచాలి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచాలి. ఆధునిక పద్ధతిలో విద్యా బోధన జరపాలి. అలాగే స్మార్ట్ బోర్డులు, ప్రొజెక్టర్లు ఉపయోగించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికైనా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలి. ముఖ్యంగా టాయిలెట్‌లు, బెంచీలు, ఉపాధ్యాయులకు కుర్చీలు, లైట్లు, మంచి నీరు, ధృఢమైన పాఠశాల బిల్డింగ్, తదితర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలి.

- డి. చాంద్ బాషా, కర్నూలు

### ఔషధ పరిశ్రమలో భద్రత ముఖ్యం

రసాయన ఔషధ పరిశ్రమలు, కర్మాగారాలలో పకడ్బందీగా భద్రత ప్రమాణాలు పాటించాలి. రసాయన ఔషధ పరిశ్రమలలో ఇటీవల తరచూ ప్రమాదాలు సంభవిస్తుండటంతో ప్రాణ నష్టం జరిగింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. కార్మికులకు నిరంతరం భద్రతాపరమైన అంశాలపై శిక్షణకార్యక్రమాలు, మాక్‌డ్రిల్స్ నిర్వహించాలి. కార్మికుల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రతి పరిశ్రమలో భద్రత పట్ల యాజమాన్యం శిక్షణ తరగతులు నిర్వహించాలి. దాంతో చాలా వరకు ప్రమాదాలను నివారించొచ్చు. ప్రమాదాలు జరిగినప్పుడు ఇచ్చే నివేదికలు ముఖ్యం కాదని, జీరో ప్రమాదాల స్థాయికి చేరినప్పుడే పరిశ్రమ 100 శాతం అభివృద్ధి సాధించినట్టు లెక్క. నిబంధనలు ఉల్లంఘించినా, భద్రత ప్రమాణాలు పాటించని పరిశ్రమలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### తెలంగాణ విద్యకు కొత్త దిశ

తెలంగాణ ప్రభుత్వ విద్యాశాఖ 160 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులను విదేశీపర్యటనకు పంపించాలనేనిర్ణయం తీసుకోవడం విశేషంగా చెప్పుకోవాలి. ఈనిర్ణయం ఉపాధ్యాయుల వృత్తిపరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడమే కాకుండా, బోధనా పద్ధతుల్లో నూతన ఆవిష్కరణలకు మార్గం సుగమం చేస్తుంది. విదేశీ పర్యటనలద్వారా ఉపాధ్యాయులు ప్రపంచంలోని అత్యుత్తమ విద్యా విధానాలను, ఆధునిక బోధనా సాంకేతికతలను సమీక్షించి నేర్చుకునే అవకాశం పొందుతారు. ఆ అనుభవాలను తమ పాఠశాలల్లో అమలు చేస్తే విద్యార్థులలో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, నేర్చుకునే తపన పెరుగుతుంది. ఇది విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### పి.ఇ.టిలకు ఎన్‌సీసీ డ్యూటీ!

తెలంగాణ రాష్ట్రంలోని వివిధవిద్యాసంస్థలలో, జూనియర్ కళాశాలలో, యూనివర్సిటీలలో, ఎన్.సీ.సీ. జాబ్‌చార్ట్, ఆటలు, పాటలు, క్రమశిక్షణ వంటి డ్యూటీలను, సంస్కృతిక కార్యక్రమాలు ఇకమీదట నిర్వహించడానికి గాను ఆ విధులను పని విధానం టీచింగ్ చేసేటీచర్స్, లెక్చరర్స్ నుండి బాధ్యతలు తీసివేసి పీఈటీలకు, ఫిజికల్ డైరెక్టర్‌లకు అప్పగించాలి. అందుకోసం ప్రభుత్వం ఒక ప్రత్యేక జీవో విడుదల చేయాలి.

-రాపాక రవీందర్, జనగాం

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# బిసిలకు ఇంకా అరకొర 'సంక్షేమ'మేనా?

**తెలంగాణాలో ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎన్నికల సమయంలో బిసిని ప్రకటించారు. ఎన్నికలు ముగిసిన వెంటనే రాష్ట్ర పార్టీ అధ్యక్షునిగా అగ్రవర్ణాల వ్యక్తిని నియమించారు. బిసిల పట్ల కాంగ్రెస్‌ను మించి చులకనభావం బిజెపి పెద్దలకు ఉన్నట్లు ఈ పరిణామాలన్నీ స్పష్టంగా తేటతెల్లం చేస్తున్నాయి. యస్.సి, యస్.టి, అగ్రవర్ణాల పేదలు వారి జనాభా దామాషా ప్రకారం రాజ్యాంగ ఫలాలు అనుభవిస్తూ అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతున్నారు. కానీ జనాభాలో సగానికి పైగా ఉన్న బిసిలు మాత్రం ఇంకా కటిక పేదరికాన్ని అనుభవిస్తున్నారు. రాజ్యాంగ పరంగా ఫలాలు అందించినప్పుడే బిసిలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందుతారు**



కెలసాని శివప్రసాద్

బిసి కులాల వారందరికీ చేతి వృత్తులే జీవనాధారం. కొద్ది కాలంగా చేతి వృత్తులు అంతరించిపోతూ ఉండడం, చేతివృత్తులలోకి వివిధ కార్పొరేట్ సంస్థలు ప్రవేశించడంతో బిసిల బ్రతుకులు అగమ్యగోచరంగా మారాయి. నానాటికీ దిగజారిపోతున్న బిసిల బ్రతుకులు గాడిన పెట్టవలసిన బాధ్యత రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలతో పాటూ అన్ని రాజకీయ పార్టీలపై ఉందని కచ్చితంగా చెప్పవచ్చు. కానీ అందుకు విరుద్ధంగా ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు బిసిలను ఓటర్లుగానే చూస్తున్నాయనేది నిర్వివాద అంశం. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయ పార్టీలు బిసిలను స్మరిస్తూ వారి ఓట్ల కొరకూ అనేక అసాధారణ హామీలు రాజకీయ పార్టీలు ఇస్తూ ఉన్నాయి. ఎన్నికలు ముగిసిన వెంటనే అధికారంలోకి వచ్చిన రాజకీయపార్టీలు ఎన్నికల సమయంలో బిసిలకు తాము ఇచ్చిన హామీలు అటకెక్కించడం, వాటి సాధన కొరకు బిసిలు రోడ్డెక్కడం పరిపాటిగా మారింది. ఆకోవలోకి చెందిందే ప్రస్తుతం తెలంగాణా రాష్ట్రంలో చెలరేగిన బిసి రిజర్వేషన్ల దుమారం. 2023లో జరిగిన సాధారణ ఎన్నికల సమయంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ అదిష్టానం స్పష్టమైన హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటివరకు బిసి రిజర్వేషన్ల పెంపు విషయంలో జరిగిన తంతు అంతాచాలా హాస్యాస్పదంగా, ఆశ్చర్యకరంగా కనిపిస్తూ ఉంది. వాస్తవంగా రాజ్యాంగ పరంగా షెడ్యూల్డ్ 9లో పొందుపరచినప్పుడే కుల రిజర్వేషన్లకు అధికారికంగా గుర్తింపు, రక్షణ, జీవం ఉంటాయనేది నిర్వివాద అంశం. అత్యున్నత న్యాయ స్థానాలలో ఇటీవలి కాలంలో వివిధ రాష్ట్రాల కులరిజర్వేషన్లపై వెలువడిన తీర్పులు అందుకు ఉదాహరణలుగా అనేకం కనిపిస్తూ ఉన్నాయి. యం.ఆర్. బాలాజీ, మైసూర్ స్టేట్ మధ్య 1962లో జరిగిన కేసులో మొట్టమొదటిగా రిజర్వేషన్లు 50 శాతం మించకుండా ఉండాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. తరువాత ఇంద్ర సాహ్ని, యూనియన్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మధ్య జరిగిన కేసులో కూడా 1992లో 9మంది సుప్రీం కోర్టు న్యాయమూర్తుల బృందం అదే విధమైన తీర్పును వెలువరించింది. అదే తీర్పులో 50శాతం పరిమితి సంపూర్ణమైనది కాదని, అసాధారణ పరిస్థితులలో రిజర్వేషన్లు పెంచుకోవచ్చని కూడా పొందుపరిచారు. అసాధారణ పరిస్థితులలో రిజర్వేషన్లు పెంచుకోవచ్చు అనే వ్యాఖ్యలు ప్రామాణికంగా తీసుకుని అనేకరాష్ట్రాలు తమ రాష్ట్రాలలో 50శాతం మించి రిజర్వేషన్లను పెంచుకున్నాయి. కానీ వాటికి న్యాయ స్థానాలలో చుక్కెదురు కావడం గమనార్హం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పట్లో అధికారంలో ఉన్న ఇదే కాంగ్రెస్ పార్టీ 2005లో ముస్లింలకు 5శాతం రిజర్వేషన్లు కల్పించింది. ఆ అయిదు శాతం రిజర్వేషన్ల వలన రాష్ట్రంలో రిజర్వేషన్లు 50శాతం మించుతున్నాయని హైకోర్ట్ దానిని తిరస్కరించింది. అప్పటికే 46శాతం రిజర్వేషన్లు రాష్ట్రంలో మనుగడలో ఉన్నాయి. దాంతో 50శాతానికి కేవలం ఒకశాతం అధికంగా ఉన్నందువలన ఆ ఒక్క శాతం తగ్గించి4శాతం ముస్లీం రిజర్వేషన్లను అప్పటి ప్రభుత్వం అమలు చేసింది. మహారాష్ట్ర ప్రభుత్వం 2018లో మారాఠాలకు 16 శాతం రిజర్వేషన్లు కల్పించింది. ఆ రిజర్వేషన్లను మహారాష్ట్ర హై కోర్ట్ కొట్టివేసింది. సుప్రీం కోర్ట్ కూడా ఆ రిజర్వేషన్లను 2021లో తిరస్కరించింది. కానీ 1994లో పి.వి.నరసింహారావు ప్రభుత్వం భారత రాజ్యాంగంలోని షెడ్యూల్డ్ 9లో పొందుపరచడం వలన తమిళనాడు రాష్ట్రంలో కొనసాగిస్తున్న 69 శాతం రిజర్వేషన్లకు ఎటువంటి ఇబ్బందిలేకుండా పోయింది. అదేవిధంగా అధికరణ 15(5), 16(5)ప్రకారం 103 రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు (ఇ.డబ్ల్యూ.యస్) 10శాతం రిజర్వేషన్లను 2022లో కేంద్ర




ప్రభుత్వం కల్పించింది. దాంతో ఈ రిజర్వేషన్ల మనుగడకు కూడా ఎటువంటి అడ్డంకులు కలగడం లేదు. తెలంగాణా రాష్ట్రప్రభుత్వంలోని అపార అనుభవం కలిగిన న్యాయవాదులకు, సుదీర్ఘపాలనా అనుభవంతోపాటూ విషయ పరిజ్ఞానం అన్నిరంగాలపై అత్యధికంగా ఉన్న బ్యూరోకాట్లకు, దశాబ్దాల రాజకీయ అనుభవం కలిగిన పాలకులకు ఈ విషయాలన్నీ తెలియవు అంటే ఎవరైనా నమ్మగలరా? ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటూ యావత్తు భారతదేశంలో 55 శాతం పైగా ఉన్న వెనుకబడిన తరగతి జాతులు (బిసి) స్వతంత్ర భారత్ ఆవిర్భవించి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా ఇంకా సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి ఉండిపోవడంలో దోషులు ప్రాంతీయ, జాతీయ రాజకీయ పార్టీలే అయినా! ప్రధాన దోషులు మాత్రం ప్రధాన పార్టీలే అని కచ్చితంగా చెప్పవచ్చు. స్వాతంత్ర్యం లభించిన నాటి నుండి దాదాపు కాంగ్రెస్, బిజెపిలే కేంద్రంలో అధికారాన్ని అనుభవించాయి. ముఖ్యంగా స్వతంత్ర భారత్‌లో అత్యధిక కాలం కేంద్రాన్ని ఏలింది కాంగ్రెస్ పార్టీనే. కానీ కాంగ్రెస్ పార్టీ బిసిలకు చేసింది శూన్యమనే చెప్పాలి. జనతా పార్టీకి చెందిన మురార్జీ దేశాయ్ ప్రధానిగా ఉన్న సమయంలో దేశ వ్యాప్తంగా ఉన్న వెనుకబడిన తరగతి జాతుల(ఓబిసి)కు రాజ్యాంగం ద్వారా సామాజికంగా, ఆర్థికంగా న్యాయం చేయాలనే సదుద్దేశ్యంతో 1979 జనవరి 1న మండల కమిషన్‌ను ఏర్పాటు చేశారు. ఆ మండల్ కమీషన్ తమ రిపోర్టును 1980 డిసెంబర్ 31న కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఆ సమయంలో జనతా పార్టీ సెక్యులర్‌కు చెందిన చరణ్ సింగ్ దేశ ప్రధానిగా ఉన్నా మండల్ కమీషన్ రిపోర్ట్ పైఏమీ చర్యలు తీసుకోలేకపోయారు. సుమారు దశాబ్దం పాటూ ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీల నాయకత్వాలలో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారం అనుభవించింది. ఆ సమయంలో వారిరువురూ మండల కమీషన్ రిపోర్ట్‌ను అటకెక్కించారనే చెప్పాలి. తరువాత నేషనల్ ఫ్రంట్‌కు చెందిన వి.పి.సింగ్‌ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే1990 ఆగస్టులో మండల్ కమీషన్‌ను ఆమోదించి దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో ఓబీసీలకు 27శాతం రిజర్వేషన్లు కల్పించారు. సుప్రీం కోర్టు కూడా ఓబిసి రిజర్వేషన్లు సమర్థించి వాటిని అమలు చేయమని 1992 నవంబర్ 16న అప్పటి కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. 1993 నుంచి ఓబిసి రిజర్వేషన్లు అమలులోకి వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ తారువాత దేశాన్ని ఎక్కువ కాలం పరిపాలించిన పార్టీ భారతీయ జనతా పార్టీ. దేశాన్ని ఎన్నో దశాబ్దాలు, శతాబ్దాల నుంచి పట్టి పీడిస్తున్న అనేక జటిల సమస్యలకు బిజెపి ప్రభుత్వం పరిష్కారం చూపింది. దేశంలో 15 శాతం ఉన్న అగ్రవర్ణాల వారికి 10 శాతం ఇడబ్ల్యూయస్ రిజర్వేషన్లు కల్పించింది. 15శాతం ఉన్న అగ్రవర్ణాల వారిలో ఇడబ్ల్యూయస్ రిజర్వేషన్లకు అర్హులైన పేదలు 8శాతం మించి ఉండరని అనేక గణాంకాలు తెలియచేస్తున్నాయి. అయినా బిజెపి ప్రభుత్వం 10 శాతం రిజర్వేషన్లు ఎందుకు కేటాయించిందో పాలకులకే తెలియాలి. దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉన్న చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించే మహిళా బిల్లును 2023లో బిజెపి ప్రభుత్వం సునాయాసంగా గట్టెక్కించింది. 50 శాతంఉన్న మహిళలకు చట్టసభల్లో 33.3శాతం రిజర్వేషన్లు కల్పించబడింది. ఈ మహిళా బిల్లులో యస్.సి, యస్.టిలకు రిజర్వేషన్లు కేటాయించి బిసిలను విస్మరించారు. అదేవిధంగా 55శాతం పైగాఉన్న బిసిలు తమకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించమని, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వశాఖ కేటాయించమని, ప్రత్యేక బడ్జెట్ కేటాయించమని, ప్రభుత్వ ఉద్యోగాల ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించమని దశాబ్దాల నుంచి ప్రభుత్వాలను కోరుతున్నారు. వీటిపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నామమాత్రంగా నైనా స్పందించిన దాఖలాలు లేవు. తెలంగాణాలో ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎన్నికల సమయంలో బిసిని ప్రకటించారు. ఎన్నికలు ముగిసిన వెంటనే రాష్ట్ర పార్టీ అధ్యక్షునిగా అగ్రవర్ణాల వ్యక్తిని నియమించారు. బిసిల పట్ల కాంగ్రెస్‌ను మించి చులకనభావం బిజెపి పెద్దలకు ఉన్నట్లు ఈ పరిణామాలన్నీ స్పష్టంగా తేటతెల్లం చేస్తున్నాయి. యస్.సి, యస్.టి, అగ్రవర్ణాల పేదలు వారి జనాభా దామాషా ప్రకారం రాజ్యాంగ ఫలాలు అనుభవిస్తూ అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతున్నారు. కానీ జనాభాలో సగానికి పైగా ఉన్న బిసిలు మాత్రం ఇంకా కటిక పేదరికాన్ని అనుభవిస్తున్నారు. రాజ్యాంగ పరంగా ఫలాలు అందించినప్పుడే బిసిలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందుతారు. ●

# ప్రమాణాల ఆచరణపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి

రామ కిష్టయ్య సంగన భట్ల

వస్తువులన్నింటికీ నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలని నిబంధనలు ఉన్నా, సర్వం నాసిరకం అవుతున్న నేటి పరిస్థితులలో ప్రభుత్వాలు ప్రతి వస్తువు నాణ్యతా ప్రమాణాలు పాటించేలా ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం అనివార్యంగా ఉంది. ప్రపంచ లేదా అంతర్జాతీయ ప్రమాణాల దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబరు 14న నిర్వహించబడుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అంతర్జాతీయ ప్రమాణ సంస్థలు తమతమ దేశాలలో ప్రమాణాలను నిర్ణయించిన సందర్భంగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు. అమెరికన్ సొసైటీ ఆఫ్ మెకానికల్ ఇంజనీర్స్ (ఏఎస్ఎంఈ), ఇంటర్నేషనల్ ఎలక్ట్రోటెక్నికల్ కమిషన్ (ఐఈసీ), ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్ (ఐఎస్ఓ), ఇంటర్నేషనల్ టెలి కమ్యూనికేషన్ యూనియన్ (ఐటీయు), ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్స్ (ఐఈఈఈ), ఇంటర్నెట్ ఇంజనీరింగ్ టాస్క్‌ఫోర్స్ (ఐఈటీఎఫ్)వంటి ప్రమాణాల అభివృద్ధి సంస్థలలో వినియోగదారులు, నియంత్రకాలు పరిశ్రమలలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ప్రామాణీకరణప్రాముఖ్యత గురించి అవగాహన పెంచడం ఈ రోజు ఉద్దేశ్యం. వేలాది మంది నిపుణుల కృషిని గుర్తు చేస్తూ జరుపుకుంటారు. 1946, అక్టోబరు 14న లండన్‌లో జరిగిన సమావేశంలో 25 దేశాల ప్రతినిధులు పాల్గొని వినియోగదారులకు ప్రామాణికమైన, నాణ్యమైన వస్తు ఉత్పత్తులను అందించేందుకు అంతర్జాతీయ ప్రమాణిక సంస్థను ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. దానికి గుర్తుగా అక్టోబరు 14న ప్రపంచ ప్రమాణాల దినోత్సవం జరుపబడుతుంది. ఒక సంవత్సరం తరువాత అంతర్జాతీయ ప్రమాణిక సంస్థ ఏర్పడినప్పటికీ, 1970 వరకు మొదటి ప్రపంచ ప్రమాణాల దినోత్సవం జరుపు కోలేదు. ప్రస్తుతం ఈసంస్థలో 125 సభ్యదేశాలున్నాయి. ప్రామాణీకరణ ప్రాముఖ్యత గురించి పరిశ్రమలు, వినియోగదారులలో అవగాహన పెంచుతారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలలోని జాతీయ సంస్థలు వేరువేరు రోజుల్లో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాయి. 2014లో యునైటెడ్ స్టేట్స్ అక్టోబరు 23న ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని నిర్వహించింది. కెనడా దేశపు జాతీయ అక్రెడిటేషన్ బాడీ అయిన స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ కెనడా (ఎస్.సి.సి) అంతర్జాతీయ సంస్థలతో కలిసి ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని జరుపుకుంటుంది. 2012లో స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ కెనడా అక్టోబరు 12 శుక్రవారం రోజున ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని జరుపుకుంది. 1947లో భారతదేశంలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ చట్టాన్ని ఆమోదించి బ్యూరోను ఒక శాసన బద్ధమైనా సంస్థగా మార్చారు. అప్పటి నుంచే ఐ.ఎస్.ఐ ముద్ర ప్రకటితమైంది. ఈ ముద్ర గల వస్తువులు నాణ్యత కలిగినది. 1947లో భారతీయ ప్రమాణాల సంస్థ మొదటి రెండు విభాగాలను ఏర్పాటు చేసింది. ఒకటి బట్టలకు, రెండవది ఇంజనీరింగ్‌కు సబంధించినది. ఈ సంస్థ నిర్ణయించిన తొలి ప్రమాణం ఏమిటో తెలుసా, మన జాతీయ పతాకం ఎంత పొడవు, వెడల్పు ఉండాలన్నది ఈ సంస్థ నిర్ణయించింది. కాలక్రమంలో టెలి కమ్యూనికేషన్స్, టీకాలు, నూనె గింజలు, త్రాగునీరు, పాడి పరిశ్రమ వంటివి కూడా ఈ సంస్థ పరిధిలోకి చేర్చారు. ఐఎస్ఐ మార్కు సంస్థ అనుమతి లేనిదే ఎవరూ వాడ కూడదు. అన్ని సాంకేతిక పరీక్షలు, తనిఖీలు నిర్వహించిన దరిమిలా ఒక సంవత్సరానికి ఐఎస్ఐ లైసెన్స్ ఇస్తుంది. ప్రతీ సంవత్సరం రెన్యువల్ చేసుకోవాలి. ప్రమాణాలు నిర్ణయించడానికి ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ ప్రమాణ సంస్థలు ఈ రోజునే ప్రారంభించాయి. కనుక ఈ రోజున వరల్డ్ స్టాండర్స్‌డే గా జరుపుకుంటారు. ●

# ప్రపంచ ఆర్థిక రంగంలో భారత్ సరికొత్త అడుగు

డి జె మోహన రావు

ప్రపంచంలో అగ్ర ఆర్థికశక్తిగా ఎదగాలనే మనదేశ లక్ష్యంలో ఇప్పుడు ఒక కీలకమైన అడుగు పడింది. అదే విదేశీ ద్రవ్య పరిష్కార విధానం (ఫారిన్ కరెన్సీ సెటిల్‌మెంట్ సిస్టమ్- ఎఫ్‌సీఎస్ఎస్). దీనిని గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీ అంటే గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్ సిటీలో ప్రారంభించడం ఈ లక్ష్యసాధనలో భాగం. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అక్టోబర్ 7, 2025 నాడు ఎఫ్‌సీఎస్ఎస్‌ను ప్రారంభించారు. ఇది కేవలం సాంప్రదాయ పద్ధతి స్థానంలో కొత్త టెక్నాలజీ తీసుకురావడం మాత్రమే కాదు, ప్రపంచ దేశాల మధ్య కరెన్సీ మార్చుకునే పద్ధతిలో మనదేశం తెచ్చిన ఒక వ్యవస్థాగత మార్పు. ఈ విధాన ముఖ్యలక్ష్యం విదేశీ లావాదేవీల్లోని అనవసరమైన ఆలస్యాన్ని, అధిక ఖర్చును, ఆ ప్రక్రియలో ఉన్న ప్రమాదాన్ని పూర్తిగా తొలగించడమే. ఎఫ్‌సీఎస్ఎస్ విజయవంతమైతే మన గిఫ్ట్ సిటీ అంతర్జా తీయంగా పేరుగాంచిన లండన్, న్యూయార్క్, సింగపూర్ వంటి అగ్ర ఆర్థిక కేంద్రాలకు సమానంగా ఎదగగలుగుతుంది. ముఖ్యంగా మన దేశీయ బ్యాంకులు ఇకపై విదేశీ కరెన్సీ చెల్లింపుల కోసం ఇతర దేశాల కరస్పాండెంట్ బ్యాంకుల సేవలకు, వాటి పని వేళలకు ఎక్కువగా ఎదురుచూడాల్సిన అవసరం గణనీయంగా తగ్గుతుంది. ఎఫ్‌సీఎస్ఎస్ ఆవశ్యకతను పూర్తిగా అర్థం చేసుకోవాలంటే, దాని రాకముందు విదేశీ లావాదేవీలు ఎలా జరిగేవో పరిశీలించాలి. సాంప్రదాయ పద్ధతిని ఒక చిన్న ఉదాహరణతో అర్థం చేసుకుందాం. గిఫ్ట్ సిటీలోని ఒక బ్యాంకు (దీనిని ఇంటర్నేషనల్ బ్యాంకింగ్ యూనిట్ ఐబియు అంటారు) అమెరికన్ డాలర్లలో ఒక లావాదేవీ చేస్తే, ఆ డబ్బు నేరుగా చేరేది కాదు. ఆ లావాదేవీ పూర్తి కావడానికి డబ్బు అమెరికా, యూరప్‌లోని కరస్పాండెంట్ బ్యాంకులు సహా అనేక మధ్యవర్తి బ్యాంకుల సంక్లిష్టమైన గొలుసు గుండా ప్రయాణించాల్సి వచ్చేది. ఈ మొత్తం ప్రక్రియ పూర్తి కావడానికి సుమారు 36 నుండి 48 గంటల సుదీర్ఘ సమయం పట్టేది. ఈ సుదీర్ఘ నిరీక్షణ కాలం అనేక తీవ్రమైన సమస్యలకు దారితీసేది. ఏదైనా ఒక బ్యాంకు దివాలా తీసినా లేదా డబ్బు చెల్లించడంలో రెండోది నిధులు వృథా అవడం. బ్యాంకులు ఎప్పుడూ విదేశీ ఖాతాలలో పెద్దమొత్తంలో డబ్బును నిల్వ చేసి ఉంచాలి. సిద్ధంగా ఉంచిన ఈ డబ్బు, తమ దేశీయ అవసరాలకోలేదా ఇతర పెట్టుబడులకో ఉపయోగపడేదికాదు. మూడవ సమస్య ఖర్చు పెరగడం. ప్రతి మధ్యవర్తి బ్యాంకు తమ సేవలకు తప్పకుండా ఫీజులు వసూలు చేయడంతో, చివరకు లావాదేవీ చేసే వారికి అయ్యేఖర్చు బాగా పెరిగిపోయేది. ఎఫ్‌సీఎస్ఎస్



ఎస్ఎస్ ఈ సమస్యలన్నింటికీ మూడు కీలకమైన పరిష్కారాలను చూపించింది. ఎఫ్‌సీఎస్ఎస్ ద్వారా విదేశీ కరెన్సీ లావాదేవీలు 'రియల్ టైమ్'లో అంటే తక్షణమే పరిష్కారం అవుతాయి. దీన్ని సాకారం చేయడానికి అంతర్జాతీయ ఆర్థిక సేవల సంస్థ (ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్స్ అథారిటీ- ఐఎఫ్ఎస్సిఎ) ఒక ప్రత్యేకమైన 'స్థానిక సెటిల్‌మెంట్ బ్యాంకు'ని ఏర్పాటు చేసింది. గిఫ్ట్ సిటీలోని అన్ని బ్యాంకులు ఈ స్థానిక బ్యాంకులో విదేశీ కరెన్సీకి సంబంధించిన ఖాతాలను తెరుస్తాయి. దీనివల్ల ఒక బ్యాంకునుంచి మరొక బ్యాంకుకు డాలర్లు పంపాల్సివస్తే, ఆ డబ్బు అంతర్జాతీయ మార్గాల గుండా ప్రయాణించకుండా, కేవలం ఈ స్థానిక ఖాతాల మధ్యే క్షణాల్లో మార్పిడి జరుగుతుంది. దీనివల్ల బ్యాంకులు తమ నిధులు ఎప్పుడు, ఎంత అందుబాటులో ఉంటాయో అనే దానిపై ఖచ్చితమైన అంచనా వేయగలుగుతాయి. ప్రస్తుతం అమెరికన్ డాలర్స్ మాత్రమే ఈ పద్ధతిలో మార్పిడి చేస్తున్నారు. త్వరలోనే ఇతర ప్రముఖ అంతర్జాతీయ కరెన్సీలను కూడా ఈ విధానంలోచేరుస్తారు. అలాగే ఈ నూతన పద్ధతిలో సెటిల్‌మెంట్ ప్రమాదం పూర్తిగా తొలగిపోతుంది. ఎందుకంటే డబ్బు పంపడం, స్వీకరించడం అనే లావాదేవీలోని రెండు భాగాలు ఒకేచోట ఒకే సమయంలో పూర్తి అవుతాయి. దీనివల్ల మధ్యలో ఆగిపోయే అవకాశమే ఉండదు. అంతేకాకుండా, బ్యాంకులు తమ లావాదేవీల కోసం విదేశీ బ్యాంకుల్లో పెద్దమొత్తంలో నిధులు వృథాగా నిల్వచేయాల్సిన అవసరం ఉండదు. విముక్తి పొందిన ఈ నిధులు దేశీయ, అంతర్జాతీయ ఆర్థిక కార్యకలాపాలలో పెట్టుబడిగా మారడానికి అవకాశం కల్పిస్తాయి. ఇది బ్యాంకుల వద్ద డబ్బు అందుబాటును అంటే ద్రవ్య లభ్యతను బలోపేతం చేస్తుంది. అంతర్జాతీయ ఆర్థిక సేవల కేంద్రాలప్రాధికార సంస్థ పర్యవేక్షణలో, భారతదేశంలోని చెల్లింపుల పరిష్కార వ్యవస్థల చట్టం 2007కింద పనిచేస్తుంది. ఈ చట్టబద్ధమైన, కట్టుదిట్టమైన వ్యవస్థ విదేశీ సంస్థలకు ఒక పెద్ద భద్రత ఇస్తుంది. ఇది చట్టపరమైన స్పష్టతను, ప్రమాద నివారణను, పూర్తి పారదర్శకతను అందిస్తుంది. దీనివల్ల విదేశీ పెట్టుబడిదారులు, పెద్ద అంతర్జాతీయ బ్యాంకులుఎటువంటి సందేహం లేకుండా మన దేశంలో పెట్టుబడులు పెట్టడానికి, గిఫ్ట్ సిటీలో తమ కార్యకలాపాలను విస్తరించడానికి మరింత ఎక్కువగా ముందుకు వస్తారు. భారతదేశం తీసుకున్న చారిత్రాత్మక, వ్యూహాత్మక అడుగు. వేగవంతమైన, తక్కువఖర్చుతో కూడిన, నమ్మక మైన లావాదేవీల పరిష్కార వేదికగా గిఫ్ట్ సిటీని చూసి అంతర్జాతీయ పెట్టుబడిదారులు, ఆర్థిక సంస్థలు తమగ్లోబల్ హబ్‌గా ఎంచుకుంటారు. దీని ద్వారా మన దేశం ప్రపంచ నిధుల కేంద్రంగా మారుతుంది. అలాగే అంతర్జాతీయవాణిజ్య లావాదేవీలలో ఆలస్యం, ఖర్చులు తగ్గడం వలన భారతీయ వ్యాపారాలు ప్రపంచవ్యాప్తంగా మరింత పోటీ పడగలుగుతాయి. ఇది దేశీయ ఎగుమతులు, దిగుమతులను పెంచిమొత్తం మీద దేశ ఆర్థికవృద్ధికి బాగా సహాయపడుతుంది. ఎఫ్‌సీఎస్ఎస్ అనేది కేవలం టెక్నాలజీ వ్యవస్థ మాత్రమే కాదు. ఇది ప్రపంచ ఆర్థికరంగాన్ని నడిపించే దేశాల సరసన మన దేశం మరింత స్థిరంగా, విశ్వాసంతో నిలబడగలుగుతుందని చాటే ఒక గట్టి ప్రకటన. ●

Main tab page 111_Main tab page 111.qxd 10/13/2025 11:00 PM Page 1



## కల్తీ మద్యంపై నిరసన ర్యాలీ

**చీమకుర్తి, అక్టోబర్13, ప్రభాతవార్త**



నకిలీమద్యం కేసులో నిందితులను తక్షణమే అరెస్టు చేసి శిక్షించాలని మాజీ మంత్రి, సంతనూతలపాడు వైఎస్ఆర్ కాంగ్రెస్ ఇంచార్జ్ డాక్టర్ మేరుగు నాగార్జున డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విచ్చలవిడి కల్తీ మద్యాన్ని నిరసిస్తూ చీమకుర్తిలో మహిళలు, నాయకులతో కలిసి సోమవారం ఆందోళన నిర్వహించారు. నకిలీ



మద్యంపై తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం సిబిఐ ఎంక్వైరీ వేసి దోషులను కఠినంగా శిక్షించాలి, ప్రజల ప్రాణాలను రక్షించాలని డాక్టర్ మేరుగ నాగార్జున కోరారు. వైసీపీ శ్రేణులు, మహిళలతో కలిసి ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రం సమర్పించారు. చీమకుర్తి ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు పమిడి వెంకటేశ్వర్లు, చీమకుర్తి కౌన్సిలర్లు పాటిబండ్ల గంగయ్య, సోమ శేషాద్రి, బాపతు వెంకటరమణమ్మ, సంతనూతలపాడు జడ్పిటిసి దుంపా రమణమ్మ, పార్టీ అధ్యక్షులు దుంపా చెంచిరెడ్డి, మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, బొడ్డు కోటేశ్వరరావు, ఓబుల రెడ్డి పలువురు మహిళలు నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడాలి

**- జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్**

**ఒంగోలు, ప్రభాతవార్త**



ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి అందే క్రమంలో ఏదైనా చట్టపరమైన ఇబ్బందులు ఎదురైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆశ్రయించి తగిన పరిష్కారం పొందవచ్చని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు. సోమవారం ఒంగోలు పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఐటిఐలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుల ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ 18 సంవత్సరాల లోపు బాల బాలికల మీద లైంగిక చర్యలను ఫోక్సో యాక్ట్ చట్టం కింద శిక్షార్హులవుతారని ప్రతి ఒక్కరూ ఈ విషయమై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అదేవిధంగా మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని తద్వారా బంగారు భవిష్యత్తు నిర్మించుకోవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్లను రెవెన్యూ శాఖ నుంచి ఏ విధంగా పొందవచ్చు తెలియజేశారు. లీగల్ ఆఫీసర్ రత్న ప్రసాద్ మాట్లాడుతూ మైనర్లకు సంబంధించిన ఎటువంటి సమస్య అయినా 15100కు ఫోన్ చేసి తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్ ప్రసాద్ బాబు, సూపర్నెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి ఆటల పోటీలకు ఎంపికైన పందిళ్ళపల్లి విద్యార్థులు

**వేటపాలెం, అక్టోబర్ 13, ప్రభాతవార్త**



గత నెల 19, ఈనెల 8,9,10వ తేదీల్లో పందిళ్ళపల్లి, కొలలపూడి, ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించబడిన 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, చీరాల డివిజన్ స్థాయి ఆటల పోటీలలో పందిళ్ళపల్లి హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు తలమల దీప్తి తెలిపారు. అండర్-17 విభాగంలో హైజంప్‌లో సందీప్, హేమర్ త్రోల్, హేమ నాగసాయి, వెంకటేశ్వర్లు, పూజిత, లాంగ్ జంప్‌లో ఆదిలక్ష్మి, వాలీబాల్‌లో సందీప్, రవితేజ, సిద్దు, కబడ్డీలో సందీప్, సిద్దు, షటిల్ బ్యాడ్మింటన్‌లో పూజిత, ఖోఖోలో దేని లక్ష్మణ్, అండర్-14 విభాగంలో 400, 600 మీటర్స్ రన్నింగ్‌లో ప్రియానికిత, హైజంప్‌లో రత్నకుమార్, షటిల్ బ్యాడ్మింటన్‌లో కార్తికేయ, జ్యోత్స్న ప్రతిభ కనపరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు స్టాఫ్ సెక్రటరీ బుద్ధి మోహన్‌రావు, ఎస్.అంకయ్య, తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు, జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు శిక్షణ ఇచ్చి వ్యాయామ ఉపాధ్యాయులు కర్ణ నాగేశ్వరరావు, తోట వెంకటేశ్వర్లులకు అభినందనలు తెలిపారు.

## బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన

**చీరాల, అక్టోబర్ 13, ప్రభాతవార్త**



యార్లగడ్డ అన్నపూర్ణాంబ మహిళా డిగ్రీ కళాశాల నందు ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ అండ్ చీరాల రోటరీ క్లబ్ వారి సహకారంతో బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ బాబురావు సారథ్యంలో జీవీఆర్ హాస్పిటల్ గైనకాలజిస్టు డాక్టర్ ఆప్మా పాల్గొని బ్రెస్ట్ క్యాన్సర్ గురించి మాట్లాడుతూ 3నెలలకు ఒక సారి పరీక్ష చేయించుకోవాలని, ఒకటి, రెండు స్టేజ్‌లలో ఉంటే కీమియో థెరపీ, రేడీయోథెరపి ద్వారా సర్జరీ చేసి రోగిని బ్రతికించే అవకాశం ఉందని, మూడు, నాలుగు స్టేజ్‌లలో అయితే కష్టమని చెబుతూ, బయట ఫుడ్ తినకుండా మంచి పౌష్టికాహారం తీసుకోవాలని, క్యాన్సర్ రాకుండా ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. డాక్టర్ బాబురావు మాట్లాడుతూ రోటరీ డిస్ట్రిక్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో స్పర్శ క్యాన్సర్ హాస్పిటల్ ప్రారంభించి ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నాని తెలియజేశారు. సభా నిర్వహణ వలివేటి మురళీకృష్ణ అధ్యక్షుడు పోలుదాసు రామకృష్ణ, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.రత్న ప్రభ, డాక్టర్ అంకమ్మ, భాను కుమారి సుభాషిణి, లలిత కుమారి, జి.వై ప్రసాద్, గుద్దంటి రమేష్, స్వామి, శివాంజనేయ ప్రసాద్, కుమారస్వామి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## చీరాల మున్సిపాలిటీ అభివృద్ధి చేయాలి :ఛైర్మన్

**చీరాల టౌన్, అక్టోబర్ 13, ప్రభాతవార్త**



చీరాల మున్సిపాలిటీని అభివృద్ధి చేయటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్థానిక చీరాల స్టేషన్ సభ్యులు మద్దులూరి మాలకొండయ్య ఆదేశాలతో సోమవారం మున్సిపల్ ఛైర్మన్ మించాల సాంబశివరావు 23వ వార్డు, 12వ వార్డులో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీరాల మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం చీరాల శాసనసభ్యులు ఎంతగానో కృషి చేస్తున్నారని, వారి ఆశయాలకు అనుగుణంగా చీరాల మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనరులు 15 ఫైనాన్స్ గ్రాండ్స్ ప్రారంభించడం జరిగిందని, అదే విధంగా వార్డుల్లో ఎటువంటి సమస్యలు ఉన్న నా దృష్టికి తేవాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో 24వ వార్డు కౌన్సిల్ సుజాత, 12వ వార్డు కౌన్సిలర్ మామిడాల రాములు, మున్సిపల్ డీఈఈ రఘురాం, ఏఈ కట్టా రవికుమార్, మున్సిపల్ కాంట్రాక్టర్, సచివాలయ సిబ్బంది, వార్డు ప్రజలు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రకాశం

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## రోడ్డు ప్రమాదంలో ఇరువురు యువకులు దుర్మరణం

**కొనకనమిట్ల,అక్టోబర్ 13, ప్రభాతవార్త**





మండలంలోని ఎదురాళ్లపాడు గ్రామ సమీపములో సోమవారం రాత్రి ట్రాక్టర్‌ను వెనకనుండి మోటార్ సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్‌పై ఉన్న డి గణేష్(21), పి అభినాస్ (20)లు తీవ్ర గాయలకు గురై దుర్మరణం చెందారు. గ్రామంలో మర్లు పెళ్లి కార్యక్రమానికి వచ్చి తిరిగి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. 108 అంబులెన్స్ వాహనానికి ఫోన్ చేసిన సకాలంలో రాలేదని అక్కడ స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థానానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలపై ఆరాతీశారు. మృతులిద్దరిది మార్కాపురం మండలం చింతకుంట్ల గ్రామానికి చెందినవారిగా పోలీసులు గుర్తించారు. మృతి చెందిన ఇరువురి యువకులను పొదిలి వైద్యశాలకు తరలించారు.

# తగ్గేదేలే అంటున్న బెల్టు షాపులు - నిద్రావస్థలో ఎక్సైజ్ శాఖ

**ఒంగోలు, ప్రభాతవార్త**

తాగేందుకు గుక్కెడు నీరు లేని గ్రామాలు ఉన్నాయి. కానీ మందు దొరకని గ్రామాలు మాత్రం ఒకటి లేదు. పల్లెల్లో బెల్టు షాపుల దందా జోరుగా సాగుతుంది. మున్సిపాలిటీల్లో పల్లెల్లో మారుమూల గ్రామాలు మత్తులో జోగుతున్నాయి. గ్రామాలు తండాల్లో పుట్టగొడు గుల్లా బెల్టు దుకాణాలు వెలుస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపులు ఏర్పాటు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అనేక మంది బెల్టు షాపుల్లో మద్యం కొనుగోలు చేసి జేబులు చిల్లు చేసుకుంటున్నారు. అప్పులు చేసి తాగడంతో కుటుంబాలు వీధి పాలవుతున్నాయి. అనుమతి పొందిన వైన్ షాపుల నుంచే వందల సంఖ్యలో మద్యం బాటిళ్లు బెల్టు దుకాణాలకు తరలిస్తున్నట్లు నిఘా వర్గాలు పేర్కొంటున్నాయి. సంబంధిత ఎక్సైజ్ శాఖ అనుసంధానంలో బెల్టు దుకాణాల నిర్వహణకు ప్రోత్సాహం ఉందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామాల్లో, తండాల్లో బెల్టు షాపులు కొనసాగుతూ ప్రజలు మత్తులో చిత్తవుతున్నా నిరోధించాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. స్వయం ఉపాధి మార్గాలతో జీవనోపాధి కల్పిస్తుంటే మరో వైపు బెల్టు షాపులు పల్లె ప్రజలను మత్తులో ముంచెత్తుతున్నాయి. కానీ ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం కన్నెత్తి కూడా చూడడం లేదు. మద్యం విక్రయాలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుండడంతో వైన్ షాపుల నిర్వాహకులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ఒక్కో వైన్ షాపు పరిధిలో కనీసం 30 చొప్పున బెల్టు షాపులు అనుసంధానంగా పని చేస్తున్నాయి. తమ టార్గెట్‌లను చేరుకునేందుకు బెల్టు షాపులను ఏర్పాటు చేయిస్తూ అక్రమంగా మద్యం అమ్మకాలు సాగించేలా వైన్‌షాపుల నిర్వాహకులే ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వైన్ షాపుల నుంచి ఎమ్మార్పీ ధరలకు కొనుగోలు చేస్తున్న బెల్టు షాపు నిర్వహకులు ఒక్కో క్వాటర్ బాటిల్‌పై రూ.20 లు, అదనంగా వసూళ్లు చేస్తూ అమ్మకాలు సాగిస్తున్నారు. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా ఎక్కడ చూసిన బెల్టు షాపులు దర్శనమిస్తున్నాయి. బెల్టు షాపుల్లో సిట్టింగ్ ఏర్పాటు చేస్తున్నా పట్టించుకునే వారే లేరు. ఆహార పదార్థాలు తయారు చేస్తూ మందు బాబులకు అందజేస్తున్నారు. బెల్టు షాపుల మధ్య పోటీ పెరగడంతో కస్టమర్లను ఆకర్షించేందుకు ఇళ్లల్లోనే ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. బార్ అండ్ రెస్టారెంటు మాదిరిగా బెల్టు షాపుల్లో చికెన్, మటన్, గుడ్ల ఆమ్లేట్, తదితర ఆహార పదార్థాలను అందజేస్తున్నారు. అనేక



మంది పేరుకే కిరాణా దుకాణాలు నిర్వహిస్తూ లోపల మాత్రం మద్యం వ్యాపారం చేస్తున్నారు. సొంత ఇళ్లల్లో పెద్ద ఫ్రిడ్జ్‌ల్లో పెట్టుకుని మరి విక్రయిస్తున్నారు. వైన్ షాపుల యజమానులు ఆటోల ద్వారా మద్యాన్ని ఊరూరా సరఫరా చేస్తున్నారు. తమకు కేటాయించిన గ్రామాలకు నిత్యం ఆటోలు, బైక్‌ల ద్వారా పేరు మోసిన బ్రాండ్లను పంపించి సొమ్ము చేసుకుంటున్నారు. మద్యం పచ్చని సంసారాల్లో చిచ్చుపెడుతుంది. ఊరూరా బెల్టు షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. దీంతో పగలంతా పని చేసి సంపాదించిన సొమ్మును మద్యానికే విచ్చేస్తూ కుటుంబాలను కుటుంబాలను వీధిన పడేస్తున్నారు. గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తుండడంతో యువత పెడదారి పడుతుంది. ఇటీవల చీమకుర్తి మండలం మంచికలపాడులో మద్యం గొలుసు దుకాణాలు మందు బాబుల ఆగడాలతో విసిగివేశారిన గ్రామస్తులు పార్టీలకు అతీతంగా ఏకమయ్యారు. గ్రామాల్లో సంపూర్ణ మద్య నిషేధం దిశగా పంచాయతీలో తీర్మానం చేయాలంటూ స్థానిక ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తెచ్చారు. గ్రామంలోని మద్యం గొలుసు దుకాణాన్నింటిని తొలగించి సంపూర్ణ మద్య నిషేధం దిశగా గ్రామ సభలో సర్పంచ్ అధ్యక్షతన తీర్మానం ఆమోదించారు. భారీ సంఖ్యలో మహిళలు, పురుషులు ప్రదర్శనగా మంచికలపాడు నుంచి బల్లమూడి వెళ్లే మార్గంలో మద్యం గొలుసు దుకాణాలు వద్దకు వెళ్లి ఇక నుంచి మద్యం అమ్మవద్దని వారికి చెప్పారు. అక్కడ ఉన్న మద్యం సీసాలను రహదారిపై పగలగొట్టి తమ నిరసనను తెలియజేశారు. మున్సిపాలిటీలతో పాటు మారుమూల పల్లెల్లో బెల్టు షాపులు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. వీటిని వైన్ దుకాణాల నిర్వాహకులే ప్రోత్సహిస్తుండగా ఎక్సైజ్ శాఖ అండదండలు పుష్కలంగా ఉంటాయన్నది బహిరంగ రహస్యమే. ఎక్సైజ్ శాఖ ఇచ్చే టార్గెట్‌లను చేరుకునేందుకు వైన్ షాపు యజమానులు బెల్టు షాపులను ఏర్పాటు చేయించి అక్రమ వ్యాపారానికి ప్రోత్సాహం అందిస్తున్నారు. వైన్ షాపుల నుంచి నెల నెల ఎక్సైజ్ శాఖకు మామూళ్లు అందుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైన్ షాపులు మొదలైనప్పటి నుంచి ఈ వసూళ్ల పర్వం మొదలవుతున్నట్లు తెలుస్తోంది. ఇలా ఏడాదికి ఒక్కో వైన్ షాపు నుంచి లక్షల్లో మామూళ్లు వెళ్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఒత్తిళ్లు వచ్చిన సందర్భాల్లో మాత్రం మొక్కుబడిగా దాడులు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మామూళ్ల మత్తులో ప్రజల ప్రాణాలను పనంగా పెడుతున్న ఎక్సైజ్ శాఖ తీరుపై సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## సముద్రం అలల తాకిడికి ఐదు మంది యువకులు మృతి చెందడం బాధాకరం

*- జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్ - రాబోయే రోజుల్లో గట్టి చర్యలు తీసుకుంటాం*

*- 10 బోట్లు, 6 డ్రోన్లు, 10 మంది గజ ఈతగాళ్ళ సహాయంతో ముమ్మరంగా గాలింపు*

*- 10 మందిని వీఆర్ఓలు 8 కిలోమీటర్లు పొడవునా గాలింపు*

**చీరాల, అక్టోబర్ 13, ప్రభాతవార్త**



బీచ్‌ల వద్ద రాబోయే రోజుల్లో ఇలాంటిసంఘటనలు జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. ఆదివారం సాయంత్రం చీరాల మండలం బీచ్ ఓడరేవు సమీపంలో సముద్రం అలలకు ఐదు మంది యువత మతి చెందిన సంఘటనపై సోమవారం రాత్రి ఓడేవు బీచ్ వద్ద గాలింపు చర్యలను ఆర్డీఓ చంద్రశేకర్ నాయుడుతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పరిధిలో ఉన్న బీచ్‌ల వద్దరాబోయే రోజుల్లో ఇలాంటి సంఘటనలు జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆదివారం సాయంత్రం చీరాల మండలం బీచ్ ఓడరేవు వద్ద సముద్ర స్నానానికి వెళ్లిన ఐదు మంది ప్రాణాలు కోల్పోవడం విషయం తెలిసిందేనని అన్నారు. సోమవారం ఒక మృతదేహం దొరికిందని మిగిలిన ఒక్క మృతదేహాన్ని తీసుకురావడానికి రెవెన్యూ, అగ్ని మాపక, పోలీసు, మత్స్య శాఖల అధికారులు శ్రామిస్తున్నారని తెలిపారు. 10 బోట్లు, 6 డ్రోన్ కెమెరాలు, 10 మందిగజ ఈతగాళ్ళు 10 మంది వీఆర్ఓలు ఓడరేవు వద్ద నుండి ఇటు 4 కిలోమీటర్లు, అటు 4 కిలో మీటర్ల పరిధిలో పరిశీలించుటకు ముమ్మర తనిఖీలు చేసి ఈ రాత్రికల్లా మృతదేహాన్ని వెలుపలికి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాస్ నాయక్ ,జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి నవీన్, తహసీల్దార్ గోపి కృష్ణ, పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు.

## పరిశుభ్రత అందరి బాధ్యత: కలెక్టర్

**ఒంగోలు, ప్రభాతవార్త**




జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ రాజాబాబు రాష్ట్ర ప్రభుత్వం, యూనిసెఫ్, విజయవాణి చారిటబుల్ ఫౌండేషన్ సంయుక్తంగా గ్లోబల్ హ్యాండ్ వాష్ డే ప్రాధాన్యతను వివరిస్తూ ముద్రించినటువంటి గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ రాజబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతను కూడా పాటించాలని అందులో భాగంగా భోజనానికి ముందుగా తరువాత సూచించిన ప్రకారం ఏడు మార్గాల ద్వారా చేతులు శుభ్రంగా కడుకోవాలని తెలియజేశారు. ముఖ్యమైన ఏడు సందర్భాలలో చేతులను కడుక్కోవడం అలవాటుగా చేసుకోవాలని తెలియజేశారు. అందులో భాగంగా దగ్గు లేదా తుమ్ము తర్వాత అనారోగ్య వ్యక్తికి సేవలు చేసే ముందు తర్వాత కలుషితమైన వివిధ ఉపరతలాలను తాకినప్పుడు బయటకు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత ఆహారాన్ని తయారు చేసే ముందు తినడానికి ముందు మరుగుదొడ్డిని ఉపయోగించి తరువాత, చెత్త, వ్యర్థాలను పారవేసిన తరువాత తప్పనిసరిగా చేతులను శుభ్రం చేసుకోవడం ద్వారా సురక్షితమైన జీవితాన్ని పొందవచ్చు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాల కృష్ణ, డీఆర్‌డీఓ ఓబులేసు, జిల్లా విద్యాధికారి కిరణ్ కుమార్, జిల్లా మెడికల్ జిల్లా విద్యాధికారి కిరణ్ కుమార్, జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, జిల్లా ఉమన్ చైల్డ్ డిపార్టుమెంట్ ప్రాజెక్టు డైరక్టర్ సువర్ధ, విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ ప్రోగ్రాం ఆఫీసర్ టి.రంగారావు, వాష్ ప్రోగ్రాం ప్రతినిధి కే.మరియబాబు పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం

*- 700 మందికి ఉచిత వైద్య సేవలు - ఉచితంగా మందులు పంపిణీ*

**ఒంగోలు, ప్రభాతవార్త**





ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ సెల్స్ కో కన్వీనర్, డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి వికసిత భారత్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కిమ్స్ హాస్పిటల్స్, క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ ఎస్ ఎస్ విభాగం వారి సహకారంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ సెల్స్ కో కన్వీనర్ డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి తెలియజేశారు. ప్రధాని మోడి వికసిత్ భారత్ లక్ష్యంగా ఎన్నో గొప్ప సంస్కరణలు చేపడుతున్నారని, దాంట్లో భాగంగా విద్య, వైద్యం అనే అంశాలకు పెద్ద పీట వేస్తున్నట్లు చెప్పారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని తన వంతు సాయంగా ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు సూర్య కల్యాణ్ చక్రవర్తి అన్నారు. గతంలో సర్వేరెడ్డిపాలెంలో నిర్వహించిన వైద్యశిబిరం వల్ల ఎంతోమంది చికిత్స చేయించుకున్నారని గుర్తు చేశారు. వికసిత్ భారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని అన్నారు. ఉచిత మెగా వైద్య శిబిరంలో భాగంగా దాదాపు 700 మంది డ్రైవర్లు, వర్కర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు బీపీ, షుగర్, గుండె సంబంధిత పరీక్షలు, కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దాదాపు రూ.30 వేల విలువ చేసే మందులు అందించినట్లు నిర్వాహకులు తెలియజేశారు. ఈ వైద్య శిబిరంలో చూపించుకున్న ఓపీతో కిమ్స్ హాస్పిటల్ లో 50 శాతం డిస్కౌంట్ తో సంబంధిత పరీక్షలు చేస్తామని హాస్పిటల్ వర్గాలు వెల్లడించాయి. ఈ కార్యక్రమంలో కిమ్స్ కి చెందిన డాక్టర్ రామాంజనేయులు, డాక్టర్ ఎం. వర్షిత, కిమ్స్ మేనేజర్ అమర్ నాథ్, క్యాంప్ కో ఆర్డినేటర్ ప్రవీణ్, క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి. హనుమంతరావు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని స్టూడెంట్స్ డీన్ డాక్టర్ వాసుబాబు, ఎన్ ఎస్ ఎస్ డీన్ డాక్టర్ నవనీత కృష్ణన్ పర్యవేక్షించారు.

## ప్రజాసమస్యలు చిత్తశుద్ధితో పరిష్కరించాలి: కలెక్టర్

**ఒంగోలు, ప్రభాతవార్త**



ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన సమస్యలను నిర్ణీత గడువులోపు చిత్తశుద్ధితో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం ఒంగోలు కలెక్టరేట్‌లోని మీ కోసం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజాబాబు, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఒంగోలు ఆర్డీఓ కళావతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కుమార్, పార్థసారధి, విజయ జ్యోతిలతో కలిసి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన దరఖాస్తులు మరలా రీఓపెన్ కాకుండా నిర్ణీత గడువులోపు చిత్తశుద్ధితో పరిష్కరించాలన్నారు. తమ సమస్యలు పరిష్కారం అవుతాయన్న నమ్మకంతో ప్రజలు మన దగ్గరకు వస్తారని, ఆ నమ్మకాన్ని ప్రతి అధికారి నిలబెట్టుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి అర్జీని క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్జీలన్నీ నిర్దేశిత గడువులోగా పరిష్కారం కావాలని, ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కారం చేయడం వలన అర్జీలు పెండింగ్ ఉండబోవని చెప్పారు. పరిష్కారం అయిన వినతుల పట్ల అర్జీదారులు తమ సంతోషాన్ని వ్యక్తపరిచాలని, ఆ దిశగా చర్యలు ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.



6_6.qxd 10/14/2025 12:01 AM Page 1



## వైసిపిలో చేరిక



**అద్దంకి, అక్టోబరు 13, ప్రభాతవార్త**
అద్దంకి పట్టణంలోని పాత శివాలయం ప్రాంతానికి చెందిన చిట్టిబోయిన శ్రీనాథ్, పెరికపాలెంకు చెందిన తాటిబోయిన కోటయ్యలు సోమవారం స్థానిక వైసిపి కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ సమక్షంలో వైసిపి పార్టీలో చేరారు. వీరికి అశోక్ కుమార్ పార్టీ కండువా కప్పి సాదరంగా అహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎల్ రవి, పట్టణ పార్టీ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, పరిమి ప్రసాద్, తదతరులు వున్నారు.

## రాష్ట్ర స్థాయి ఆన్‌లైన్ ప్రతిభా పరీక్షకు నోటిఫికేషన్



**అద్దంకి, అక్టోబరు 13 ,ప్రభాతవార్త**
ఎపి ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ అనుమతితో ఎడ్యుకేషనల్ ఎపిఫణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈఈఎంటి 2026 ఆన్‌లైన్ ప్రతిభా పరీక్షకు నోటిఫికేషన్ విడదల అయ్యింది. ఈ పరీక్షలలో అన్నీ ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలకు చెందిన 7,10తరగతుల విద్యార్థులు, ఉచితంగా పాల్గొనవచ్చు అని ఆ ప్రకటనలో కన్వీనర్ పుట్టంరాజు శ్రీరామచంద్ర మూర్తి పేర్కొన్నారు. అక్టోబరు 15 నుండ నవంబరు 14 వరకు పేర్లు నమోదు చేసుకోవాలని, డిసెంబరు 6న ప్రిలిమినరీ పరీక్ష జరుగుతుందని ఫలితాలు డిసెంబరు 7న విడుదల అవుతాయని ఆయన పేర్కొన్నారు. మెయిన్ పరీక్షకు డిసెంబరు 8 నుండి 12 వరకు పేర్లు నమోదు చేసుకోవాలని డిసెంబరు 27న మెయిన్ పరీక్ష జరుగుతుందని ఫలితాలు జనవరి 2026లో విడదల అవుతాయని తెలిపారు. బహుమతులకు ఎంపికైన వారికి ఫిబ్రవరి 1వ 2026న ప్రధానం చేయబడతాయని ఆయన వివరించారు. ప్రాంతాల వారీగా రాయలసీమలోని అనంతపురం, కడప, కర్నూల్, చిత్తూరు, ఆంధ్ర నెల్లూరు, గుంటూరు, మచిలీపట్నం, ఏలూరు, కాకినాడ, ఉత్తరాంధ్ర, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నాలలో పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. మొత్తం 9లక్షల విలువైన 162 నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు, రాష్ట్ర, జిల్లా స్థాయిలో అగ్రస్థానం సాధించిన విద్యార్థులకు ఈ బహుమతులు ఇవ్వబడతాయి. 4వేలమందికి మెడల్స్, సర్టిఫికేట్లు ప్రధానం చేయబడతాయని ఈ నోటిఫికేషన్ సమాచారాన్ని రాష్ట్ర కోఆర్డినేటర్ అద్దంకి ఎం.ఇ.ఒ.-2 కెవి శ్రీనివాసరావు, కన్వీనర్ పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, సంయుక్తంగా సోమవారం ప్రకటించారు.

## నకిలీ మద్యాన్ని అరికట్టండి - ప్రజల ప్రాణాలను కాపాడండి

### - అద్దంకి నిరసన కార్యక్రమంలో డాక్టర్ అశోక్ కుమార్





**అద్దంకి అక్టోబరు 13,ప్రభాతవార్త**
రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నకిలీ మద్యాన్ని కుటీర పరిశ్రమగా మార్చిందని ఏది నకిలీదో ఏది నాణ్యమైనదో మద్యం విషయమై తెలుసుకోలేని స్థితి రాష్ట్రంలో ఏర్పడిందని అద్దంకి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ అన్నారు. సోమవారం అద్దంకి నియోజకవర్గ వైసిపి అధ్వర్యంలో రాష్ట్ర పిలుపు మేరకు నకిలీ మద్యాన్ని అరికట్టాలని అందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. అందులో భాగంగా అద్దంకిలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్దనుండి నాగులపాడు రోడ్డులో గల ఎక్సైయిజ్ పోలీస్ స్టేషన్ వరకు నిరసన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి గ్రామంలో పాఠశాల వుందో లేదో కాని, ప్రతి గ్రామంలో నాలుగైదు మద్యం బెల్టు షాపులు వున్నాయని అన్నారు. చిత్తూరు నుండి వయా క్రిష్ణాజిల్లా, ఏలూరు, అమలాపురం, అనకాపల్లి వరకు ప్రతి ఊరులో నకిలీ మద్యం కుటీరపరిశ్రమగా మారి ప్రజల ప్రాణాలను హరిస్తుందన్నారు. హత్యచేసిన వాడికంటే చేయించిన వాడిదే పాప అని ఆయన అన్నారు. రాష్ట్రంలో మద్యం టెండర్ల విషయంలో దక్కించుకున్న వారిని బెదిరించి, కూటమి లోని 164మంది ఎమ్మెల్యేలు 30శాతం నుండి 50శాతం వరకు వాటాలు తీసుకున్నారని, మరికొందరిని బెదిరించి, డబ్బుఇచ్చి మొత్తం షాపులనే స్వాధీన పరుచుకున్నారని ఆయన ఆరోపించారు. ఈ విధంగా షాపుల నిర్వహణలో నష్టాలను నివారించేందుకు నకిలీ మద్యాన్ని తయారు చేసి, అమాయకులైన ప్రజల ప్రాణాలను ఈ మద్యం ద్వారా బలితీసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. తంబళ్ళపల్లిలో టిడిపి నుండి పోటీ చేసిన వ్యక్తి నకిలీ మద్యం తయారీలో పాత్ర వున్నట్లు పోలీసులు చర్యలు తీసుకుంటే, ఆ వ్యక్తిపై చర్యలు తీసుకోకపోగా పోలీసులపై చర్యలు తీసుకోవడం ఏమిటి అని కూటమి ప్రభుత్వాన్ని అశోక్ కుమార్ ప్రశ్నించారు. అదేమని ప్రశ్నిస్తే ప్రశ్నించినవారిపై కేసులు పెట్టడం, బెదిరించడం ఏకంగా ఫోర్త్ ఎస్టేట్ అయినా మీడియాను కూడ బెదిరించే స్థితికి కూటమి ప్రభుత్వం దిగజారిందన్నారు. వైసిపిపై కూటమి నేతలు కూవర్టులంటూ అరోపిస్తున్నారని ఎన్నికల ముందు వైసిపిలో వున్న ఎంపిలు, ఎమ్మెల్యేలు నేడు కూటమిలో ఎమ్మెల్యేలుగా, ఎంపిలుగా వున్నారని, ఆఫ్రికాలో వ్యాపారాలు చేసి వచ్చి నేడు కల్తీ వ్యాపారంలో వైసిపి కువర్టులు వున్నారని కూటమి నేతలు ఆరోపించడం సిగ్గుచేటు అని అన్నారు. ఎన్నికలలో కట్టలు కట్టలు డబ్బులు ఆశించి, ఎన్నికలలో పోటీచేయించుకొని, వారిని కువర్టులు అనడం కూటమి ప్రభుత్వం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం అని అన్నారు. నిజంగా వైసిపి నుండి వచ్చిన వారు కువర్టులు అయితే మీ కూటమిలో వున్న ఎంపిలు, ఎమ్మేలు,మంత్రులను వెంటనే డిస్‌మిస్ చేసి, మీ చిత్తశుద్దిని నిరూపించుకోవాలని అశోక్ కుమార్ సవాల్ విసిరారు. రాష్ట్ర మహిళలతోపాటు అద్దంకి నియోజకవర్గ మహిళలకు అశోక్ కుమార్ విజ్ఞప్తి చేస్తూ మీకుటుంబాలలో మద్యం చేవించేవారు వుంటే వారిని జాగ్రత్త చేసుకోవాలని ప్రస్తుతం రాష్ట్రంలో అమ్ముతున్న మద్యం ఏది నకిలీదో, ఏది నాణ్యమైనదో తెలుసుకోలేని స్థితిలో వుందని పుస్తిలు అమ్ముకోవడం, ఒక వైపు జరుగుతున్నా, మరికొందరు ప్రాణాలు కోల్పోతున్న ఈ కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదని మహిళలు చైతన్యవంతులు అయితేనే నకిలీ మద్యాన్ని అడ్డుకట్ట పడుతుందని అశోక్ కుమార్ అన్నారు. ఈ నిరసన కార్యక్రమలో భాగంగా ముందుగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి అక్కడ నుండి ర్యాలీకి అగ్రభాగాన తోపుడు బండ్లపై నకిలీ మద్యం అంటూ నిరసన తెలియజేస్తూ మద్యం బాటిళ్ళు, డబ్బాలతో ఊరేగింపుగా నాగులపాడు రోడ్డులోని ఎక్సైయిజ్ కార్యాలానికి చేరుకున్నారు. డాక్టర్ అశోక్ కుమార్ వైసిపి నాయకులు ఎక్సైయిజ్ అధికారులకు వినతి పత్రం సమర్పించారు. నిరసన ర్యాలీ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పట్టణ సి.ఐ. సుబ్బరాజు బందోబస్తు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి, అన్నీ మండలాల, నాయకులు, వైసిపి కార్యకర్తలు, అభిమానులు మహిళా నేతులు, పాల్గొన్నారు.

## నేడు గాలికుంటు నివారణ టీకా పంపిణీ

**అద్దంకి,అక్టోబరు 13, ప్రభాతవార్త**
అద్దంకి పట్టణంలోని నర్రావారిపాలెంలో మంగళవారం పశువులకు గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు అద్దంకి పశుసంవర్ధకశాఖ ఎడి కెవి.బ్రహ్మయ్య ఒకప్రకటనలో తెలిపారు.

## స్మార్ట్ కార్డులు పంపిణీ



**వెలిగండ్ల, అక్టోబర్ 13, ప్రభాతవార్త**
శాసనసభ్యులుడాక్టర్ మక్కుఉగ్ర నరసింహా రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని కేఎన్‌పురంలో కొత్త రేషన్‌లు(స్మార్ట్ కార్డు) లబ్దిదారులకి మండల పార్టీ అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, డీలర్ నాయుడు శ్రీను, టీడీపీ నాయకులు శానం రంగారావు, సుంకరి లక్ష్మీ, నర్సింహ, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## మండే మార్కెట్ సద్వినియోగం చేసుకోండి



**వెలిగండ్ల, అక్టోబర్ 13, ప్రభాతవార్త**
ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన,అమ్మకం వారు ప్రతి సోమవారం వెలిగండ్ల మండల పరిధి లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఆవరణలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల మండేమార్కెట్‌లో ఆకుకూరలు, కూరగాయలు ప్రతిసోమవారం నిర్వహించడం జరుగుతుంది.ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ ఆహార ఉత్పత్తులు తినటం వల్ల ఆరోగ్యం బాగుపడుతుంది సేంద్రీయ పద్దతులు పండించడం వలన విషరహిత ఉత్పత్తులు తినడం వలన ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుంది.అందువలన ప్రజలందరూ ప్రకృతి వ్యవసాయ మండే మార్కెట్‌ను ఉపయోగించుకోవాలని కోరారు. అలాగే రైతులు కూడా ప్రకృతి వ్యవసాయ పద్దతులు కాయగూరలను పండించుకోవాలని, ఆహార ఉత్పత్తులు పండించుకుని తినడం వలన ఆరోగ్యంగా ఉండవచ్చు, భూమి సారవంతంగా ఉంటుంది. ఈ కార్యక్రమానికి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన అధికారి ఎస్‌కే కాశీం కేసరి నారాయణమ్మ, బి.రాణి కేసరి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## బాల్యారంభ విద్య కోసం మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపండి - సీడీపీఓ సుధ



**సంతమాగులూరు ,అక్టోబరు 13,ప్రభాతవార్త**
పోషణ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా సంతమాగులూరు మండలం వెల్లలచెరువు ఎస్సీ అంగన్వాడీ కేంద్రంలో తల్లులతో సోమవారం సమావేశాన్ని నిర్వహించడం అంగన్వాడీ చిన్నారుల తల్లులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ డి.సుధ సందర్భంగా తల్లులతో మాట్లాడుతూ బాల్యరంభవిద్య కోసం మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపాలన్నారు. చక్కని ప్లే మెటీరియల్‌తో అంగన్వాడి కేంద్రాలు ఆకర్షణీయంగా రూపొందించబడ్డాయని, వెలలచెరువు ఎస్సి1 అంగన్వాడీ కేంద్రంలో పిల్లల ప్రీ స్కూల్ అభ్యసన కొరకు టీవీ, వాటర్ ప్యూరిఫైయర్,ప్లే మెటీరియల్ ఇవ్వడం సమకూర్చడం జరిగిందన్నారు. అలాగే అంగన్వాడీ టీచర్లు పిల్లల కొరకు టీఎల్‌ఎం ( టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) రూపొందించుకొని రోజువారీ కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నారని తెలియజేశారు. పిల్లల్లో శారీరక, మానసిక, భావోద్వేగా, సాంఘిక అవసరాలను బట్టి ఈ ప్లే మెటీరియల్‌ని రూపొందించబడిందన్నారు. ఈ మెటీరియల్ పిల్లల్లో సామర్థ్యాలను పెంచడానికిబాగా ఉపయోగపడతాయని సిడిపిఓ తెలియజేశారు.

### అంగన్వాడీ వెల్ బేబీ షో పోటీలు - విజేతలకు బహుమతులు

అంగన్వాడీ చిన్నారులతో వెల్ బేబీ షో పోటీలను నిర్వహించి పోటీలలో ముగ్గురు పిల్లల్ని విజేతలుగా ప్రకటించి వారికి బహూమతులు అందజేశారు. ప్రతినెలా అంగన్వాడి కేంద్రంలో పిల్లల ఎత్తు మరియు బరువులు కొలిచి వారి ఎదుగుదలను అంచనా వేస్తున్నారు, తల్లిదండ్రులందరూ కూడా వారి పిల్లల ఎదుగుదలను గమనించాలని ఈ సందర్భంగా సిడిపిఓ తెలియజేశారు. ఏఎన్‌ఎం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఆడపిల్లలందరినీ బాగా చదివించాలని, బాల్య వివాహాలు చేయకూడదని బాల్య వివాహాల వలన వారు శారీరకంగా, మానసికంగా అభివృద్ధిని కుంటుపరిచినట్లు అవుతుందని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. చిన్న వయసులోనే పెళ్లి చేయడం వలన ఆడపిల్లలు గర్భం దాల్చిన అప్పుడు పలు సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉందని ముఖ్యంగా రక్తహీనత, ప్రమాదకరమైన శిశు జననం, తక్కువ బరువుతో శిశు జననం, మాతా శిశు మరణాలు సంభవించే అవకాశాలు ఉన్నవని ఏఎన్ఎం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా అంగన్వాడి కేంద్రంలో బాల్య విద్యారంభ విద్యకి సంబంధించి మెటీరియల్ ఎగ్జిబిషన్ పెట్టడం జరిగినది.కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎం సుష్మారాణి ఏఎన్‌ఎం రాజ్యలక్ష్మి ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.వెంకట్రావు,మహిళా పోలీస్ శారదాబాయి, అంగన్వాడి టీచర్లు విజయమ్మ,,జయసుధ తులసి, బాజీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ప్రాణాలు తీస్తున్న కల్తీ మద్యాన్ని అరికట్టాలి

### - మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు



**సీఎస్‌పురం, అక్టోబర్ 13, ప్రభాతవార్త**
నకిలీ మద్యం తయారీని ఒక కుటీర పరిశ్రమలా మార్చి, రాష్ట్రమంతా సరఫరా చేస్తూ, అధికార తెలుగుదేశం పార్టీ నాయకులు కూటమి ప్రభుత్వం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతుందని మాజీ ఎమ్మెల్యే, విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు అన్నారు. సోమవారం మద్యం విధానాలకు వ్యతిరేకంగా విశాఖపట్నం జిల్లాలోని గాజువాక, విశాఖ వెస్ట్ నియోజకవర్గాలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరు బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం గాజువాక, విశాఖ వెస్ట్ సమన్వయకర్తలు దేవన్‌రెడ్డి, మల్లా విజయ్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిధిగా మాజీ ఎమ్మెల్యే విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు పాల్గొన్నారు. ఈసందర్భంగా కదిరి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ నకిలీ మద్యంపై రాష్ట్ర వ్యాప్తంగా పోరుబాట కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. కల్తీ మద్యం వల్ల రాష్ట్రంలో 421 మంది చనిపోయారని తెలిపారు. వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా వైన్ షాపులు, పర్మిట్ రూమ్‌లు, బార్లు, బెల్టు షాపుల్లో ఎక్సైజ్ శాఖ విస్తృతంగా తనిఖీలు చేసి, దీని వెనుక ఎంత పెద్ద వారున్నా అరెస్టు చేయాలని నకిలీ మద్యంపై తక్షణమే సీబీఐ దర్యాప్తు జరిగేలా చూడాలని నకిలీ కల్తీ మద్యం వల్ల చనిపోయిన వారిని గుర్తించి వారి కుటుంబాలను ఆదుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వైన్ షాపుల కేటాయింపులో జరిగిన అక్రమాలు గుర్తించి, అనర్హులను తొలగించాలని మద్యం షాపులను మళ్లీ ప్రభుత్వమే నిర్వహించేలా చొరువ చూపాలని, మద్యం విక్రయ వేళలు కూడా తగ్గించాలని బడులు, గుడులు, పబ్లిక్ ప్లేస్‌లో ఏర్పాటు చేసిన వైన్ షాపులు, బార్ల లైసెన్సులు రద్దు చేయాలని కదిరి బాబురావు డిమాండ్ చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కల్తీ మద్యం అనేది లేకుండా స్వచ్ఛమైన మద్యం ప్రభుత్వమే సరఫరా చేసి బెల్టు షాపులు లేకుండా చేశారని అన్నారు. అనంతరం స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులకు స్థానిక నాయకులతో కలిసి కదిరి బాబురావు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం పార్లమెంట్ సెక్రటరీ, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్ కుమార్, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, వార్డు మెంబర్లు, ఇన్‌చార్జిలు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## 30 వ్యవసాయ బోర్లకు విద్యుత్ సౌకర్యం





**బల్లికురవ, అక్టోబర్ 13, ప్రభాతవార్త**
రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక ఆదేశాలతో మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. సోమవారం సుమారు 30 వ్యవసాయ పంపులకు 7 విద్యుత్ పరివర్తకాల ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించడం జరిగింది. గ్రామ రైతులు దరఖాస్తు నమోదు చేసిన వెంటనే ఎటువంటి ఇబ్బందులు రైతులకు కలగకుండా తక్కువ వ్యవధిలో విద్యుత్ సౌకర్యం అందించడంతో నక్కబొక్కలపాడు గ్రామ రైతులు హర్షం వ్యక్తం చేశారు.ఈఈ మస్తాన్‌రావు సోమవారం సర్వీసులను ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దూళిపాళ్ల హనుమంతరావు మాట్లాడుతూ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక చొరువతో రైతులకు ఇబ్బంది లేకుండా త్వరితగతిన వ్యవసాయ బోర్లకు విద్యుత్ సౌకర్యం కల్పించడం జరిగిందని, నక్కబొక్కలపాడు గ్రామంలో వ్యవసాయ సర్వీసులు అన్ని సులభంగా పూర్తి చేయగలిగామన్నారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు గ్రామ రైతులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఈఈ మస్తాన్‌నరావు, డీఈ ఎం.సురేంద్రబాబు, ఏఈ శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

## చిన్నారిని ఆశీర్వదించిన కరణం





**బల్లికురవ, అక్టోబర్ 13, ప్రభాతవార్త**
ప్రకాశం జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, సుబ్బారెడ్డిల మనువరాలు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కుమార్తె తన్వికరెడ్డి నూతన వస్త్ర బహుకరణ వేడుకలో మాజీ పార్లమెంటు సభ్యులు కరణం బలరాం కృష్ణమూర్తి, చీరాల వైకాపా ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకలో పలువురు మిత్రులతో కలిసి కరణం వెంకటేష్‌బాబు సందడి చేశారు. వీరిలో హుజురాబాద్ శాసనసభ్యులు పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, బైరెడ్డి సిద్దార్థరెడ్డి, కదిరి బాబురావులు ఉన్నారు.

## విధులలో చేరిన నూతన ఉపాధ్యాయులు

**బల్లికురవ, అక్టోబర్ 13, ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన మెగా డీఎస్సీలో నియామక పత్రాలు పొందిన ఉపాధ్యాయులు మండలంలో సోమవారం బాధ్యతలు చేపట్టారు. 15 మంది స్కూల్ అసిస్టెంట్లు, ఒక ఉర్దూ, ఐదుగురు వ్యాయామ ఉపాధ్యాయులు విధులకు హాజరయ్యారు. మండలంలో ఏడు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, మూడు వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు ఇంకా ఖాళీగానే ఉన్నాయి. విధులకు హాజరైన ఉపాధ్యాయులు కొత్తగా కొలువు తీరటం చాలా ఆనందాన్ని కలుగజేస్తుందని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి రుణపడి ఉంటామని భావోద్వేగం వ్యక్తం చేశారు.

## 15 నుండి దీక్ష స్వాములకు సద్ది కార్యక్రమం

**మార్టూరు, అక్టోబర్ 13, ప్రభాతవార్త**
మార్టూరు పట్టణంలోని పడమట బజారు నందు గల శ్రీ రుక్మాబాయి సమేత పాండురంగ శ్రీ ప్రసన్నాంజనేయస్వామివార్ల దేవస్థానం నందు దాతల సహకారంతో అయ్యప్ప స్వాములకు, భవాని స్వాములకు, శివ స్వాములకు, వివిధ మాలధారణ స్వాములందరికి ఈనెల 15 నుండి వచ్చే 25వ తేదీ వరకు మండల దీక్షా కాలము మధ్యాహ్నం 12గంటల నుండి సద్ది కార్యక్రమం ఏర్పాటు చేయడమైందని దేవస్థాన కమిటీ చైర్మన్ సకల ఆంజనేయులు తెలియజేశారు.

## వ్యవసాయ యాంత్రీకరణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### - మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి



**సింగరాయకొండ,అక్టోబర్ 12,ప్రభాతవార్త**
వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా రైతు సంక్షేమం సాధించడానికి ఎన్డిఏ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. సోమవారం సింగరాయకొండలోని కొండపి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కొండేపి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కర్ణ తిరుపతమ్మ కోటి రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మార్కెట్ కమిటీలను బలోపేతం చేస్తూ క్షేత్రస్థాయిలోనే ఎరువులు, అవసరమైన సదుపాయాలు రైతులకు అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రైతు సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూడు విడతలుగా ఆర్థిక సాయం అందిస్తున్నాయని తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణను సద్వినియోగం చేసుకుంటే అధిక దిగుబడులు సాధ్యమవుతాయని రైతులకు పిలుపునిచ్చారు.సింగరాయకొండ, టంగుటూరు మార్కెట్ యార్డుల్లో పెరిగిపోయిన జామాయిల్ చెట్లను బహిరంగ వేలం వేసి వచ్చిన మొత్తాన్ని మార్కెట్ కమిటీ ఖాతాలో జమచేసినట్టు మంత్రి వివరించారు. ఆ నిధులతో యార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. అనంతరం జరిగిన పాలక మండలి సమావేశంలో మార్కెట్ యార్డ్ అభివృద్ధి, మౌలిక వసతుల అంశాలపై చర్చించామని, జిల్లా మంత్రిగా పూర్తి సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు.అనంతరం యార్డ్ ప్రాంగణంలో మంత్రి మొక్కలు నాటారు.సింగరాయకొండ మండల పరిధిలో సాగుతున్న రెవెన్యూ, విద్యుత్ సమస్యలను ప్రజలు తన దృష్టికి తీసుకురావడంతో సంబంధిత అధికారులను పిలిపించి సమీక్షించి వెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంత్రి వెంట తెలుగుదేశం పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## నకిలీ మద్యంపై వైసీపీ ఆధ్వర్యంలో నిరసన



**మార్టూరు, అక్టోబర్ 13, ప్రభాతవార్త**
పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త, రాష్ట్ర కార్యదర్శి గాదె మధుసూదన్‌రెడ్డి ఆదేశాలతో రాష్ట్రంలో నకిలీ మద్యాన్ని అరికట్టి, ప్రజల ప్రాణాలు కాపాడాలని, నకిలీ మద్యం దందాపై సీబీఐ దర్యాప్తు జరిగేలా చూడాలని డిమాండ్ చేస్తూ పార్టీ కార్యాలయం నుంచి ఎక్సైజ్ ఆఫీస్ వరకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు భారీ వర్షాన్ని లెక్కచేయకుండా ర్యాలీగా వెళ్లి ఎక్సైజ్ ఆఫీస్ ఎదురు నిరసన తెలియజేయడం జరిగింది. అనంతరం ఎక్సైజ్ అధికారికి డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రం పార్టీ నాయకులు అందజేయడం జరిగింది. మార్టూరు మండలం నుండి ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కార్యదర్శి ఉప్పలపాటి అనిల్ చౌదరి, మార్టూరు మండల కన్వీనర్ జంపని వీరయ్య చౌదరి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు బి.చిన్న నాయక్, మార్టూరు టౌన్ ప్రెసిడెంట్ అడక గంగయ్య, సీనియర్ నాయకులు మైలా చిన్న నాగేశ్వరరావు, బండి రామయ్య, అట్లూరి జైపాల్, బుజ్జి నాయక్, అట్లూరి కృష్ణారావు, లింగారావు, జొన్నలగడ్డ గురవయ్య, నరసింహారావు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్, సీపీఆర్‌పై అవగాహన



**మార్టూరు, అక్టోబర్ 13, ప్రభాతవార్త**
ఉత్తమ క్యాన్సర్, సీపీఆర్ అవగాహన కార్యక్రమం సందర్భంగా మార్టూరులోని గవర్నమెంట్ హాస్పిటల్ నందు ప్రముఖ గవర్నర్‌మెంట్ డాక్టర్లచే 100 మందికి పైగా ప్రజలు ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఒక మనిషి బాగా లేక పడిపోయినప్పుడు ఎలా సీపీఆర్ అందించాలి అనే దాని మీద ఫోటో ప్రింట్ ద్వారా అవగాహన కల్పించడం జరిగింది. ప్రతి సంవత్సరం బ్లడ్ టెస్టులు చేపించుకోవడం ద్వారా ముందుగానే క్యాన్సర్‌ను గుర్తించినట్లయితే చాలా త్వరగా రికవరీ చేయటానికి ఛాన్స్ ఎక్కువ ఉందని చెప్పడం జరిగింది. తదనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి జామ, అరటి పండ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా రోటరీ అధ్యక్షులు మాదాల సాంబశివరావు, మాజీ అధ్యక్షులు తాళ్లూరి సాంబశివరావు, రొటేరియన్ డాక్టర్ భాను చంద్రనాయుడు, డాక్టర్ కిషోర్ కుమార్, సూపరింటెండెంట్ మేడం, హాస్పిటల్ సిబ్బంది, పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ నియామక పత్రాలు పంపిణీ

### - విద్యాభివృద్ధికి కృషి చేయాలని నూతన ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చిన దోర్నాల మండల ఎంఈవో బి.మస్తాన్ నాయక్



**పెద్దదోర్నాల, అక్టోబర్ 13, ప్రభాతవార్త**
పెద్దదోర్నాల మండల పరిధిలో నియమితులైన నూతన ఉపాధ్యాయులకు నియామక పత్రాలను పెద్దదోర్నాలమండల విద్యాశాఖాధికారి బి.మస్తాన్ నాయక్ సోమవారం మండల విద్యాశాఖ కార్యాలయంలో జరిగినకార్యక్రమంలో నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మస్తాన్ నాయక్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత అని అన్నారు. ఆధునిక సమాజ అభివృద్ధికి విద్యనే పునాది అని, పాఠశాలలో బోధనలతో పాటు విద్యార్థుల ప్రవర్తన, నైపుణ్యాలు, సాంఘిక విలువలపై దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన పలు విద్యాసంస్కరణలను సమర్థవంతంగా అమలు చేసి విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత ముఖ్యమని ఎంఈఓ మస్తాన్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో చేరిన 12 మంది నూతన ఉపాధ్యాయునీ,ఉపాధ్యాయులకు నియామక పత్రాలనుఅందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ముద్దు నాగేశ్వరరావు, బి.రామకృష్ణ నాయక్, మందగిరి వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## మాచవరం 6వ వార్డులో కొత్త డ్రైనేజీ నిర్మాణానికి ఎస్టిమేట్ సిద్ధం

### - ఎమ్మెల్యే డాక్టర్ మక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు చర్యలు



**కనిగిరి, అక్టోబర్ 13, ప్రభాతవార్త**
ఎమ్మెల్యే డాక్టర్ మక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని మాచవరం 6వ వార్డులో కొత్తగా డ్రైనేజీ నిర్మాణ పనుల కోసం మున్సిపల్ సిబ్బంది ద్వారా ఎస్టిమేషన్ సిద్ధం చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ టౌన్ అధ్యక్షులు షేక్ ఫిరోజ్ క్లస్టర్ ఇన్‌చార్జి బాలబాబు, ఆ వార్డు నాయకులు కేఎస్‌ఎస్ సభ్యులు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ, డ్రైనేజీ సమస్యలు తీరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## డేటా సైన్స్ విద్యార్థులకు మిషన్ లెర్నింగ్‌పై వర్క్ షాపు

**వేటపాలెం, అక్టోబర్ 13, ప్రభాతవార్త**
స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ చీరాలలో మెషిన్ లెర్నింగ్ పై వర్క్ షాపు నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.జగదీష్‌బాబు మాట్లాడుతూ గత రెండు రోజులుగా డేటా సైన్స్ విభాగ విద్యార్థులకు నిర్వహించిన వర్క్ షాపు విజయవంతంగా ముగిసినట్లు తెలిపారు. ఈ వర్క్ షాపుకు ఇక్ఫై యూనివర్సిటీ హైదరాబాద్ నుండి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కే.శ్రీనివాసరావు పాల్గొని విద్యార్థులకు మెషిన్ లెర్నింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారన్నారు. ఆధునిక కాలంలో కంప్యూటర్ ప్రపంచంలో మెషిన్లన్నీ ఎంతో ప్రాముఖ్యత వహిస్తుందని తెలిపారు. మిషన్ లెర్నింగ్‌కు సంబంధించిన వాటి వర్గీకరణ, విసదీకరణపై విద్యార్థులకు అవగాహన కల్పించి వాటిపై ప్రయోగాలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డేటా సైన్స్ విభాగాధిపతి డాక్టర్ కే.సుబ్బారావు, డేటా సైన్స్ విభాగ అధ్యాపకులు పాల్గొన్నారు.

## కార్తీక మాసం సందర్భంగా పలు పర్యాటక కేంద్రాలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

### - ఆర్టీసీ జిల్లా రీజనల్ మేనేజర్ సత్యనారాయణ

**సంతనూతలపాడు, అక్టోబర్ 13, ప్రభాతవార్త**
కార్తీక మాసం సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రాంతాల నుండి పాకల బీచ్ వెళ్ళుటకు ప్రతి ఆదివారం ప్రత్యేక బస్సులు నడుపబడునని ఆర్టీసీ జిల్లా రీజనల్ మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. ప్రతి ఆదివారం ఒంగోలులో ఉదయం 6గంటలనుండి సాయంత్రం 6గంటలకు ప్రతి గంటకు ఒక బస్సు, పొదిలి డిపో నుండి ఉదయం రెండు ట్రిప్పులు(ఉదయం 6గం.15నుండి ఉదయం 7.15గంటలకు) ,మధ్యాహ్నం రెండు ట్రిప్పులు ( 13.30గంటల నుండి 14.30గంటల వరకు), కనిగిరి డిపో నుండి కందుకూరు మీదుగా , కనిగిరిలో ఉదయం 7.15గంలకు , 8.15గంటలకు, మధ్యాహ్నం 13గంటలకు , 14గంటలకు, కందుకూరులో ఉదయం 8.45 గంటలకు, ఉదయం 9.45గంటలకు మధ్యాహ్నం 14.30గంటలకు, మధ్యాహ్నం 15.30గంటలకు, సాయంత్రం 16.30గంటలకు, సాయంత్రం 17.30 గంటలకు బయలుదేరే విధంగా రెండు బస్సులు నడుపబడతాయి. కావున జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

## రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌కు స్వాగతం పలికిన శ్రీరంగ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కాశీరావు దంపతులు



**పెద్దదోర్నాల, అక్టోబర్ 13, ప్రభాతవార్త**
రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, ఆధోని ఎమ్మెల్యే పార్థసారథిలు శ్రీశైల దేవస్థానం ట్రస్టు బోర్డు నూతన కమిటీ ప్రమాణ స్వీకారంలో పాల్గొని తిరుగు ప్రయాణంలో సోమవారం దోర్నాలకు చేరుకున్న క్రమంలో శ్రీరంగ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కాశీరావు, డాక్టర్ లావణ్యలు మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలతో శాలువా కప్పి ఘన స్వాగతం పలికారు. డాక్టర్ కాశీరావు మాట్లాడుతూ శ్రీరంగ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ద్వారా ప్రజలకు తక్కువ ఖర్చుతో ఆధునిక వైద్య సేవలు అందిస్తున్నామని తెలపడంతో గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం అభినందనీయని డాక్టర్ కాశీరావు, డాక్టర్ లావణ్యలను అభినందించారు. అనంతరం వారు కర్నూలు తరలి వెళ్లారు.

## సూపర్ జీఎస్టీ సేవింగ్స్‌పై ప్రజలకు వివరించిన ఎంపీడీవో



**వెలిగండ్ల, అక్టోబర్ 13, ప్రభాతవార్త**
మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ భాషా మండల పరిషత్ కార్యాలయంలో సోమావారం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పై అధికారులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బందికి అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ ధరలు తగ్గించిన తర్వాత పేద మధ్య తరగతి ప్రజలకు ఎలక్ట్రానిక్ గూడ్స్, ఆటోమొబైల్, ఎలక్ట్రికల్ తదితర వస్తువులపై ప్రజలకు కొనుగోలు శక్తి పెరిగిందని ఆయన అన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం నుండి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి ప్రజలకు, దుకాణదారులకు అవగాహన కల్పించడం జరిగింది. రోజు వారి మనం ఉపయోగించే వస్తువులపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడం పేద, మధ్య తరగతి వర్గాలకు ఇది మంచి శుభ పరిణామం అని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ ధరలను పరిశీలించి వస్తువులు కొనుగోలు చేయాలని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌కు సంబంధించిన పాంప్లెట్స్ ప్రజలకు, దుకాణదారులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ భాషా, అధికారులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ మద్యంపై గర్జించిన అన్నా రాంబాబు

### - మార్కాపురంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ భారీ నిరసన ర్యాలీ



**మార్కాపురం రూరల్, అక్టోబరు 13,ప్రభాతవార్త**
నకిలీ మద్యం తయారీకి వ్యతిరేకంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మార్కాపురం నియోజకవర్గ కేంద్రంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలతో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ వైఎస్సార్సీపి ఇన్చార్జ్ అన్నా రాంబాబు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం మద్యం మాఫియాల చేతుల్లోకి తోసిందని, నకిలీ మద్యం తయారీకి పాల్పడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లోనూ నకిలీ మద్యం అమ్మకాలు స్వేచ్ఛగా జరుగుతున్నాయని ఆరోపించారు. టీడీపీ నాయకులు వేల కోట్ల రూపాయల అక్రమార్జనకు తెరతీశారని, గత ఎన్నికల సమయంలో చంద్రబాబు "తక్కువ ధరకే మద్యం పంపిణీ" హామీని న్యాయపరంగా కాకుండా, నకిలీ మద్యం తయారీకి ఓ మద్ధతుగా మలచుకున్నారని అన్నా రాంబాబు ప్రశ్నించారు. రాష్ట్రంలోని ప్రతి పల్లెలో బెల్ట్ షాపులు మళ్లీ తిరిగి వెలుగులోకి వచ్చాయని, కానీ కూటమి ప్రభుత్వం మాత్రం చూసి చూడనట్టు వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ నిరసన ర్యాలీలో వైస్సార్సీపి నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొని ప్రభుత్వ విధానాలను ఖండించారు.

## తర్లుపాడు కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా వెలుగు క్రాంతి కుమార్ ప్రమాణ స్వీకారం



**మార్కాపురం రూరల్, అక్టోబరు 13 ,ప్రభాతవార్త**
జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో తర్లుపాడు కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా వెలుగు క్రాంతి కుమార్ పదవిని స్వీకరించారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇంచార్జ్ ఇమ్మడి కాశీనాథ్ అధ్యక్షత వహించారు. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పెద్దిపూడి విజయ్ కుమార్, ప్రకాశం జిల్లా కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కామేపల్లి సీతారామయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ, స్థానిక ఏఎంసి చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు హాజరయ్యారు. అనంతరం వేదికపై కామేపల్లి సీతారామయ్య ఆధ్వర్యంలో క్రాంతి కుమార్ అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఇమ్మడి కాశీనాథ్ మాట్లాడుతూ కొత్తగా బాధ్యతలు స్వీకరించిన వెలుగు క్రాంతి కుమార్‌కు జనసేన పార్టీ తరపున శుభాకాంక్షలు తెలిపారు. గతంలో జరిగిన అవకతవకలను సరిచూసుకుని, ప్రజల పక్షాన పారదర్శకంగా, నిబద్ధతతో పనిచేయాలని ఆశిస్తున్నామని తెలిపారు. అలాగే వర్షం సైతం లెక్కచేయకుండా హాజరైన అతిథులు, నాయకులకు, కార్యకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమిలోని జనసేన, తెలుగుదేశం, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు మరియు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రభుత్వం కౌలు రైతులకు రుణాలిచ్చి ఆదుకోవాలి : దేవేండ్ల శ్రీనివాస్




**త్రిపురాంతకం, అక్టోబర్ 13, ప్రభాతావార్త**
కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించి ప్రభుత్వం ఆదుకోవాలని కోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు దేవేండ్ల శ్రీనివాస్ అన్నారు. స్థానిక రైతు సంఘం ఆధ్వర్యంలో రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కౌలు రైతులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్ మొదలై రైతులు పంటలు వేయడం మొదలెట్టారని, భూములు లేకపోయినా వ్యవసాయం చేసే రైతులు వ్యవసాయంపై మక్కువ పోక కౌలుకు పొలాన్ని సాగు చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో కౌలు రైతులు పంటలు సాగు చేసి అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన అన్నారు. ఇతరుల పొలాన్ని సాగు చేస్తున్న రైతులను గుర్తించి వారికి వెంటనే కౌలు కార్డులు మంజూరు చేయాలన్నారు. వారికి సబ్సిడీ ద్వారా ఎరువులు, పురుగు మందులు అందించాలన్నారు. అలాగే బ్యాంకుల ద్వారా రుణాలు అందేలా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. దేవప్రభుత్వంలో కౌలు రైతులను అధిక సంఖ్యలో సమీకరించి రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమ వేదికగా మారుస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి బాణాల రామయ్య, సీపీఐ మండల కార్యదర్శి దాసరి మల్లికార్జున, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ



**సంతనూతలపాడు, అక్టోబర్ 13, ప్రభాతవార్త**
సంతనూతలపాడులోని అంబేద్కర్ కమ్యూనిటీహాల్ నందు సోమ వారం జరిగిన ఒక కార్యక్రమంలో కార్డుదారులకు క్యూఆర్ కోడ్ ఆధారిత కొత్త స్మార్ట్ రైస్ రేషన్ కార్డులను తహసీల్దార్ ఎస్ఎల్ నారాయణరెడ్డి, ఎంపీడీవో డి.సురేష్‌బాబు, సంతనూతలపాడు సర్పంచ్ దర్శి నాగమణి, మాజీ సర్పంచ్ బాపట్ల పార్లమెంట్ టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి రంపతోటి అంకారావు, వీఆర్వో పి.వెంకట స్వామి తదితరులు పంపిణీ చేశారు. ఈ కొత్త స్మార్ట్ రైస్ రేషన్ కార్డులను ఈపోస్ కార్డుల ఉంటుందని, ముఖ్యంగా కొత్తగా రేషన్ కార్డుల కొరకు లబ్ధిదారులు దరఖాస్తులు పెట్టుకుంటే వారికి కూడా ఈ కొత్త రైస్ కార్డులు లభిస్తాయని తహసీల్దార్ ఎస్ఎల్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం లబ్ధిదారులకు అందించిన ఈ కొత్త స్మార్ట్ రైస్ రేషన్ కార్డులను సద్వినియోగపరుచుకోవాలని తహసీల్దార్ నారాయణరెడ్డి కోరారు. సంతనూతలపాడులో షాపు నంబర్ 15 కు సంబంధించి 445 కొత్త స్మార్ట్ రైస్ రేషన్ కార్డులను ఈ సందర్భంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సంతనూతలపాడు మాజీ సర్పంచ్, బాపట్ల పార్లమెంట్ టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి రంపతోటి అంకారావు అధ్యక్షత వహించగా సంతనూతలపాడు ఒకటవ సచివాలయం వీఆర్ఓ పి.వెంకటస్వామి దీనిని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి మార్పుడి జనార్దన్, చెన్నకేశవస్వామి ఆలయ చైర్మన్ దుంపా సుబ్బారెడ్డి, ఆలయాల డైరెక్టర్లు ఆవాల శ్రీనివాసరావు, మద్దిరాల శ్రీనివాసరావు, వీఆర్ఏలు మార్పుడి అశోక్, బొద్దు బ్రహ్మయ్య, షేక్ అలీ ఖాన్‌లు, టీడీపీ నాయకులు షేక్ నాయబ్, మట్టా పోలిశెట్టి, పావులూరి నారాయణస్వామి చౌదరి, కాలేషా, సజీర్, శివ, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు దాసరి ప్రకాశం, అంబేద్కర్ సంఘం నాయకులు ఎమ్మని నాగేశ్వరరావు, పి.లక్ష్మీనారాయణ, బి.అలీ, సుదర్శి షక్రి, దర్శి ప్రేమ్ చంద్, దాసరి వెంకటరావు, మార్పుడి సుబ్బారావు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## కంభంలో పిచ్చికుక్క స్వైర విహారం



**కంభం, అక్టోబరు 13, ప్రభాతవార్త**
మండలంలోని కంభం, కందులాపురం పంచాయతీలలో సోమవారం సాయంత్రం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. పిచ్చికుక్క దాడిలో కంభం, కందులాపురం పంచాయితీలకు చెందిన 10మంది తీవ్రంగా గాయపడ్డారు. అందిన సమాచారం మేరకు పిచ్చికుక్క నడుస్తూ వెళ్తున్న పలువురు పై దాడి చేసి గాయపరిచినట్టు తెలిసింది. పిచ్చికుక్క దాడిలో కంభంకు చెందిన పెద్ద శ్రీను, బి.వెంకటేశ్వరమ్మ, సిహెచ్ సత్యమ్మ,కందులాపురంకు చెందిన ఏడుకొండలు, జులేఖాబి, ఏలియా, మోనిక, ప్రియాంక, కే శ్రీనివాసులను కాళ్లు , చేతులపై దాడి చేసితీవ్రంగా గాయపరిచింది. గాయపడిన వారు కంభం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.

## మోడల్ స్కూల్ ప్రిన్సిపల్‌గా పి.మురళి

**రాచర్ల, అక్టోబర్ 13 ,ప్రభాతవార్త**
రాచర్ల మోడల్ స్కూల్ ప్రిన్సిపల్‌గా పి.మురళి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తున్న జి సుధాకర్ రావు ఈస్ట్ గోదావరి రెడ్డిగూడెం ప్రాంతానికి బదిలీ కాగా స్థానిక పాఠశాలలో పనిచేస్తున్న మురళి పూర్తిస్థాయి ప్రిన్సిపల్‌గా నియమింపబడ్డారు. బాధ్యతలు స్వీకరించిన మురళిని విద్యాశాఖ అధికారులు షేక్ మైనుద్దీన్, అశ్విని కుమార్‌లు అభినందించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ నూతనంగా ఎంపికైన నలుగురు ఉపాధ్యాయులు సోమవారం బాధ్యతలు స్వీకరించారని తెలిపారు. పాఠశాలఅభివృద్ధికి విద్యార్థులను ఉత్తమవిద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు తమ వంతు కృషి చేస్తామని అన్నారు.

## 17న రంగస్వామి దేవస్థాన భూముల కౌలుకు వేలం పాటలు

**రాచర్ల, అక్టోబర్ 13, ప్రభాతవార్త**
మండలంలోని జేపిచెరువు అటవీ ప్రాంతంలో వెలసియున్న శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థానం భూముల కౌలుకు ఈ నెల 17వ తేదీన వేలంపాటలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ కార్య నిర్వహణ అధికారి మల్లవరపు నాగయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాట దారులకు 2025-2026 నుండి 2029-2030 5 సంవత్సరాల వరకు కాలపరిమితి ఉంటుందని ఆయన తెలిపారు. చోళవీడు, అనుమలవీడు, రామాపురం, సోమిదేవిపల్లి, రంగాపురం గ్రామంలోని దాదాపు 27 ఎకరాల మెట్ట భూమికి ఆయా గ్రామాల్లోని రామాలయాల్లో ఉదయం 11 గంటలకు వేలం పాటలు జరుగుతాయని ఆయన తెలిపారు.

## మండలంలో నేటి నుండి శనగ విత్తనాలు పంపిణీ

**రాచర్ల, అక్టోబర్ 13,ప్రభాతవార్త**
మండలంలోని అన్ని గ్రామాలలోగల రైతు సేవా కేంద్రాల్లో నేడు (14వ తేదీ మంగళవారం) నుండి సబ్సిడీపై శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వ్యవసాయ శాఖ అధికారి షేక్ మహబూబ్ బాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జే.జి 11 రకం మరియు కాక్2 రకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయని క్వింటా పూర్తి ధర రూ.7800 కాగా సబ్సిడీ రూ.1950 పోను రైతువాటా రూ.5850 చెల్లించాల్సి ఉంటుందన్నారు. బయోమెట్రిక్ విధానంలో రిజిస్ట్రేషన్ చేయించుకుని అందుకు సంబంధించిన నగదును రైతులు జమ చేయాలని సూచించారు. ఒక్కొక్క ఎకరాకు 40 కేజీల చొప్పున 5 ఎకరాల వరకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అవసరమైన రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, మొబైల్ నెంబర్‌తో రైతుసేవా కేంద్రాలకు వెళ్ళాలని ఆయన కోరారు

## జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి రాజ్యాంగంపై దాడి

### - వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు



**సంతనూతలపాడు, అక్టోబర్ 13, ప్రభాతవార్త**
మనువాదులు, మతోన్మాదుల ప్రమాదం నుండి రాజ్యాంగాన్ని దేశాన్ని కాపాడుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయిపై జరిగిన దాడిని నిరసిస్తూ సంతనూతలపాడు మండలంలోని బి.మాచవరంలోని అంబేద్కర్ భవన్లో సోమవారం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ శూద్ర వర్ణంలో పుట్టిన వారు విద్య, ఉపాధి పరిపాలనలకు దూరంగా ఉండాలని, అంటరానివారుగా, ఊరికి దూరంగా జీవించాలని మనుధర్మశాస్త్రం చెబుతుందని అన్నారు. ఈ మనుధర్మభావజాలం , సనాతన సాంప్రదాయాలు సమాజాభివృద్ధికి ఆటంకమని, అమానవీయమైన కుల వివక్షతను అవి పెంచి పోషిస్తాయని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 1929లోనే మనుధర్మ శాస్త్రాన్ని నడి వీధుల్లో దగ్ధం చేశాడని గుర్తు చేశారు. ఆ మనుధర్మ భావజాలం వంట పట్టించుకున్న మతోన్మాదులు నేడు దేశంలో గద్దెనెక్కటం, వారి భావజాలం విస్తృతమవటం విచారకరమని అన్నారు. దాని ఫలితంగానే సమాజంలో ఇటువంటి పోకడలు విపరీతమవుతున్నాయని అన్నారు. బీజేపీ అదికారంలోకి వచ్చాక ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడిన వారికి ప్రభుత్వం అండగా ఉండటం ఫలితంగానే ఇటువంటివి హెచ్చరిల్లుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాజాన్ని అనాగరిక స్థితిలోకి తీసుకెళ్లే భావజాలాన్ని పాలకులే ప్రచారం చేయటం సిగ్గుచేటని అన్నారు. లౌకిక తత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని సమానత్వాన్ని కోరుకున్న డాక్టర్ అంబేద్కర్ ఆలోచనలు ఆర్ఎస్ఎస్‌కు, సనాతన వాదులకు గిట్టవని అన్నారు. అందుకే ఆయన విగ్రహానికి నిప్పు పెట్టడం, అవమానపరచటం బీజేపీ పరిపాలన కాలంలో తీవ్ర రూపం దాల్చాయని అన్నారు. ఇటువంటి దుర్మార్గాలకు అడ్డుకట్ట పడాలని లౌకిక వాదులంతా ఒక తాటిపైకి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అడ్డగబొట్టు నరసయ్య, సుదర్శి నరసింహంన, దాసరి సింగరావు, ప్రేమల సింగయ్య, దారా సుబ్బారావు, కోతి అంజయ్య, అన్నవరపు కోటేసు, కే.అంకమ్మరావు, పి.వెంగయ్య, ఏ.అంజిబాబు, నూతలపాటి శ్రీను, పులగర కోటేసు పాల్గొన్నారు.

## బోర్‌కు స్వచ్ఛందంగా శంకుస్థాపన చేసిన దాతలు డాక్టర్ నర్సింగరావు శాంతిప్రియ దంపతులు



**సంతనూతలపాడు, అక్టోబర్ 13, ప్రభాతవార్త**
సంతనూతలపాడు అంబేద్కర్ నగర్ మొదటి లైను అంగన్‌వాడీ స్కూల్ సమీపంలో గ్రామస్తుల కోరిక మేరకు డాక్టర్ చెరుకూరి సుబ్బారావు, చిరంజీవుల జ్ఞాపకార్థం వారి అల్లుడు, కుమార్తెలైన డాక్టర్ కొమ్మి నర్సింగరావు, డాక్టర్ కొమ్మి శాంతి ప్రియలు స్వచ్ఛందంగా బోరుకు శంకుస్థాపన చేశారు. డాక్టర్ నర్సింగరావు, శాంతి ప్రియ దంపతులు ఆధ్వర్యంలో సంతనూతలపాడులో పలువాడల్లో స్వచ్ఛందంగా బోర్లను ఏర్పాటు చేసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు సర్పంచ్ దర్శి నాగమణి, మాజీ జడ్పీటీసీ తన్నీరు శ్రీనివాసరావు, నీటి సంఘం అధ్యక్షులు చెరుకూరి శ్రీనివాసరావు, మండల బీజేపీ అధ్యక్షులు బాలినేని కళ్యాణ్‌రెడ్డి, బీజేపీ మండల మాజీ అధ్యక్షులు తెల్లమేకల శ్రీనివాసరావు, టీడీపీ సంతనూతలపాడు గ్రామ అధ్యక్షులు బొడ్డు శంకర్‌బాబు, మాజీ సొసైటీ అధ్యక్షులు సాధినేని శ్రీరామమూర్తి, డాక్టర్ నర్సింగరావు, శాంతిప్రియ కుటుంబీకులు టి.కిరణ్, త్రిపురాంతక స్వామి దేవస్థానం చైర్మన్ శిఖాకొల్లి ఉమామహేశ్వరరావు, మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి మార్పుడి జనార్ధన్, టీడీపీ నాయకులు పొన్నం ఇంద్రబాబు, భాస్కరరావు, బి.యల్లమంద, బొడ్డు వెంకటరావు, చెరుకూరి వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## మద్యం తాగి ట్రాక్టర్ నడిపిన వ్యక్తికి 50 రోజుల జైలు శిక్ష




**గిద్దలూరు, అక్టోబరు 13,ప్రభాతవార్త**
గిద్దలూరు పట్టణంలో మద్యం తాగి బైక్ నడిపిన ఇద్దరు వ్యక్తులకు 20 రోజులు జైల్ శిక్ష మరియు రూ.10వేలు జరిమానా, బేస్తవారిపేట పట్టణంలో మద్యం తాగి బైక్ నడిపిన మరో ఇద్దరు వ్యక్తులకు 20 రోజుల జైల్ శిక్ష మరియు రూ.10వేలు జరిమానా, కోమరోలు పట్టణం నందు మద్యం తాగి ట్రాక్టర్ నడిపిన వ్యక్తికి 50 రోజులు జైల్ శిక్ష, రూ.10వేలు గిద్దలూరు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.భరత్ చంద్ర శిక్ష విధించారు.

## చెకుముకి సైన్స్ సంబరాల గోడ పత్రిక ఆవిష్కరణ



**కొనకనమిట్ల, అక్టోబర్ 13, ప్రభాతవార్త**
జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నెల 18న పాఠశాల స్థాయి నుంచి ప్రారంభమయ్యే చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలని కోరుతూ వాల్ పోస్టర్ కరపత్రాలను సోమవారం కొనకనమిట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి బి.దేవప్రసాద్ చెకుముకి ప్రతిభా పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.ఉదయ్ కుమార్, ఉపాధ్యాయులు, జేవీవీ మండల అధ్యక్షులు పీవీ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## తండ్రి కొడుకుల భాగస్వామ్యంతో రాష్ట్రమంతా నారా వారి సారా వ్యాపారం

### - రాష్ట్ర స్థాయిలో నకిలీ మద్యం
### - ఫ్యాక్టరీ ,జిల్లాలలో అనుసంధానంగా నకిలీ మద్యం యూనిట్లు
### - మండలాలకు దిగుమతి ,బెల్టుషాపుల రూపంలో గ్రామాలకు సరఫరా
### - రాష్ట్రమంత అంతు చిక్కని కల్తీ మద్యం దుఖాణాలు
### - ఎమ్మెల్యే, తాటిపర్తి చంద్రశేఖర్






**యర్రగొండపాలెం,అక్టోబర్ 13,ప్రభాతవార్త**
కూటమి ప్రభుత్వంలో విచ్చల విడిగా కల్తీ మద్యం తయారీ కేంద్రాలను నెలకొల్పి నారా వారి సారాను రాష్ట్ర మంతావ్యాపారం చేస్తున్నారని యర్రగొండపాలెం ఎమ్మెల్యే , రాష్ట్ర అధికారపార్టీ ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ధ్వజమెత్తారు . రాష్ట్రపార్టీ పిలుపులో మేరకు యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అధ్వర్యంలో కల్తీ మద్యంసరఫరాను వ్యతిరేకిస్తూ ఎర్రగొండపాలెంలో భారీర్యాలీ జరిగింది. ఈ ర్యాలీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి చెంచుపాముల కాలనీ లోని ఎక్సైజ్ కార్యాలయం వరకు సాగింది. కల్తీమధ్యాన్ని వ్యతిరేకిస్తూ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆపార్టీ శ్రేణులు , మహిళలతో కలిసి నినాదాలు చేసారు ,అనంతరం దివంగతనేత వైఎస్సార్ , అంబేద్కర్ విగ్రహలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు ,ఎక్సైజ్ కార్యాలయంలో కార్యాలయం ఎమ్మెల్యే ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ప్రజలనుద్దేశించి ఎమ్మెల్యే చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రలో తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు ఒక్కొక్కరు ఒక్కో జిల్లాను ఎంపిక చేసుకొని విభాగాలుగా విభజించుకొని కల్తీమద్యం అమ్మకాలు జరుపుతున్నారని మండిపడ్డారు.రాష్ట్రంలో కల్తీ మద్యం దుకాణాలు రోజు రోజుకు ఎక్కువ అవుతున్నాయనన్నారు. అక్రమ మద్యం సరఫరా ఫ్యాక్టరీని నెలకొల్పారంటే వీరి వెనుక తండ్రి ,కొడుకులు ఉన్నట్టు తేటతెల్లమైందన్నారు . జిల్లాల వారిగా నకిలీ మద్యం యూనిట్లు ఎర్పాటు చేశారని ధ్వజమెత్తారు. ప్రతి గ్రామంలో బెల్ట్ షాపులకు నకిలీ మద్యం సరఫరా చేసినట్లు తెలుస్తుంద అన్నారు. ఇటీవల గ్రామాల్లో చాలామంది అంతు చిక్కని జబ్బులతో మరణిస్తున్నారని , అలాంటి మరణాలకు ముమ్మాటికకీ ఈ కల్తీ మద్యమే కారణమని ఎమ్మెల్యే చంద్రశేఖర్ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్యదర్శి ఉడుముల అరుణ, మండల పార్టీ అధ్యక్షులు ముసాలరెడ్డి, ఎర్రగొండపాలెం సర్పంచ్ అరుణ భాయి,చెన్నంపల్లి సర్పంచ్ తమ్మినేని సత్తిరెడ్డి , గంజివారిపల్లె సర్పంచ్ సుబ్బారెడ్డి , మొగుళ్ళపల్లి సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి,పలు మండలాల పార్టీ అధ్యక్షులు, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు. అనుబంధ సంఘాల నాయకులు, మహిళలు,పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## నూతన ఉపాధ్యాయులకు సాదర అహ్వానం పలికిన యంఈవోలు , యూనియన్ నాయకులు



**యర్రగొండపాలెం,అక్టోబర్ 13,ప్రభాతవార్త**
యర్రగొండపాలెం మెగా డియస్సి 2025 ద్వారా యర్రగొండపాలెం మండలానికి వచ్చిన 12 మంది యజ్జీటిలు, 35 మంది స్కూల్ అసిస్టెంటెలు మొత్తం 47 మంది ఉపాధ్యాయులకు యంఇఓ శ్రీ ఆంజనేయులు వారికి సాదరంగా అహ్వానించారు ,ఈ సందర్బంగా వారిని ఉద్దేశించి మాట్లాడుతూ ఎంతో కష్టపడి ఉపాధ్యాయ వృత్తిసాధించారనీ అటువంటి మీరు మీరు చేరే పాఠశాలలో విద్యార్థులు మరియు పాఠశాలల ఉన్నతే ప్రధాన లక్ష్యంగా చేసుకొని పనిచేయాలన్నారు.సమయ పాలన పాటిస్తూ పాఠశాలలకు హాజరు కావాలనీ , ముఖ హాజరు తప్పక వేయాలని, విద్యార్థులకు మంచి సూచనలు సలహాలతో అర్ధమయ్యే రీతిలో విధ్యా బోధన చేయలని , పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని ,డ్రాప్ ఔట్స్ తగ్గించుటకు కృషిచేయాలనీ, గ్రామస్తులతో విద్యార్థుల తల్లిదండ్రులతో మంచి సంబంధాలు కలిగి వుండాలని కోరారు. మరో యంఇఓ మల్లూనాయక్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యావిధానంలో వచ్చే మార్పులకనుగుణంగా విద్యాబోధన జరుపాలని,ఆన్‌లైన్ తరగతులు, రిపోర్టులు ఎప్పటికప్పుడు పూర్తిచేయాలనీ, విద్యార్థులకుమంచి భవిష్యత్తు అందించడం కోసం కృషిచేయాలన్నారు.ఈ కార్యక్రమంలో యుటిఎఫ్,యస్టియు సంఘ నాయకులు శ్రీనివాసులు,బాబుల్‌నాయక్, శామ్యూల్, వెంకటేశ్వర్లు,ఆత్మానందప్రభాకర్, జేమ్స్‌పాల్, యంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.యూనియన్ నాయకులు నూతన ఉపాధ్యాయులకు శుభకాంక్షలను అందజేసి యూనియన్ విధివిధానాలను తెలిపియూనియన్ ఎల్లవేళల అండగా ఉంటుందని తెలిపారు అనంతరం యూనియన్ తరుపున వారందరికి అల్పాహార విందు ఏర్పాటు చేసారు.

## శ్రీశైలం అభివృద్ధి తిరుమల స్థాయిలో ఉండాలని ఆకాంక్ష

### - మార్కాపురం పట్టణ అధ్యక్షుడు పాదర్తి ఆంజనేయులు




**మార్కాపురం రూరల్, అక్టోబర్ 13 ,ప్రభాతవార్త**
శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ రమేష్ నాయుడు ఆహ్వానంతో సోమవారం శ్రీశైలంలో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మార్కాపురం పట్టణ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధ్యక్షుడు పాదర్తి ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన దేవస్థాన అభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. శ్రీశైలం ఆలయాన్ని తిరుమల స్థాయిలో అభివృద్ధి చేయాలని ఆయన కోరారు. అంతర్జాతీయ స్థాయిలో భక్తులను ఆకర్షించే విధంగా అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. భక్తులే దేవాలయ స్ఫూర్తి అని, వారి సౌకర్యం కోసం ప్రభుత్వం, దేవస్థానం కలిసి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్తీక మాసం సమీపిస్తున్న నేపథ్యంలో, భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉందని, వారి దర్శనానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. ప్రథమ శ్రేణి లో వ్యవస్థలు ఉండేలా చర్యలు తీసుకోవాలని, భక్తుల రాకపోకలకు ఆటంకం కలగకుండా ట్రాఫిక్, శుభ్రత, భద్రత వంటి అంశాల్లో పటిష్ఠ చర్యలు అవసరమని వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు,భక్తులు పాల్గొన్నారు.కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించినందుకు నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

## కార్డుదారులు స్మార్ట్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలి



**రాచర్ల, అక్టోబరు 13, ప్రభాతవార్త**
ప్రభుత్వం పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్‌కార్డులను కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని రామాపురం సొసైటీ బ్యాంక్ చైర్మన్ భవనం పుల్లారెడ్డి అన్నారు. ఎడవల్లి గ్రామంలో సోమవారం ఆయన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తే మన కుటుంబ వివరాలతో పాటు రేషన్ వివరాలు కూడా తెలిసిపోతాయని డీలర్లు మోసం చేసే అవకాశం లేదన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజలు రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ పొందవచ్చని అన్నారు. దారిద్రరేఖకు దిగువన ఉన్న పేద ప్రజలకు అన్యాయం జరగకూడదని కూటమి ప్రభుత్వం స్మార్ట్ కార్డుల విధానాన్ని అమలులోకి తెచ్చిందని అనుమలవీడు గ్రామ టిడిపి నాయకుడు వేమిరెడ్డి శివరామిరెడ్డి అన్నారు. స్థానిక నాయకులతో కలిసి ఆయన కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు ఎస్ రంగయ్య బి కిషోర్ కుమార్ సర్పంచులు పల్నాటి లతీఫ్, గోపి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాణ స్వీకారం మహోత్సవంలో పాల్గొన్న ముత్తుముల క్రిష్ణ కిశోర్ రెడ్డి



**గిద్దలూరు రూరల్, అక్టోబరు 13,ప్రభాతవార్త**
నంద్యాల జిల్లా శ్రీశైలంలో భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల దేవస్థానం నందు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఆశీర్వాదంతో కోమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు సతీమణి బోనేని రమణమ్మని భ్రమరాంబా మల్లిఖార్జున స్వామివార్ల దేవస్థానం శ్రీశైలం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం మహోత్సవంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తుముల క్రిష్ణ కిశోర్ రెడ్డి పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఇంకా ఉన్నత స్థాయి పదవులు అందుకొని కోమరోలు మండలం, గిద్దలూరు నియోజకవర్గ ప్రజలకు సహకరిస్తూ మంచి పేరు, గుర్తింపు తీసుకురావాలని కొనియాడారు. అనంతరం ఇరువురినీ శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వీరితోపాటు గిద్దలూరు మండల పార్టీ అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, గోన చెన్నకేశవులు, గిద్దలూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గోడి ఓబుల్ రెడ్డి, బిజెపి రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షులు పిడతల రమేష్ రెడ్డి, భవనం శ్రీధర్ రెడ్డి, పందనబోయిన భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

8_8.qxd 10/14/2025 12:04 AM Page 1



## కనిగిరిలో నకిలీ మద్యానికి వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ నిరసన ర్యాలీ

### - నకిలీ మద్యం కేసును సీబీఐతో విచారణ చేయాలని డిమాండ్






**కనిగిరి, అక్టోబర్ 13, ప్రభాతవార్త**
మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న నకిలీ మద్యం వ్యతిరేకత ఉద్యమంలో భాగంగా సోమవారం కనిగిరి వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ జరిగింది. వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ ఆదేశాల మేరకు, మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ నేతృత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ మున్సిపల్ చైర్మన్ నివాసం వద్ద ప్రారంభమై, ఒంగోలు బస్టాండ్ సమీపంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం వరకు సాగింది. అనంతరం ఎక్సైజ్ సీఐ విజయభాస్కర్ రావుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ మద్యం తయారీ, సరఫరా విస్తరించిందని తీవ్రంగా విమర్శించారు. నాణ్యమైన మద్యం అందిస్తాం అంటూ ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు ప్రజల ప్రాణాలతో ఆడుకుంటోందని, అధికార దుర్వినియోగంతో టీడీపీ నాయకులు వేల కోట్లు అక్రమంగా దోచుకుంటున్నారని మండిపడ్డారు. నకిలీ మద్యం తయారీ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు తక్షణమే జరగాలని, దాని వల్ల మరణించిన వారి కుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వైన్ షాపులు, బెల్టు షాపులు, బార్లు, పర్మిట్ రూమ్‌లపై విస్తృత తనిఖీలు జరిపి, అక్రమాలకు పాల్పడిన వారిని అరెస్టు చేయాలని కోరారు. మద్యం షాపుల కేటాయింపులో అవినీతి జరిగినట్లు గుర్తించి అనర్హులను తొలగించాలని, బడులు, గుడులు, ప్రజా ప్రదేశాల వద్ద ఉన్న బార్‌లు, వైన్ షాపుల లైసెన్సులు రద్దు చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మద్యం విక్రయ వేళలను కూడా తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, రాష్ట్ర మహిళా విభాగ జోనల్ ప్రెసిడెంట్ గంగసాని లక్ష్మీ, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పులి శాంతి, తమ్మనేని సుజాత, పామూరు మండల అధ్యక్షుడు గంగసాని హుస్సేన్‌రెడ్డి, జడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, యక్కంటి శ్రీనివాసులరెడ్డి, గజ్జల వెంకటరెడ్డి, గోపవరపు బొర్రారెడ్డి, పాలగుల్ల మల్లిఖార్జునరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ చింతగుంట్ల సాల్మన్ రాజు, సూరసాని మోహన్‌రెడ్డి, ఎస్సీ నాయకులు కటికల వెంకటరత్నం, ఆవుల భాస్కర్‌రెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, భువనగిరి వెంకటయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ రాచపూడి మాణిక్యరావు, కో ఆప్షన్ సభ్యులు గూడూరి అబ్రహం లింకన్, డాక్టర్ షేక్ నాయబ్ రసూల్, గట్ల విజయభాస్కర్‌రెడ్డి, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, చింతం శ్రీనివాసులు, రామనబోయిన శ్రీనివాసులు, వాకమల్ల రాజశేఖర్‌రెడ్డి, ముల్లంగి శ్రీహరిరెడ్డి, సిరుప గోవర్ధన్‌రెడ్డి, పోలక సిద్దారెడ్డి, బత్తుల అంజయ్య, బైరెడ్డి తిరుపతిరెడ్డి, దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, షేక్ చాంద్ భాషా, షేక్ నాయమ్ రసూల్, మద్ది తిరుపతయ్య, సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, చెరుకుపల్లి రాధాకృష్ణారెడ్డి, పల్నాటి భాస్కర్‌రెడ్డి, పులి శ్రీనివాసులురెడ్డి, యర్రబల్లి దేవరాజు, షేక్ రహీం భాష, సిగా కృష్ణారావు, పిల్లి లక్ష్మీనారాయణరెడ్డి, దర్శి ఫణి కుమార్, కన్నేటి సుబ్బారెడ్డి, ఏలిక నారాయణ దాదిరెడ్డి మాలకొండారెడ్డి, బత్తుల మాలి, సాంగు వెంకటేశ్వరరెడ్డి, షేక్ పోలిచెల్ల రహీం, గూడూరి అనిల్‌బాబు, తాతపూడి నాని, గంగవరపు జయపాల్, మల్లెల యాకోబు, శెట్టిపల్లి కొండయ్య, శ్యామల సాంబిరెడ్డి, కేతిబోయిన యాకోబు, శెట్టిపల్లి కొండయ్య, శ్యామల సాంబిరెడ్డి, కేతిబోయిన వెంకట కాశయ్య, పాలేటి ప్రేమ్, వడ్డే రవి, శీలం సుదర్శన్, అత్యాల ఇసాక్, ఎలిక అచ్చయ్య, శ్రీరామ శ్రీనివాసులు, మన్యం మాధవ, జొన్నలగడ్డ గోవిందయ్య, ముడియాల అనంతరెడ్డి, కోడూరి రామ సుబ్బారెడ్డి, అయిమల్ల నాగమణి, కస్తాల బేబి, నెలకుర్తి మహేశ్వరి, షేక్ షకీల, పందిటి వెంకటలక్ష్మీ, షేక్ జమీల, ఇండ్ల భాను, రాచూటి సుస్మిత, మద్దిశెట్టి భారతి, కోటమ్మ, మీనిగ రాధ, ఎడవల్లి ప్రసాద్ రెడ్డి, పచ్చ వెంకట సుబ్బయ్య చౌదరి, తమ్మనేని శివరామిరెడ్డి, భూమిరెడ్డి కొండారెడ్డి, కస్తాల బాలాజీ, షేక్ కాశీం వలి, షేక్ ఖాదర్ జిలాని, షేక్ రెహమాన్, పలుకూరి భాస్కర్, పాపసాని శ్రీనివాసులురెడ్డి, కోలగాని సుబ్బయ్య, దర్శి సుబ్రహ్మణ్యం, రేగుల బాలయ్య చౌదరి, తాతపూడి రాము,పోతుల రమేష్,ఒంటిపెంట శివకృష్ణారెడ్డి, కాసుల బాల గురవయ్య, గంగవరపు జయపాల్,డబ్బుకొట్టు రవికుమార్,నాలి వెంకటేశ్వర్లు, తమ్మనేని ఉమా శంకర్‌రెడ్డి, శీలం శివారెడ్డి, గంజి రవీంద్రారెడ్డి, రుద్రపాటి సాల్మన్ రాజు, సంగటి మహేందర్‌రెడ్డి, షేక్ నాగూర్ భాష,పాపబత్తిన నాగేశ్వరరావు,గోన జేమ్స్, చింతలపూడి చెంచులు, ముడియాల అనంతరెడ్డి, పాపసాని చంద్రమౌళిరెడ్డి, వంకదారి రాజా తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం దేవస్థాన ట్రస్టు బోర్డు సభ్యుడిగా దేవకి ప్రమాణ స్వీకారం





**కనిగిరి, అక్టోబర్ 13, ప్రభాతవార్త**
ప్రసిద్ధ శ్రీశైలం దేవాలయ ట్రస్టు బోర్డు నూతన సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం సోమవారం శ్రీశైలంలోని చంద్రావతి కళ్యాణ మండపంలో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పర్యవేక్షణలో సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కనిగిరి ప్రాంతానికి చెందిన ఏపీ వాసవి సత్ర సముదాయం అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు ట్రస్టు బోర్డు సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు, అభిమానులు హాజరై దేవకి వెంకటేశ్వర్లుకు శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా దేవకి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శ్రీశైలం ఆలయ సేవకు అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నాను. భక్తుల సౌకర్యం కోసం నిరంతరం కృషి చేస్తాను అని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### - ఏఐటీయూసీ నాయకులు కాశీవలి



**కనిగిరి, అక్టోబర్ 13, ప్రభాతవార్త**
మున్సిపల్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేదంటే నవంబర్ 3 నుండి రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేపట్టనున్నట్లు ఏఐటీయూసీ నాయకులు కాశీవలి హెచ్చరించారు. సోమవారం కనిగిరి పురపాలక సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్-ఏఐటీయూసీ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ధర్నా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో సమ్మె విరమణ ఒప్పందంలో భాగంగా ఇంజనీరింగ్ సిబ్బందికి 'వర్క్ ఫర్ నేచర్' ఆధారంగా వేతనాలు పెంపు హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటికీ అమలు కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విధుల్లో మరణించిన లేదా రిటైర్ అయిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఆప్కాస్‌లో నమోదు చేసి జీతాలు చెల్లించాలని, కరోనా కాలంలో తాత్కాలికంగా నియమించిన అదనపు కార్మికులను కూడా శాశ్వత ఉద్యోగులుగా చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, మున్సిపల్ కార్మికులకు కొబ్బరి నూనె,సబ్బులు, అవసరమైన పనిముట్లు అందించాలన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ పి.కృష్ణ మోహన్ రెడ్డికి ఏఐటీయూసీ ప్రతినిధులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు ఆలూరి కోటయ్య, ఖాదర్‌వలి, నాసర్ కిరణ్, రవి,మస్తాన్ వలి, ఇమామ్ హుస్సేన్, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

## అందరికి ప్రయోజనకరంగా పన్నుల విధానం జీఎస్టీ 2.0



**నాగులుప్పలపాడు, అక్టోబర్ 13, ప్రభాతవార్త**
నాగులుప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీఎస్టీ 2.0పై ప్రత్యేక సెమినార్ సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు పాల్గొని ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో అమలవుతున్న పన్నుల విధానాన్ని సరళీకృతం చేసి అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చే విధంగా అభివృద్ధి సంక్షేమాన్ని వేగవంతం చేసే విధంగా జీఎస్టీ 2.0ని అమలులోకి తీసుకొచ్చింది. అందులో దీనిని సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అని కొనియాడారు. పన్నుల చారిత్రక నేపథ్యాన్ని, పన్నుల రకాలను, వైవిధ్యాలను విశ్లేషిత, జీఎస్టీ 2.0 ద్వారా అమలులోకి వచ్చిన రెండు స్లాబ్‌ల పద్ధతి, కొన్నింటికి పన్ను మినహాయింపు, ప్రయోజనాలు గురించి, వినియోగదారులు కొనుగోలుదారులు, అమ్మకం దారులు ఎదుర్కొనే సమస్యల గురించి తెలియజేశారు. తొలుత మండల ప్రజా పరిషత్ కార్యాలయం నుండి బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తేళ్ళ రవికుమార్ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ తలపాల ఏడుకొండలు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ యు.ఉండి మూర్తి, ఎంఈఓ 1 తిరుమల శెట్టి రవి, ఎంఈఓ-2 ఏవీ రమణయ్య, ఏపీవో డి.రవిబాబు, జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వ్యాపార విజయం కోసం స్పష్టమైన లక్ష్యాలు అవసరం

### - గోపాల్ సిండికేట్ అధినేత పవన్ కుమార్



**కనిగిరి, అక్టోబర్ 13, ప్రభాతవార్త**
కనిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం సూపర్ జీఎస్టీ 2.0, సూపర్ సేవింగ్స్ అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గోపాల్ సిండికేట్, హోండా షోరూం అధినేత గోనుగుంట్ల పవన్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జే.ఉషారాణి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి పవన్‌కుమార్ మాట్లాడుతూ వ్యాపార, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి అవసరమైన నైపుణ్యాలు, జీఎస్టీ 2.0లోని పన్ను తగ్గింపు స్లాబులు, వాటి ఆర్థిక ప్రయోజనాలు గురించి విద్యార్థులకు విపులంగా వివరించారు. వ్యాపారంలో విజయాన్ని సాధించాలంటే స్పష్టమైనలక్ష్యాలు నిర్దేశించుకొని పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ జీఎస్టీ 2.0, సూపర్ సేవింగ్స్ పథకాలు విద్యా రంగానికి కూడా మేలు చేస్తున్నాయి. విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను మెరుగుపరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్‌కే.శ్రీనివాసులు,ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డి.జయకుమారి, డాక్టర్ ఎన్.సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సొసైటీల ద్వారా నాణ్యమైన పురుగు మందులు



**నాగులుప్పలపాడు, అక్టోబర్ 13, ప్రభాతవార్త**
మండలంలోని ఉప్పుగుండూరు సొసైటీ ద్వారా రైతులకు నాణ్యమైన పురుగు మందులు అందించడానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమని వ్యవసాయాధికారి పి.వెంకట్రావు తెలిపారు. సోమవారంఉప్పుగుండూరు సొసైటీలో నూతనంగా ఏర్పాటు చేసిన పురుగు మందుల కౌంటర్‌ను ఆయన ప్రారంభించారు.ఏవో మాట్లాడుతూ సొసైటీ ద్వారా ఇప్పటి వరకు రైతులకు నాణ్యమైన ఎరువులు సకాలంలో అందించి సొసైటీ అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఈ నేపథ్యంలో కల్తీ లేని నాణ్యమైన పురుగు మందులు అందించడానికి సొసైటీ పాలకవర్గం నిర్ణయం తీసుకోవడం మంచి పరిణామమన్నారు.ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కాట్రగడ్డ చంద్రబాబు, డైరక్టర్లు పెంట్యాల శ్రీనివాసరావు, పీడీసీసీ బ్యాంకు మేనేజర్ ఎస్.శ్రీకాంత్, మసిముక్కు భాస్కరరావు, సీఈఓ కోటి, జి.బసవపున్నయ్య, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు ఇంటూరి శ్రీనివాసరావు,టీడీపీ మండల అధ్యక్షులు మనోజ్ కుమార్,ఎం.సత్యనారాయణ, టి.శ్రీకాంత్, కనగాల రామకృష్ణ, చిన్న,బంగారుబాబు, త్యాగరాజు, జాన్సన్,చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యసభ ఎంపీ వైవీ సుబ్బారెడ్డిను కలిసిన కైపు అశోక్‌రెడ్డి



**తాళ్లూరు, అక్టోబర్ 13,ప్రభాతవార్త**
రాజ్యసభ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి ని మండల వైకాపా విద్యార్థి విభాగం అధ్యక్షులు కైపు అశోక్ రెడ్డి హైదరాబాద్ లోని వైవీ నివాసంలో అయనను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పలు విషయాలు చర్చించారు.

## పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి




**తాళ్లూరు,అక్టోబరు 13, ప్రభాతవార్త**
పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కారంచాలని దర్శి సీఐ వై. రామారావు ఆదేశించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ లోని రికార్డులు, పెండింగ్ కేసులను పరిశీలించటంతో పాటు కేసుల పురోగతిని విచారించారు. మహిళలు, సంబంధించిన కేసులలో సత్వరన్యాయం జరిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎస్ఐ ఎస్. మల్లికార్జునరావు కు సూచించారు. అలాగే జూదం, బెట్టింగ్ యాప్ లు, ఆన్ లైన్ లోన్ యాప్ లు, క్రికెట్ బెట్టింగ్ యాప్ లు, ఫైనాన్షియల్ వేధింపులకు సంబంధించిన కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, యాప్ లతో యువతను ఆర్థికంగా కుంగదీస్తున్న నేరస్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## పశువుల పోరంబోకు భూమి ఆక్రమణదారులకు నోటీసులు



**పొన్నలూరు,అక్టోబర్ 13,ప్రభాతవార్త**
మండలంలోని పర్చూరువారి పాలెం గ్రామసమీపంలో ఉన్న పశువుల పోరంబోకు ను ఆక్రమించి సాగు చేసుకుంటున్న భూమిని ప్రభుత్వ భూమిగా నిర్ధారించి సాగు చేసుకుంటున్న వారికి నోటీసులు జారిచేసి, హెచ్చరిక బోర్డులను రెవెన్యూ సిబ్బంది ఏర్పాటు చేశారు. మండల తహసీల్దార్ పుల్లారావు తెలిపిన వివరాల ప్రకారం సర్వే నెంబర్ 63 లో ఒక ఎకరా 50 సెంట్లు భూమిని పర్చూరు వారి పాలెం గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్రమించి జామాయిల్ మొక్కలు వేసారని సోమవారం కొందరు ఒంగోలు కలెక్టర్ గ్రీవెన్స్ లో అర్జీ ఇవ్వడంతో కలెక్టర్ తహసిల్దార్ కు విచారణ చేయమని ఆదేశాలు జారీ చేసారని తెలిపారు.వారి ఆదేశాల మేరకు ఆర్ఐ, వీఆర్వో తో కలిసి గ్రామానికి వెళ్ళి సర్వే నెంబర్ ను పరిశీలించామని తెలిపారు.ఆ సర్వే నెంబరులోని భూమి పశువుల పోరంబోకు భూమిగా రెవెన్యూ రికార్డుల్లో నమోదయి ఉన్నదని నిర్ధారించామన్నారు. ఆ భూమిని ఆక్రమించిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా సర్వేనెంబర్ 63లో మరికొందరు ఉన్నట్లు విచారణలో తెలిసిందని,వారికి కూడా నోటీసులు జారీ చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ ఐ శివ, వీఆర్వో హరి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్కాలర్ షిప్స్ అందజేత



**సింగరాయకొండ, అక్టోబర్ 13,ప్రభాతవార్త**
ఇంటెలెక్ట్ డిజైన్ ఏరినా సంస్థకు చెందిన ఉల్లాస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వం పాఠశాలల విద్యార్థులకు స్కాలర్షిప్‌ల పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. సింగరాయకొండ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, శానంపూడి ఉన్నత పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి 1,000 రూపాయలు చొప్పున అందజేశారు.ఈ ట్రస్ట్ ప్రతినిధి దింటకుర్తి బాలకృష్ణ విద్యార్థులకు ప్రేరణాత్మక ప్రజెంటేషన్ ఇచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన హైకోర్టు న్యాయవాది పంతగాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డ్రెస్ వెల్ - స్పీక్ వెల్ - బిహేవ్ వెల్" అనే సూత్రాన్ని విద్యార్థులు పాటించాలని సూచించారు.ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మహాలక్ష్మి, ఉపాధ్యాయులు సుధాకర్,న్యాయవాది పంతగాని వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు,పాల్గొన్నారు.

## కల్తీ మద్యంపై తనిఖీలు చేపట్టిన ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు



**దర్శి, అక్టోబర్ 13, ప్రభాతవార్త**
దర్శి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని అన్ని మద్యం షాపులలో, అనుమానిత ప్రదేశాలను దర్శి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తనిఖీలు నిర్వహించారు. ప్రతి రోజు కల్తీ మద్యం, నకిలీ మద్యం గురించి విస్తృత తనిఖీలు చేయడం జరిగిందన్నారు. ఎలాంటి కల్తీ మద్యం గాని, నకిలీ మద్యం గాని కొనుగొనబడలేదు, అమ్మబడుటలేదని తెలియజేశారు. సోమవారం దర్శి, దొనకొండ మండలంలోని మద్యం దుకాణాలను, అనుమానిత ప్రదేశాలలో కల్తీ మద్యం, నకిలీ మద్యం గురించి విస్తృతంగా తనిఖీలు చేశారు. అదే విధంగా బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగుతున్న వ్యక్తులపై దాడులు చేసి 29 కేసులు నమోదు చేయడం జరిగింది. 117 మంది ముద్దాయిలను బైండోవర్ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై సత్యనారాయణరావు, ఎస్‌కే యూసఫ్ షరీఫ్, సిబ్బంది శ్రీనివాసులు, నాగరాజు పాల్గొన్నారు.

## విధుల్లో చేరిన 26 మంది నూతన ఉపాధ్యాయులు



**కొనకనమిట్ల, అక్టోబర్ 13, ప్రభాతవార్త**
మండలంలోని పలు పాఠశాలల్లో 26 మంది కొత్తగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరినట్లు ఎంఈఓలు ఎస్‌కే దాంగే షరీఫ్, బరిగే నరసింహారావులు తెలిపారు. 2025 మెగా డీఎస్సీలో ఎంపికై గత నెల 25న సీఎం చంద్రబాబు చేతుల మీదుగా నియామక పత్రాలు పొంది ఉన్నారు. మండలంలోని చిన్నారికట్ల ఉన్నత పాఠశాలకు ఒకరు, గొట్లుగట్టు ఉన్నత పాఠశాలకు ఇద్దరు, మర్రిపాలెం ఉన్నత పాఠశాలకు ముగ్గురు, రేగడిపల్లి ఉన్నత పాఠశాలకు ముగ్గురు, కొనకనమట్ల ఉన్నత పాఠశాలకు ఇద్దరు, ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలలో 15 మంది చొప్పున మొత్తం 26 మంది కొత్త ఉపాధ్యాయులు విధుల్లో సోమవారం చేరారని తెలిపారు.

## జీవన ఎరువులపై అవగాహన



**దర్శి, అక్టోబర్ 13, ప్రభాతవార్త**
ముండ్లమూరు మండలంలోని ముండ్లమూరు రైతు సేవ కేంద్రంలో కృషి విజ్ఞాన కేంద్రం దర్శి వారి ఆధ్వర్యంలో జీవన ఎరువులపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ జి.రమేష్ మాట్లాడుతూ జీవన ఎరువుల ప్రాముఖ్యత వాడకం దాని ఉపయోగాలు గురించి వివరించారు. తరువాత కేవీకే శాస్త్రవేత్త వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పంటల్లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలు గురించి చెప్పడం జరిగింది. మండల వ్యవసాయాధికారి తిరుమలరావు మాట్లాడుతూ రైతులు వేసిన ప్రతి పంటను ఈ పంట నమోదు చేపించుకోవాలి. పంట నమోదుకు ఆఖరి తేదీ ఈనెల 25వ అని, కావున ప్రతి ఒక్క రైతు వేసిన ప్రతి పంటను పంట నమోదు చేయాల్సిందిగా కోరారు.

## నకిలీ మద్యంపై వైఎస్సార్‌సీపీ నిరసన



**దర్శి, అక్టోబర్ 13, ప్రభాతవార్త**
దర్శి ఎమ్మెల్యే, ప్రకాశం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు దర్శిలో నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీస్తున్న కూటమి ప్రభుత్వం వైఖరికి నిరసనగా సోమవారం దర్శి ఎక్సైజ్ ఆఫీసు వద్దకు ర్యాలీ నిర్వహించి సీఐకి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు వెన్నపూస వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వాచక నకిలీ మద్యం ఏరులై పారుతుందని, స్వయాన టీడీపీ తంబళ్లపల్లె ఇన్‌చార్జి నకిలీ మద్యం తయారీలో ముఖ్య పాత్ర పోషించాడు అంటే ప్రభుత్వం ఏ విధంగా ప్రోత్సహిస్తుంది అనేది అర్థం అవుతుందన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు కేవీ రెడ్డి మాట్లాడుతూ నకిలీ మద్యం వల్ల ఇప్పటికే రాష్ట్రంలో 5 మంది మృతి చెందారు అని అన్నారు. రాష్ట్ర మహిళా కార్యదర్శి మేడికొండ జయంతి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక నకిలీ మద్యం ఏరులై పారుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరు మండల పార్టీ అధ్యక్షుడు తూము వెంకట సుబ్బారెడ్డి, ముండ్లమూరు మండల పార్టీ అధ్యక్షుడు చింతా శ్రీనివాసరెడ్డి, దర్శి పట్టణ అధ్యక్షుల ముత్తినీడి సాంబ, కురిచేడు జడ్పీటీసీ నుసుం నాగిరెడ్డి, ముండ్లమూరు జడ్పీటీసీ రత్నరాజు, కోరే సుబ్బారావు, నలదిమ్ము రమణారెడ్డి, మజున్ వలి, అన్నవరపు రవి, రవీంద్రారెడ్డి, మేడగం బాలకృష్ణారెడ్డి, రాష్ట్ర విద్యార్థి విభాగం జోనల్ ఇన్‌చార్జి దుగ్గిరెడ్డి నారాయణరెడ్డి, అన్నపురెడ్డి బిక్షాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ భవనం తాళాలు పగలగొట్టిన దుండగలు



**ముండ్లమూరు, అక్టోబర్ 13, ప్రభాతవార్త**
మండలంలోని రెడ్డినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఆదివారం రాత్రి సమయంలో తాళాలు పగలగొట్టిన గుర్తు తెలియని దుండగలు. అందులో ఉన్నవిలువైన వంట సామాన్లు చోరీకి పాల్పడ్డారు. అంగన్‌వాడీ టీచర్ బిజ్జం వెంకట రమణ సోమవారం ఎప్పటిలాగా విధులకు హాజరు కాగా తాళాలు పగలగొట్టి ఉండటంతో అనుమానం వచ్చి లోపలికి వెళ్లి చూడగా పలు రకాల వంట పాత్రలు చోరీకి గురయ్యాయి. దీంతో అంగన్‌వాడీ టీచర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లారు.

## వ్యక్తిపై దాడి కేసులో నిందితులు అరెస్టు

**ముండ్లమూరు, అక్టోబర్ 13, ప్రభాతవార్త**
మండలంలోని పసుపుగల్లు ఎస్సీ కాలనీకి చెందిన వరగాని యోహాను అదే గ్రామానికి చెందిన సూరబోయిన శేషయ్య గత నెల 11వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై నాయుడుపాలెం వెళ్లి తిరిగి స్వగ్రామం వస్తుండగా ముండ్లమూరు పసుపుగల్లు మధ్య తోడేళ్ల వాగు సమీపంలో యోహాను ద్విచక్రవాహనాన్ని శేషయ్య ఢీకొట్టి కర్రతో తలపై బాదాడు వెనుక కూర్చున్న శివకృష్ణతో పాటు పరారయ్యారు. దీనంతటికి కారణమైన యోహాను భార్య దినకుమారికి శేషయ్యకి మధ్య ఉన్న అక్రమ సంబంధంతోనే యోహాను దాడి చేసినట్లు.. పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ కేసులో నిందితులైన సూరబోయిన శేషయ్య, దినకుమారి, శివకుమార్‌ను అరెస్టు చేసి దర్శి కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ ఈనెల 27వ తేదీ వరకు రిమాండ్ విధించారని ఎస్సై కే.కమలాకర్ తెలిపారు. వీరిని ఒంగోలు జిల్లా జైలుకు తరలించినట్లు ఆయన తెలిపారు.

## సంక్షేమం, అభివృద్ధి పథకాలను ప్రతి ఇంట తెలియపరచాలి

### - టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి




**హనుమంతునిపాడు, అక్టోబర్ 13, ప్రభాతవార్త**
కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ మక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు సోమవారం మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో ఆ గ్రామ పార్టీ అధ్యక్షులు గుమ్మా కొండయ్య అధ్యక్షతన నిర్వహించిన కుటుంబ సాధికారిక సభ్యుల అవగాహన సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అముల చేసిరాష్ట్రంలోని పేద కుటుంబాలఅందరికి మేలుచేసిన ఘనత ముఖ్య మంత్రి చంద్రబాబుకి ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. రాష్ట్ర ప్రజలకు జరుగుతున్న మంచిని చూసి ఓర్వ లేక వైసీపీ నాయకులు అబద్దాలు ప్రచారం చేస్తున్నారని, వైసీపీ నాయకులు చేస్తున్న అబద్దపు ప్రచారాలను క్షేత్ర స్థాయిలో కేఎస్ఎస్ సభ్యులు తిప్పికొట్టాలన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలను ఇంటింటా తెలియపరిచి ఏమైనా సమస్యలు ఉంటే తెలుసుకొని గ్రామ పార్టీ అధ్యక్షులుకైనా లేదా మండల అధ్యక్షులుకైనా ఎమ్మెల్యే దృష్టికైనా తీసుకువచ్చి సమస్యలను తెలియపరచాలని ఆయన తెలిపారు. అనంతరం స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల క్లస్టర్ కన్వీనర్ గాయం తిరుపతిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మురహరి నరసయ్య, కొండాపురెడ్డి రమణారెడ్డి, టీడీపీ నాయకులు కూరకు వెంకట్, లింగంగుంట్ల గ్రామ పార్టీ అధ్యక్షులు బుచి రామకోటిరెడ్డి, మువ్వా రాజేంద్ర, బాల గురవయ్య, బొల్లం ఏడుకొండలు, సుంకిశాల కృపయ్య, రమేష్, పొలిచర్ల పెద్ద మస్తాన్, బొల్లం బాల చెన్నయ్య, పెద్ది రమేష్, పొదిలి తిరుపతయ్య, చికటి వెంకట సుబ్బయ్య, సుమిత్ర తిరుపతిరెడ్డి, గాయం సుబ్బారెడ్డి, సఫీర్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## వీరయ్య దశదిన కర్మలో పాల్గొన్న గౌరీ అమర్నాథ్

**చీరాల , అక్టోబర్ 13, ప్రభాతవార్త**
వేటపాలెం మండలం పందిళ్ళపల్లి గ్రామానికి చెందిన స్వర్గీయ పోలకం వీరయ్య దశదిన కర్మ కార్యక్రమం సోమవారం నిర్వహించబడింది. ఈ సందర్భంగా బంధువులు, గ్రామస్తులు స్నేహితులు పెద్ద సంఖ్యలో ఝుహాజరై వీరయ్య సేవలను స్మరించుకుంటూ ఘన నివాళులర్పించారు. కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర యువ నాయకులు మద్దులూరి గౌరీ అమర్నాథ్ వారి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఘన నివాళులర్పించారు. వీరయ్య కుమారుడు పోలకం చంద్రశేఖర్ పందిళ్లపల్లి గ్రామానికి మాజీ ఉప సర్పంచ్‌గా ఉండి ఆయన తెలుగుదేశం పార్టీకి ఎనలేని సేవలు చేయడం గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు, గ్రామ పెద్దలు పోలకం కుటుంబ సభ్యులు , స్నేహితులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగ గ్రామ పెద్దలు వీరయ్య సేవలను గుర్తు చేసుకుంటూ ఆయన ఆత్మకు నివాళులర్పించారు.

## జాండ్రపేటలో పేకాట శిబిరంపై పోలీసుల దాడి

### - రూ.23,500 నగదు స్వాధీనం

**చీరాల టౌన్, అక్టోబర్ 13, ప్రభాతవార్త**
చీరాల మండలం జాండ్రపేట గ్రామంలో పేకాట శిబిరంపై సోమవారం పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. చీరాల సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో ఎస్సై రాజ్యలక్ష్మీ పోలీసులు ప్రత్యేక ప్రత్యేక సమాచారంపై ఈ దాడి చేపట్టారు. అక్రమంగా పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి రూ.23,500 నగదుతో పాటు పేకాట కార్డులను స్వాధీనం చేసుకున్నారు. సీఐ సుబ్బారావు మాట్లాడుతూ శాంతి భద్రతలకు భంగం కలిగించే అసాంఘిక చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవడం, పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామాల్లో, పట్టణాల్లో జూదం, గాంజా విక్రయం, మధ్య అక్రమరవాణా వంటి చట్టవ్యతిరేక చర్యలను ఎవరు సహించబోమని హెచ్చరించారు. ఇలాంటి క్యాక్రమాలను అడ్డుకోవడంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని, ఎవరైనా అక్రమ కార్యాకలాపాలు జరుగుతున్నట్లు తెలిపినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సీఐ విజ్ఞప్తి చేశారు. ఈ దాడిలో చీరాల టౌన్ పోలీసు స్టేషన్ సిబ్బంది, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## ఎండ్లూరులో నూతన స్మార్ట్ రైస్ రేషన్ కార్డులు పంపిణీ



**సంతనూతలపాడు, అక్టోబర్ 13, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలం ఎండ్లూరు సచివాలయం లో సోమవారం నాడు నూతన స్మార్ట్ రైస్ రేషన్ కార్డులను టీడీపీ గ్రామ అధ్యక్షులు దావులూరి అనిల్ కుమార్, టీడీపీ నాయకులు కరిచేటి సురేష్, వీఆర్వో మరియకుమార్, పంచాయతీ కార్యదర్శి ఆవులయ్య తదితరులు పంపిణీ చేశారు. ప్రభుత్వం నూతనంగా అందించిన ఈ స్మార్ట్ రైస్ కార్డులను కార్డు దారులు సద్వినియోగపరుచుకోవాలని గ్రామ టీడీపీ అధ్యక్షులు డి.అనిల్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు దాసరి బాబురావు, అట్లూరి సుబ్బారావు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

14-10Pg5 9_14-10Pg5.qxd 10/13/2025 10:23 PM Page 1



# భారత్‌లో తిష్టకు ఆఫ్రికన్ల కొత్త ఎత్తుగడలు

- నేరాలకు పాల్పడి, కాంట్రాక్టు పెళ్లిళ్లు చేసుకుని జైళ్లకు వెళుతున్న వైనం
- కేసులను కొలిక్కితెచ్చి బలవంతంగా వెనక్కి పంపేందుకు పోలీసుల ప్రయత్నాలు

**హైదరాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** భారత్‌లో తిష్టవేసేందుకు ఆఫ్రికాదేశాలకు చెందినకొందరునేరగాళ్లు కొత్తఎత్తుగడలు వేస్తున్న తీరు పోలీసులను సైతం షాక్‌కు గురిచేస్తోంది. ఇక్కడ అక్రమంగా ఏళ్లతరబడి వుంటున్న అనేక మంది ఆఫ్రికన్ నేరగాళ్లు ఇందుకోసం చిన్నా చితక నేరాలతో పాటు, ఇతరులతో అనవసరంగా గొడవలు పడి పోలీసు కేసుల్లో అరెస్టయి జైళ్లకు వెళుతుండడంతో పాటు కాంట్రాక్ట్ వివాహాలు చేసుకుని అమ్మాయిలను మోసం చేస్తున్నారు. ఈ కారణాలవల్ల వీసా గడువుముగిసినా కోర్టులో కేసులుండడంవల్ల వీరిని పోలీసులు వెనక్కు పంపలేక పోతున్నారు. ఆఫ్రికా దేశాలలో బతుకు పోరాటం నరకంగా వుండడం వివిధ కారణాల చేత భారత్‌కు వస్తున్న ఆఫ్రికన్లలో అనేక మంది తిరిగి వెళ్లేందుకు మనస్సు అంగీకరించక ఇక్కడే తిష్ట వేస్తున్నట్లు పోలీసులుచెబుతున్నారు.


ఆఫ్రికా దేశాలకు చెందిన వందలాది మంది భారత్‌లో అక్రమంగా వుండడం, వీరిలో 90 శాతంమంది నేరచరిత్ర కలిగి వుండడం పోలీసులకు తలనొప్పి వ్యవహారంగా మారింది. ఒకప్పుడు నైజీరియాకు చెందిన కొందరు నేరగాళ్లు మాత్రమే భారత్‌లో అక్రమంగా వుండగా



ఇప్పుడు ఈ జాబితాలో ఉగాండ, జాంబియా, కెన్యా సహా మరికొన్ని దేశాలకు చెందిన వారు కూడా చేరారు. ఆఫ్రికా దేశాలలో అంతర్గత సంక్షోభ సమస్య అధికంగా వుండగా, తీవ్రమైన కరువు కాటకాలు మరింత కుంగదీస్తోంది. దీంతో పాటు ఉగ్రవాద సమస్య అక్కడి ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. దీనికి తోడు జాతుల సమస్యలతో సాగుతున్న మారణకాండ అక్కడి ప్రజల బతుకులను మరింత దుర్భరంగా మారుస్తోంది. ఈ క్రమంలో భారత్ సహా అనేక దేశాలకు వలస వెళుతున్న ఆఫ్రికన్లు ఆతరువాత అక్కడే వుండేందుకు మక్కువ చూపుతున్నారు. ఇందులో భారత్ వుండేందుకు మరింత ఎక్కువ మంది ఇష్టపడుతున్నారని పోలీసుల గణాంకాలు చెబుతున్నాయి. ఇదంతా ఇలావుంటే ఆఫ్రికన్ల వల్ల భారత్‌లోని అనేక నగరాలలో డ్రగ్స్ కల్చర్ బాగా పెరిగిందని నిఘా వర్గాల పరిశీలనలో తేలింది. ఆఫ్రికా దేశాల నుంచి తక్కువ ధరకు నాణ్యమైన కొకైన్ సహా హెరాయిన్, ఎల్ఎస్‌టి వంటి డ్రగ్స్‌ను భారత్‌కు తెస్తూ ఇక్కడ అధిక ధరలకు అమ్ముతూ అనేక మంది ఆఫ్రికన్లు జల్సా జీవితం గడుపుతు న్నారు. వీరంతా దక్షిణాదినగరాలైన హైదరా బాద్, బెంగళూరు, చెన్నైతో పాటు పశ్చిమాది నగరాలు ముంబాయి. గోవాలలో ఎక్కువగా తిష్ట వేస్తున్నారు. ఇటీవల హైదరాబాద్, బెంగళూరు, గోవా పోలీసులకు పట్టుబడ్డ డ్రగ్స్ స్మగ్లర్ల వద్ద కోట్లాది రూపాయల ఆస్తులు వున్నట్లు తేలింది. ఇదంతా డ్రగ్స్ స్మగ్లింగ్ వల్లే వీరు సంపాదించి నట్లు వెల్లడయ్యింది. డ్రగ్స్ కేసుల్లో అరెస్టయిన వారిలో 90శాతం నేరగాళ్లు వీసా గడువు ముగి సినా ఇక్కడే వుండడంతో పాటు మరికొందరు తప్పుడు పత్రాలతో వుంటున్నట్లు తేలింది.

**కేసులను కొలిక్కితెచ్చి బలవంతంగా వెనక్కు పంపేందుకు పోలీసుల ప్రయత్నాలు**

ఇదిలావుండగా నిందితులుగావుంటూ ఏళ్లతరబడి భారత్‌లో అక్రమంగా వుంటున్న ఆఫ్రికన్లను బలవంతంగా వారిదేశాలకు పంపేందుకు కేంద్రం నిర్ణయించినట్లు సమాచారం. వీరిపై వున్న కేసులను వీలైనంత త్వరగా కొలిక్కి తెచ్చేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని అన్ని రాష్ట్రాలకు కేంద్రం సూచించినట్లుగా తెలిసింది. చిన్నాచితక కేసులను కోర్టులో వీలైనంత త్వరగా పరిష్కరించి ఇందులో నేరగాళ్లుగా వున్న ఆఫ్రికన్లను వారి దేశాలకు బలవంతంగా పంపేందుకు కేంద్రం చేబట్టిన చర్యలు కొంతమేర ఫలితాలు ఇస్తున్నాయి. హైదరాబాద్ సహా పలునగరాలలో అక్రమంగా వుంటున్న వంద మంది వరకు ఆఫ్రికన్ల కేసులను మూడు నెలల క్రితం ఆయా రాష్ట్రాల పోలీసులు ఓ కొలిక్కితెచ్చి వారిని వారి దేశాలకు పంపడం కొసమెరుపు.




# గూగుల్‌కు పోటీగా మ్యాపుల్స్

## యాప్ అద్భుతంగా ఉందన్న కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్

**న్యూఢిల్లీ, అక్టోబరు 13:** ప్రపంచవ్యాప్తంగా నావిగేషన్ కోసం విరివిగా ఉపయోగించే గూగుల్ మ్యాప్స్‌కు గట్టి పోటీనిచ్చేలా ఓ స్వదేశీ యాప్‌కు కేంద్ర ప్రభుత్వం మద్దతుగా నిలిచింది. గూగుల్ కన్నా మెరుగైన ఫీచర్లతో భారతదేశంలో తయారైన మ్యాపుల్స్ నావిగేషన్ యాప్ అద్భుతంగా పనిచేస్తోందని కేంద్ర ఐటి శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కొనియాడారు. ఈ యాప్‌ను ప్రతి ఒక్కరూ తప్పకుండా వాడాలని ఆయన దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ చేశారు. తాను స్వయంగా మ్యాపుల్స్ యాప్‌ను ఉపయోగిస్తున్న వీడియోను పంచుకున్నారు. ఈ యాప్‌లో ఫ్లైఓవర్లు, ఓవర్‌బ్రిడ్జిలను సులభంగా గుర్తించవచ్చని, అపార్ట్‌మెంట్‌లలో ఉండే దుకాణాల వివరాలు కూడా స్పష్టంగా కనిపిస్తాయని ఆయన వివరించారు. ఇందులో 13 రకాల ప్రత్యేక ఫీచర్లు ఉన్నాయని, ఇవి ప్రయాణాన్ని మరింత సులభతరం చేస్తాయని తెలిపారు. మంత్రి చేసిన ఈ ట్వీట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గామారింది. స్వదేశీ యాప్‌కు కేంద్రమంత్రి ప్రచారం కల్పించడంపై నెటిజన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మ్యాపుల్స్ యాప్‌ను మ్యాప్‌మైఇండియా సంస్థ అభివృద్ధి చేసింది. ఈ యాప్‌లో 3డి జంక్షన్ వ్యూ, లైవ్ ట్రాఫిక్ సిగ్నల్ టైమర్లు, భద్రతా హెచ్చరికలు, ప్రాంతీయ భాషల సపోర్ట్‌వంటి అనేక ఆధునిక సదుపాయాలు ఉన్నాయి. ముఖ్యంగా భారతీయ రోడ్లు, జంక్షన్ల పరిస్థితులకు అనుగుణంగా దీన్ని తీర్చిదిద్దినట్లు సంస్థతెలిపింది. మంత్రి ట్వీట్‌కు స్పందించిన మ్యాప్ మై ఇండయా సంస్థ ఆయనకు కృతజ్ఞత తెలిపింది. భారత్‌లో డ్రైవింగ్‌ను మరింత సురక్షితంగా, సులభంగా మార్చడమే తమ లక్ష్యమనిపేర్కొంది. దేశ ప్రజలందరూ స్వదేశీ సాంకేతిక విప్లవంలో భాగస్వాములు కావాలని కోరింది. ఇప్పటి వరకు ఈ యాప్‌ను 3.5 కోట్ల మందికి పైగా డౌన్‌లోడ్ చేసుకున్నట్లు సంస్థ వెల్లడించింది.

# శ్రేసన్ ఫార్మాకు లైసెన్స్ రద్దు

## కోల్డ్‌రిఫ్ దగ్గుమందుతో పలు మరణాలు

### కంపెనీ మూసివేతకు తమిళనాడు సర్కారు ఆదేశాలు

**చెన్నై, అక్టోబరు 13:** 'కోల్డ్‌రిఫ్' దగ్గు మందు వల్ల మధ్యప్రదేశ్‌లో 20 మందికిపైగా చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. కోల్డ్ రిఫ్ దగ్గు మందు తయారీ సంస్థ శ్రేసన్ ఫార్మా అనుమతులు రద్దు చేసినట్లు సోమవారం తమిళనాడు ప్రభుత్వం వెల్లడించింది. అలాగే కంపెనీ మూసివేతకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపింది. రాష్ట్రంలోని ఇతర ఔషధ తయారీ సంస్థల్లో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించినట్లు పేర్కొంది. ఈ దగ్గు మందును తమిళనాడులోని కాంచీపురానికి చెందిన శ్రేసన్ ఫార్మా యూనిట్ తయారుచేసింది. మరణాల నేపథ్యంలో ఈ కంపెనీలో తనిఖీ చేయగా.. సిరప్‌లో 48.6 శాతం అత్యంత విషపూరితమైన డైఇథైలిన్ గ్లైకాల్ ఉందని తేలినట్లు అధికారులు వెల్లడించిన సంగతి తెలిసిందే. సరైన తయారీ పద్ధతులు అవలంబించడంలేదని, 300కు పైగా ఉల్లంఘనలను రికార్డు చేసినట్లు చెప్పారు. ప్రత్యేక దర్యాప్తు బృందం ఇప్పటికే కంపెనీ యజమాని జి.రంగనాథన్‌ను అరెస్టు చేసింది. అలాగే సోమవారం ఉదయం ఫార్మా సంస్థకు చెందిన పలు ప్రాంగణాల్లో ఇడి తనిఖీలు నిర్వహించింది. దగ్గు మందు మరణాలకు తమిళనాడు అధికారుల నిర్లక్ష్యమే కారణమని దర్యాప్తులో భాగంగా కేంద్ర ఔషధ నియంత్రణ సంస్థ (సిడిఎస్‌సిఒ) గుర్తించినట్లు జాతీయమీడియా కథనాలు పేర్కొన్న సంగతితెలిసిందే. రాష్ట్ర ఔషధ నియంత్రణ సంస్థ నిబంధనలను విస్మరించిందని, కేంద్రం చేసిన సిఫార్సులకు అనుగుణంగా చర్యలు తీసుకోవడంలో విఫలమైందని పేర్కొన్నాయి. దగ్గుమందు తయారీ విషయంలో సరైన పర్యవేక్షణ లేదని, సకాలంలో చర్యలు తీసుకోకపోవడంతో విషపూరితమైన సిరప్ మార్కెట్‌లోకి ప్రవేశించిందని, ఆ నిర్లక్ష్యం పిల్లల మరణాలకు దారితీసిందని తెలిపాయి.

# ఆట గెలిపించి.. అసువులు బాసి!

## క్రికెట్ మైదానంలో ఆడుతూనే ప్రాణాలు వదిలిన బౌలర్

**లక్నో, అక్టోబరు 13:** ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్ జిల్లాలో ఓ క్రికెట్ ఆటగాడు మైదానంలోనే మృతి చెందాడు. స్థానికంగా జరిగిన ఓ టోర్నమెంట్‌లో అద్భుతంగా బౌలింగ్‌చేసి తన జట్టును గెలిపించాడు కానీ.. జీవిత పోరాటంలో మాత్రం ఓడిపోయాడు. చివరి బంతి వేసిన తర్వాత ఆ బౌలర్ అకస్మాత్తుగా మరణించాడు. ఈ ఘటనతో అందరూ షాక్‌అయ్యారు. ఇందుకు సంబంధించిన విడియోఒకటి వైరల్‌అయింది. మొరాదాబాద్‌లోని బిలారి బ్లాక్‌లో ఉత్తరప్రదేశ్ వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ ఓ టోర్నమెంట్‌ను నిర్వహించింది. బిలారిలోని చక్కెర మిల్లు మైదానంలో ఆదివారం మొరాదాబాద్, సంభాల్ జట్లు తలపడ్డాయి. మొరాబాద్ మొదటబ్యాటింగ్ చేసింది. ఛేదనలో సంభాల్ విజయానికి చివరి నాలుగు బంతుల్లో 14 పరుగులు అవసరం అయ్యాయి. మొరాదాబాద్ ఫాస్ట్ బౌలర్ అహ్మద్ ఖాన్ అద్భుతంగా బౌలింగ్ చేయడంతో.. సంభాల్ జట్టు 11 పరుగుల తేడాతో ఓడిపోయింది. చివరి బంతి పడగానే మొరాదాబాద్ ప్లేయర్లు సంబరాల్లో మునిగిపోయారు అహ్మద్ మాత్రం తీవ్ర అస్వస్థతతో మైదానంలో కుప్పకూలాడు.

అహ్మద్‌ఖాన్ శ్వాసతీసుకోవడంలో తీవ్ర ఇబ్బంది పడ్డాడు. భయాందోళనకు గురైన మొరాదాబాద్ ఆటగాళ్లు వెంటనే చికిత్స అందించారు. అక్కడే ఉన్న వైద్యుడు మైదానంలో అతడికి సిపిఆర్ చేశాడు. దాంతో అహ్మద్ కాస్త కుదుటపడ్డాడు. ఆ తర్వాత అతన్ని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

ఆస్పత్రిలో వైద్యుడు పరిశీలిం చగా.. అహ్మద్ అప్పటికే మృతి చెందాడు. ఈ ఘటనలో మ్యాచ్ గెలిచిన ఆనందం శోకసం ద్రంగా మారింది. అహ్మద్ స్థానిక మొరాదాబాద్ జట్టుకు సీనియర్ బౌలర్ అని, చాలా యేళ్లుగా క్రికెట్‌లో చురుగ్గా పాల్గొంటున్నాడని టోర్నమెంట్ నిర్వాహకులు తెలిపారు.

# ట్రేడ్ డీల్‌పై మలివిడత చర్చలు

## నేడో రేపో అమెరికాకు భారత్ బృందం

**న్యూఢిల్లీ, అక్టోబరు 13:** అమెరికాతో వాణిజ్య ఒప్పందానికి సంబంధించి మలివిడత చర్చల కోసం భారత్ బృందం త్వరలో వాషింగ్టన్ వెళ్లనుంది. అధికార వర్గాల కథనం ప్రకారం పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడం, ఒప్పందం తొలి దశను ఖరారు చేయడం లక్ష్యంగా మలి విడత చర్చల కోసం భారత ఉన్నతస్థాయి వాణిజ్య ప్రతినిధి బృందం అమెరికా వెళ్లనుంది. అమెరికాతో చర్చలు సానుకూల మార్గంలో సాగుతున్నాయి. ద్వైపాక్షిక ఒప్పందం మొదటి దశ ఈ నెలాఖరు లోపు ముగుస్తుందని రెండు పక్షాలు ఆశాభావం వ్యక్తంచేస్తున్నాయి. ట్రంప్ సుంకాల విధింపుతో వాణిజ్య ఒప్పందానికి బ్రేకులుపడ్డాయి. అయితే, పరస్పర సుంకాల వల్ల ఇరుదేశాలకు నష్టం వాటిల్లుతున్నందున సాధ్యమైనంత త్వరగా ట్రేడ్ డీల్‌కు రావాలని నిర్ణయించాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఉభయదేశాలు ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు ప్రారంభించాయి. దీనికి సంబంధించి తొలి దశ చర్చలను అక్టోబర్, నవంబర్‌లో పూర్తి చేయాలని షెడ్యూల్ కూడా చేశారు. ఇప్పటి వరకు ఐదు దశల్లో వాణిజ్య చర్చలు సాగాయి. ఇటీవల కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయెల్ వాణిజ్య చర్చల కోసం అధికార ప్రతినిధి బృందంతోకలిసి న్యూయార్క్‌కు వెళ్లిన విషయం తెలిసిందే. ఈసందర్భంగా ఇరుదేశాలమధ్య వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన వివిధ అంశాలపై నిర్మాణాత్మక చర్చలు జరిపారు. గోయెల్ అమెరికా పర్యటన అంతా సానుకూలంగాసాగింది. ఈ పర్యటనలో పీయూష్ గోయెల్ అమెరికా వాణిజ్య ప్రతినిధి జెమిసన్ గ్రీర్, భారత్‌లో అమెరికా రాయబారిగా నియమితులైన సెర్జియో గోర్‌తోనూ సమావేశమై సమాలోచనలు జరిపిన విషయం తెలిసిందే.

## బీహార్ ఎన్నికలు సమీపిస్తున్నవేళ..

# లాలూ కుటుంబంపై ఢిల్లీ కోర్టు అభియోగాలు



**పాట్నా, అక్టోబర్ 13:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల తేదీ సమీపిస్తోన్న తరుణంలో మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబానికి షాక్ తగిలింది. అవినీతి కేసులో లాలూతో పాటు ఆయన సతీమణి రబ్రీదేవి, కుమారుతు తేజస్వీ యాదవ్‌పై సోమవారం ఢిల్లీ కోర్టు అభియోగాలు మోపింది. ఈ కేసులో వారు విచారణను ఎదుర్కోనున్నారు. లాలూ ప్రసాద్ రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో ఐఆర్‌సిటిసి హోటళ్ల నిర్వహణ కాంట్రాక్టులు కేటాయించడంలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. మోసం, కుట్ర, అవినీతి నిరోధక చట్టం కింద రౌజ్ అవెన్యూ కోర్టు లాలూ కుటుంబంపై అభియోగాలు నమోదుచేసింది. రైల్వే మంత్రిగా తన పదవిని దుర్వినియోగం చేశారని ఈ సందర్భంగా న్యాయస్థానం వ్యాఖ్యానించింది. తాము ఏ తప్పూ చేయలేదని లాలూ, తేజస్వి కోర్టుకు వెల్లడించగా అసలు ఇది తప్పుడు కేసు అని రబ్రీదేవి పేర్కొన్నారు. 2004-2009లో లాలూ రైల్వే మంత్రిగా పనిచేశారు. ఆ సమయంలో ఐఆర్‌సిటిసి హోటళ్ల నిర్వహణ కాంట్రాక్టుల కేటాయింపులో అవినీతి జరిగిందనేది ఆరోపణ. ఆ కాంట్రాక్టులను సుజాత హోటల్‌కు అప్పగించారు. ఆ ఒప్పందానికి బదులుగా లాలూయాదవ్ ఒక బినామీ కంపెనీ ద్వారా ఖరీదైన ప్రాంతంలో మూడు ఎకరాల భూమిని పొందారని సిబిఐ పేర్కొంది. ఈ వ్యవహారంలో 2017లో ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.

నిందితులపై అభియోగాలు మోపేందుకు తగిన సమాచారం ఉందని కోర్టులకు వెల్లడించింది. ఆ వాదనను లాలూ న్యాయవాది తోసిపుచ్చారు. ఇదిలా ఉంటే వచ్చే నెల బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్డీయే, లాలూ పార్టీ ఆర్జేడి నేతృత్వంలోని మహాగఠ్‌బంధన్‌అధికారం కోసం హోరాహోరీగా ప్రచారం చేస్తున్నాయి. ప్రత్యర్థులు తమ ప్రచారంలో ఈ కేసును ఎత్తి చూపే అవకాశం ఏర్పడింది. బీహార్‌లో అసెంబ్లీ స్థానాలకు నవంబరు 6,11 తేదీల్లో ఎన్నికలు జరగనున్నాయి.

# ప్రపంచంలోనే అతిపెద్ద బంగారు గని ఎక్కడో తెలుసా?


**వాషింగ్టన్, అక్టోబరు 13:** బంగారం.. ఈపేరు వింటేనే చాలా మందిలో వైబ్రేషన్లు వస్తాయి. కారణమేమంటే దానిపై వారికి ఉంటే మక్కువ. ముఖ్యంగా మహిళలు బంగారం పేరు వినగానే అటెన్షన్ అవుతుంటారు. పసిడి కొనేందుకు ఎంతో ఆసక్తి చూపిస్తుంటారు. ఇదిలా ఉంటే.. ప్రస్తుతం బంగారం ధర సామాన్యులకు అందనంత దూరంలో ఉంది. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1.25 లక్షలు దాటింది. కేవలం ఈ ఒక్క సంవత్సరంలోనే దాదాపు 50 శాతం ధర పెరిగింది. ఇదే సమయంలో కొందరికి విచిత్రమైన ప్రశ్నలు వస్తున్నాయి. అలాంటి వాటిల్లో ప్రపంచంలో అత్యధిక బంగారం ఎక్కడ ఉంది? ఏ దేశంలో ఎక్కువ ఉత్పత్తి అవుతుంది? అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఆ దేశం ఏమిటి? అక్కడ యేడానికి ఎంత బంగారాన్ని వెలికితీస్తారో తెలిస్తే నిజంగా ఆశ్చర్యపోతారు. మరి ఆ వివరాలిలా ఉన్నాయి.

ప్రపంచంలో అతిపెద్ద బంగారు గని పేరు నెవాడా గోల్డ్‌మైన్. ఇది అమెరికాలోని నెవాడా రాష్ట్రంలో ఉంది. ఈ గనిలో యేటా టన్నుల కొద్దీ గోల్డ్‌ను వెలికితీస్తుంటారు. భూమిపైనే అతిపెద్ద బంగారు గనిగా ఈ ప్రాంతం ప్రసిద్ధి చెందింది. ఈ బంగారు గనిని బారిక్ గోల్డ్, న్యూమెంట్ కార్పొరేషన్ అనే సంస్థలు కలిపి నడుపుతున్నాయి. ఈ గనిలో యేటా సుమారు వంద టన్నులు అంటే లక్షకిలోల గోల్డ్‌ను బయటకు తీస్తున్నారు. ప్రస్తుతం భూమిపై వినియోగంలో ఉన్న అతిపెద్ద బంగారు గని ఇదేనని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. అగ్రరాజ్యమైన అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఈ బంగారు గని ఒక అక్షయపాత్రలా ఉపయోగపడుతుంది. ప్రస్తుతానికి ప్రపంచంలో ఎక్కువ బంగారం నిల్వలు ఉన్న దేశం కూడా యుఎస్ కావడం గమనార్హం. అంతలా అమెరికా బంగారాన్ని రిజర్వ్ చేయడానికి ఈ గని కూడా ఒక కారణమని అక్కడి మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఇకపోతే మన దేశంలో కూడా బంగారు గనులు ఉన్నాయి. అయితే వాటి నుంచి లభించే బంగారం చాలా తక్కువ. ఇక్కడ బంగారు ఉత్పత్తికి అయ్యే ఖర్చు చాలా ఎక్కువగా ఉంటుంది. కాబట్టి బంగారం ఇతర దేశాల నుంచే ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్నాం.



# సరిహద్దుల్లో భద్రత మరింత పెంపు

## కీలక మార్గాల మూసివేత



**న్యూఢిల్లీ, అక్టోబరు 13:** ఉగ్ర చొరబాట్ల కట్టడికి భారత సైన్యం కీలక చర్యలు తీసుకొనేందుకు సిద్ధమైంది. శీతాకాలం రాబోతున్న నేపథ్యంలో పాకిస్తాన్ సరిహద్దుల్లోని నియంత్రణ రేఖ వెంబడి భద్రతను మరింత పెంచుతోంది. ఇందులో భాగంగా కీలక మార్గాలు మూసివేసింది. అదనపు బలగాలను మొహరించినట్లు తెలుస్తోంది. పహల్గాం దాడిని దృష్టిలో పెట్టుకుని సరిహద్దుల్లోని భద్రతను పునరుద్ధరిస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ మీడియా కథనం వెల్లడించింది. సాధారణంగా కశ్మీర్ లోయలో శీతాకాల సమయంలో మంచు దట్టంగా కురుస్తుంది. ఆ సమయంలో కీలక మార్గాల్లో భద్రత పర్యవేక్షణ కష్టంగా మారుతుంది. ఎత్తైన ప్రాంతాల్లో నిఘాకు సవాళ్లు ఎదురవుతాయి. దీన్ని అవకాశంగా తీసుకుని చలికాలానికి ముందు ఉగ్ర చొరబాట్ల ఘటనలు పెరుగుతాయి. వీటిని నియంత్రించేందుకే సరిహద్దుల్లో ఆర్మీ భద్రతను కట్టుదిట్టం చేస్తోంది. నియంత్రణ రేఖ వెంబడి కంచెను కట్టుదిట్టం చేయడంతో పాటు ఈ ప్రాంతంలో అదనపు దళాలను మోహరిస్తోంది. ఇక సరిహద్దులను ఆనుకుని ఉండే కొన్ని కీలక మార్గాలను మూసివేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక, థర్మల్ ఇమేజర్లు, అధునాతన కెమెరాలు, చిన్న చిన్న డ్రోన్లతో చొరబాటు యత్నాలను తిప్పికొడుతున్నట్లు ఆర్మీ విశ్వసీన వర్గాలు వెల్లడించాయి. గతంలో ఉగ్రవాదులు దేశంలోకి చొరబడి రద్దీ ప్రాంతాలకు దూరంగా ఒక రహస్యప్రాంతంలో దాక్కొన్న సందర్భాలున్నాయి. కానీ, ఇటీవల ఉగ్రవాదులు తమ పంథా మారుస్తున్నారు. రద్దీ ప్రదేశాలకు దగ్గరగా రెండు,మూడు రహస్య ప్రాంతాల్లో నక్కి తమ కార్యకలాపాలను సాగిస్తున్నారు. ఇక, భద్రతా సిబ్బంది నిఘా నుంచి తప్పించుకునేందుకు సామాన్య పౌరులవలే స్థానిక మొబైల్ నెట్‌వర్క్‌నువాడి కమ్యూనికేషన్ చేసుకుంటున్నట్లు ఆర్మీ వర్గాలు వెల్లడించాయి. దీంతో దేశంలోకి చొరబడిన తర్వాత వారిని పట్టుకోవడం సమస్యగా మారుతోంది. అందుకే వీరు దేశంలోకి రాకుండా చొరబాట్లను అడ్డుకుని సరిహద్దుల వద్దే పట్టుకోవాలని ఆర్మీ భావిస్తోంది.

## రాజకీయ అంశాలు

# కోర్టులకెందుకు?

## రాహుల్ వ్యాఖ్యలపై దాఖలైన పిల్‌ను తిరస్కరించిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 13:** 'ఓట్ చోర్ గద్దీ ఛోడ్'అనే నినాదంతో 'ఓటర్ అధికార్ యాత్ర'లో ఇటీవల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, బిజెపి, ఎన్నికల సంఘంపైన 'ఓటు చోరీ' వ్యాఖ్యలు చేశారు. రాహుల్ చేసిన వ్యాఖ్యలపై సిట్ విచారణ కోరుతూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాలా బాగ్చిలతో కూడిన ధర్మాసనం పిల్‌ను విచారించేందుకు నిరాకరించింది. ఈ అంశంపై ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించింది. తాను ఫిర్యాదు చేసినప్పటికీ ఎన్నికల సంఘం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పిటిషనర్ అత్యున్నత న్యాయస్థానానికి తెలియజేశారు. దీనిపై కోర్టు స్పందిస్తూ రాజకీయ అంశాలకు కోర్టులోను వేదిక చేసుకోవద్దు. ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కోవాలని తేల్చి చెప్పింది. బిజెపి, ఎన్నికల సంఘం కలిసి దేశంలో ఓట్ల చోరీకి పాల్పడుతున్నాయని కాంగ్రెస్ ఎంపి రాహుల్‌గాంధీ ఆరోపిస్తున్నారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం దొంగిలించిన ఓట్లతో ఏర్పడిందంటూ రాహుల్ విమర్శించారు. ప్రధాన మంత్రి కూడా ఓట్ల తస్కరణకు పాల్పడ్డారని ఆరోపించారు. కొందరు పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం కలిగించేందుకు ప్రజల ఓటు హక్కును దొంగిలించేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని ఘాటు విమర్శలు చేశారు. త్వరలో బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదేవిధంగా ఓట్లు దొంగలించడానికి కుట్ర పన్నుతున్నారన్నారు. మహారాష్ట్ర సహా ఇతర రాష్ట్రాలలో ఓట్లు చోరీ చేయడంలో ఎన్డీయే ప్రభుత్వం విజయవంతమైందని, బీహార్‌లో మాత్రం బిజెపి, ఇసిని ఒక్క ఓటు కూడా చోరీ చేయనివ్వబోమని వ్యాఖ్యానించారు. కాగా రాహుల్ చేసిన ఆరోపణలు బిజెపి నేతలు, ఎన్నికల కమిషన్ అధికారులు ఖండించారు.

# సంక్షిప్తంగా..

## కరూర్ తొక్కిసలాటపై సిబిఐ దర్యాప్తు: సుప్రీం

**న్యూఢిల్లీ, అక్టోబరు 13:** కరూర్ తొక్కిసలాట ఘటనపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఘటనపై సిబిఐ విచారణకు ఆదేశించింది. సిబిఐ దర్యాప్తు పర్యవేక్షణకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అజయ్ రస్తోగి ఆధ్వర్యంలో ముగ్గురు సభ్యుల కమిటీ ఏర్పాటు చేసింది. గత నెల 27న టివికె పార్టీ అధ్యక్షుడు విజయ్ కరూర్‌లో నిర్వహించిన ప్రచార ర్యాలీలో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 60 మంది గాయపడ్డారు. ఈ ఘటనపై సిట్ దర్యాప్తునకు మద్రాసు హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టివికె పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సిట్ దర్యాప్తును దేశ అత్యున్నత న్యాయస్థానంలో సవాల్ చేసింది. తమ పార్టీ పట్ల సిట్ పక్షపాతంతో వ్యవహరిస్తోందని ఆరోపించింది. ఈ మేరకు తొక్కిసలాట ఘటనపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం.. 41 మంది మృతి చెందిన తొక్కిసలాట ఘటన దేశాన్ని కదిలించిందని పేర్కొంది. ఈ మేరకు సిబిఐ దర్యాప్తునకు ఆదేశించింది. నిస్సందేహంగా.. న్యాయసమ్మతమైన, పక్షపాతరహిత విచారణ అనేది పౌరుల హక్కు అని వ్యాఖ్యానించింది.

## పదవి నుంచి తప్పకుంటా: కేంద్రమంత్రి సురేష్ గోపి



**తిరువనంతపురం, అక్టోబరు 13:** మళ్లీ యాక్టింగ్ వైపు మళ్లే యోచనలో ఉన్నట్లు కేంద్రమంత్రి, బిజెపి ఎంపి సురేశ్ గోపి తెలిపారు. కేరళలోని కన్నూర్‌లో రాజ్యసభ ఎంపి సదానందన్ మాస్టర్ అధికారిక కార్యాలయం ప్రారంభోత్సవంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తన ఆదాయం బాగా తగ్గిపోయిందని అన్నారు. దాదాపుగా నిలిచిపోయిందని అన్నారు. ఆదాయంకోసం మళ్లీ నటనపై దృష్టి పెట్టాలని అనుకుంటున్నట్లు తెలిపారు. తన స్థానంలో రాజ్యసభ ఎంపి సదానందన్‌ను నియమించాలని కూడా ప్రతిపాదించానని ఆయన అన్నారు. పార్టీలోతానే అత్యంత పిన్నవయస్కుడినని తెలిపారు. 2008లో పార్టీ సభ్యత్వం తీసుకున్నట్లు చెప్పారు. ప్రజలు ఎన్నుకున్నతనను కేంద్రమంత్రిని చేయాలని పార్టీ భావించినట్లు తెలిపారు. మలయాళం సినీ పరిశ్రమలో ప్రముఖ నటుడైన సురేశ్ గోపి త్రిసూర్ నియోజకవర్గం నుంచి బిజెపితరఫున పోటీచేసి ఎంపిగాఎన్నికయ్యారు. రాష్ట్రంలో తొలి బిజెపిఎంపిగా రికార్డు సృష్టించారు.

## పుణేలో చిరుత దాడి: చిన్నారి మృతి

**ముంబయి, అక్టోబరు13:** పొలంలో పనిచేస్తున్న అయిదేళ్ల చిన్నారిపై చిరుత పులి దాడి చేసిన ఘటన మహారాష్ట్రలోని పుణెలో చోటుచేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం పింపార్ఖేడ్ గ్రామంలో తమ ఇంటి సమీపంలోని పొలంలో పనిచేస్తున్న తాతకు మంచినీళ్లు ఇవ్వడానికి శివన్యశైలేష్ బొంబే అనే అయిదేళ్ల చిన్నారి వెళ్లింది. ఆ సమయంలో అక్కడే నక్కి ఉన్న చిరుతపులి ఒక్కసారిగా చిన్నారిపై దాడి చేసి పొలాల్లోకి ఈడ్చుకుపోయింది. అక్కడే పనిచేస్తున్న వ్యక్తుల అది గమనించి కర్రలతో చిరుతను తరమడంతో కొద్ది దూరంలో చిన్నారిని వదిలి వెళ్లిపోయింది. వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే చిన్నారి మెడకు తీవ్ర గాయాలవడంతో ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు, అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. చిరుతపులిని గుర్తించేందుకు కెమెరా ట్రాప్‌లను, థర్మల్ డ్రోన్‌లను ఉపయోగించామని, 10 బోన్లు ఏర్పాటు చేశామని ఫారెస్ట్ డివిజన్ అధికారి పేర్కొన్నారు. సోమవారం చిరుత బోనుకు చిక్కిందని అటవీశాఖ అధికారులుపేర్కొన్నారు.

## పాకిస్థాన్‌లో ఆందోళనల అగ్గి

**ఇస్లామాబాద్, అక్టోబరు 13:** గాజాలో మరణాలు, ట్రంప్ శాంతి ప్రణాళికను నిరసిస్తూ ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా తెహ్రీక్-ఇ-లబ్బైక్ పాకిస్థాన్ (టిఎల్‌పి) కార్యకర్తలు చేస్తోన్న ఆందోళనలతో పాకిస్థాన్ భగ్గుమంటోంది. గత వారం మొదలైన ఉద్రిక్తతలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నించడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. దాంతో ఒక అధికారి సహా పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలతో లాహోర్‌లో రోజువారీ కార్యకలాపాలు నిలిచిపోయాయి. గాజా యుద్ధం ముగింపుపై పాలస్తీనా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తుంటే.. పాక్ హింసాత్మకంగా మారడం గమనార్హం. ట్రంప్ శాంతి ప్రణాళిక ప్రకటించిన తర్వాత ఇస్లామాబాద్‌లోని అమెరికా ఎంబసీ ముట్టడికి ప్లాన్ చేసింది. వారిని అడ్డుకునేందుకు పోలీసులు చేస్తోన్న ప్రయత్నాలు హింసాత్మకంగా మారుతున్నాయి.

14-10pg6exHMNWJQE 10_14-10pg6exHMNWJQE.qxd 10/14/2025 12:05 AM Page 1



# కడపలో విషాదం - ఒకే కుటుంబంలో నలుగురు మృతి

## - భార్య భర్తలతో పాటు యేడాది చిన్నారి మృతి - వారి మరణవార్త విని నాయనమ్మ మృతి

**కడప క్రైం, అక్టోబరు 13, ప్రభాతవార్త:** కడప నరంలోని శంకరాపురానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన వారు కొన్ని గంటల కాలవ్యధిలోనే నలుగురు నిండు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఇద్దరు భార్యభర్తలు, వారికి చెందిన పసి కందుతో పాటు మృతుని నాయనమ్మ గుండెపోటుతో మరణించడం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. కుటఉంబ సభ్యులలో వృద్ధురాలి మనవడు, మనవరాలు, మునిమనవడితో సహా కడప రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి గూడ్సు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ హృదయ విదారక ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. కడప నగరంలోని శంకరాపురంలో శ్రీరాములు(27), అతని భార్య వెంకట సుబ్బమ్మలు వృద్ధ దంపతులు. వీరి కుమారుడు రామకృష్ణ, పద్మావతిలకు రవలి, శ్రీరాములు అనే ఇద్దరు సంతానం ఉన్నారు. శ్రీరాములుకు మూడేళ్ల క్రితం నగరానికి చెందిన శిరీషతో వివాహం జరిగింది. వీరికి రుత్విక్(1) కుమారుడు ఉన్నాడు. శ్రీరాములుస్థానిక చెన్నూరు బస్టాండు సమీపంలోని ఓ వైద్యురాలి వద్ద ఫార్మశీ విభాగంలో విధులు చేసఉ్తన్నాడు. ఎప్పటిలాగే ఆదివారం రాత్రి 9.30 గంటల సమయంలో విధులు ముగించుకొచ్చాడు. ఆ సమయంలో మద్యం సేవించి శ్రీరాములు ఇంటికి వచ్చాడు. దీంతో కుటుంబ సభ్యులు శ్రీరాములును మందలించారు. దీంతో ఆయన ఆయన కుటుంబంతో ఆటోలో బయటకు వెళ్లాడు. అదే వీదిలో చివరలోని స్నేహితుడు పలకరించగా రైల్వేస్టేషన్‌కు వెళ్తున్నామన్నాడు. సదరు వ్యక్తి ఆ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపారు. అనారోగ్యంతో ఉన్న వెంకట సుబ్బమ్మ ఆకస్మిక మృతి చెందింది. వైద్యులను పిలిపించి పరిశీలించగా మృతి చెందినట్లు తెలుస్తోంది. శ్రీరాములు(23), శిరీష(21), రుత్విక్‌లు రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. రైల్వే స్టేషన్ నుంచి కమలాపురం వైపు నడుచుకుంటూ రైల్వే ట్రాక్‌పై గూడ్సు రైలు రాగానే పట్టాలపై పడుకొని మూకుమ్మడిగా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో ముగ్గురు మృతి చెందడం విషాధం నింపింది. ఒకే కుటుంబంలో 4 మరణాలు గంటల వ్యవధిలో జరగడంతో శంకరాపురంలో విషాధచాయలు అలుము కున్నాయి. సమాచారం తెలుసుకున్న బంధు వులు ఘటనా స్థలానికి చేరుకొని కన్నీరు మున్నీరుగా విలపించారు.

కడప రైల్వే ఇన్‌స్పె క్టర్ సుధాకర్‌రెడ్డి తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తర లించారు. ఆత్మహత్యకు గల కారణాలను లోతు గా దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు. కేవలం మద్యం సేవించి రోజూ ఇంటికి వస్తున్నాడన్న కారణంగా చోటు చేస ఎకున్న మనస్పర్ధలతో ఆ కుటుంబం మృతి చెంద డంతో ఒక్కసారిగా కుటుంబం చిన్నాభిన్నం అయింది.




# అమ్మాయి ఆత్మస్థైర్యంతో ఎదిగేలా చూసే బాధ్యత తల్లిదండ్రులదే

## - రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ

**విజయవాడ,అక్టోబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** అమ్మాయిల్లో ఆత్మవిశ్వాసం, స్వేచ్ఛ, ఎదిగే శక్తిని పెంపొందించే బాధ్యత తల్లిదండ్రులదేనని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ పిలుపునిచ్చారు. ఈ మేరకు డాక్టర్ రాయపాటి కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో అబ్బాయిలతో సమానంగా అమ్మాయిల చదువు, ఉద్యోగ అవకాశాలను ప్రోత్స హించాలన్నారు. ఆర్థిక అవగాహన ఉండాలని, ఆర్థిక స్వేచ్ఛ కలిగిన అమ్మాయిలు తమ జీవితాన్ని స్వయంగా నిర్ణయించుకునే శక్తిని, ఆత్మవిశ్వాసాన్ని పొందు తారని రాయపాటి శైలజ చెప్పారు.

తల్లిదండ్రుల ఆదర్శాలు, ఆశయాలు నిలబెట్టే ఆడపిల్లనూ వారసురాలిగా సమాజం గుర్తించాలని ఆమె కోరారు. బాలికలకు చదువు అవసరంతో పాటు వారు ఎదిగిన తర్వాత ఆర్థిక స్వేచ్ఛ ఉండా లన్నారు. ఇంటిలో ఆడపిల్లలతో తల్లిదండ్రులు కేటాయించే సమయం పెరగాలని, వారి ఆలోచనలను ఎప్పటికప్పుడు పంచుకున్నప్పుడే మూడో వ్యక్తుల ప్రమేయం తగ్గుతుందనేది అందరూ తెలుసుకోవాలన్నారు. శారీరక, మానసి కంగా ధృఢంగా ఉన్నప్పుడే మహిళ అన్ని రంగాలలో ఎదగగలదని చెప్పారు. అమ్మాయిలు ఇళ్ళల్లో చిన్నచిన్న విషయాలకు కాకుండా తమ రక్షణకు, ఎదుగుదలకు మొండితనం చూప డంలో తప్పేమీలేదన్నారు. నేటి సమాజంలో సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సి న అవసరం ఉందన్నారు. ఆన్లైన్ పరిచయాల పట్ల బాలికలు స్వయం నియంత్రణతో మెలగాలన్నారు. సోషల్ మీడియా ఎంత అవసరమో అంతే వాడు కోవాలని, శృతిమించితే సమస్యలు వస్తాయని రాయపాటి శైలజ హెచ్చరించారు. బ్లాక్ మెయిలింగ్ కు పాల్పడే వారి చర్యలకు భయపడి మానసిక వత్తిడికి గురికాకుండా తల్లిదండ్రుల సహకారం కోరాలని ఆమె పిలుపునిచ్చారు.

# భక్తులకు సంతృప్తికర దర్శనమే లక్ష్యం: ఇఒ

**ఇంద్రకీలాద్రి, అక్టోబర్ 13, ప్రభాతవార్త** దుర్గమ్మవారిని దర్శించుకోటానికి వచ్చే ప్రతి భక్తుడు సంతృప్తికరంగా దర్శనం చేసుకునేలా ప్రతి ఉద్యోగి చర్యలు తీసుకోవాలని ఇఒ వికె శీనా నాయక్ అన్నారు. సోమవారం ఆలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దసరా ఉత్సవాల్లో సిబ్బంది శ్రద్ధ, పనితీరు ప్రతిఒక్కరు గమనించారని, ఇదే విధంగారాబోయే కార్తీకమాసం, భవానీ దీక్షల కు సంబంధించిన ఏర్పాట్లపై అందరూ దృష్టిసారించి భక్తులకు సేవలందించాలన్నారు. ధర్మకర్తలమండలి దేవస్థానం యంత్రాంగం అంతా కలిసి కట్టుగా భక్తులకు మరింత సేవలందించాలన్నారు. ఈ సందర్భంగా 66 అంశాలపై చర్చించి గడువులోగా పనులు పూర్తి చేయాలని ఇఒ అన్నారు. కార్యక్రమంలో ఇఇ రాంబాబు, అసిస్టెంట్ కమీషనర్



సమావేశంలో మాట్లాడుతున్న ఇఒ

రంగారావు, ఎఇఒలు చంద్రశేఖర్, రమేష్‌బాబు, సుధారాణి, గంగాధర్, తిరుమలేశ్వరరావు, శ్రీనివాస్, వైదిక కమిటీసభ్యులు ఆంజనేయ ఘనాపాఠి, శ్రీధర్ శర్మ తదితరులు పాల్గొన్నారు. - దుర్గమ్మవారి సేవలో రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు : దుర్గమ్మ సోమవారం రాష్ట్ర సమాచార పౌర



సమాచార పౌరసంబంధాల సంచాలకులువిశ్వనాథన్‌కు దుర్గమ్మవారి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

తుమ్మల చంద్రశేఖర్‌రావు కుటుంబం పేరిట రు.1,01,116 ల విరాళాని ్ని సోమవారం అందిం చారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందిం చారు. వేదాశీర్వచనాలు పలికారు.

# వర్తమాన సమస్యలకు ప్రతిబింబంగా కవిత్వం

## - కలువల కొలను ఆవిష్కరణ సభలో వక్తలు



కలువల కొలను కవితా సంపుటి ఆవిష్కరణ దృశ్యం

**విజయవాడ, అక్టోబరు 13,ప్రభాత వార్తప్రతి నిధి:** ఎంతో విలువైన సమాచారాన్ని మనకు అందించగల కళలు, సాహిత్యం పట్ల నేటియువతరం ఆశక్తి చూపకపోవడం ప్రమాద సంకేతం అని సుప్రసిద్ధ కవి, నవలా రచయిత సాగర్ శ్రీరామకవచం అన్నారు. ఎక్స్ రే.. సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ నిర్వహణలో ..విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ హాల్.. లో ప్రముఖ కవి కారంచేటి విజయ కుమార్(తెనాలి) రచించిన ..కలువల కొలను.. కవితా సంపుటి ఆవిష్కరణ జరిగింది. పుస్తక ఆవిష్కరణ చేసిన శ్రీరామకవచం ప్రసంగం కొనసాగిస్తూ స్థితప్రజ్ఞతా వాచకం కలువల కొలను కవితా సంపుటి అంటూ మంచి సాహిత్య అధ్యయనం మనిషిని ఉన్నతునిగా తీర్చిదిద్దుతుంది, వీరు ఈ కవితా సంపుటి ద్వారా సమకాలీన సమస్యలను ప్రతిబింబింప చేసారు అని అభినందించారు. సభకు ముఖ్య అతిథిగా జిఆర్కె పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షులు గోళ్ళ నారాయణ రావు ప్రసంగిస్తూ ప్రజల్ని చైతన్యపరచి అభ్యుదయ పథంలో నడిపేదే కవిత్వం అన్నారు. నేటి యువత సేల్ ఫోన్లకు అంకితమై విలువైన భవిష్యత్ ను నాశనం చేసుకుంటున్నారు అని నారాయణ రావు అన్నారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ గుమ్మా సాంబశివరావు గ్రంథాన్ని సమీక్షి స్తూ విజయ కుమార్ కవిత్వం సరళమైన భాషలో అందరికి అర్థమయ్యేలా ఉందని ప్రశంసించారు. నేటి పరిస్థితులపై సరైన అవగాహనతో విజయకుమార్ రచన ..కలువల కొలను.. సాగుతుందని సాంబశివరావు అన్నారు. ..ఎక్స్ రే.. ఉపాధ్యక్షులు కందికొండ రవికిరణ్ సభాధ్యక్షుడుగా మాట్లాడతూ తమ సంస్థ లో కవిత్వ రచనలో అక్షరాలు దిద్ది నేడు గ్రంథ రచయిత స్థాయికి ఎదగిన విజయకుమార్ కృషి అభినందనీయం అన్నారు. గ్రంధ రచయిత కారంచేటి విజయకుమార్ కు సత్కారం జరిగింది. విజయకుమార్ గ్రంధ రచన నేపథ్యాన్ని వివరించి, తనను ప్రోత్సహించిన అందరికి ధన్యవాదములు తెలిపారు. తొలుత సంస్థ కోశాధికారి చామర్తి వెంకట సుబ్బయ్య స్వాగతం పలికి, చివరగా వందన సమర్పణ చేసారు. సంస్థ సభ్యులు గోపు రాము, డాక్టరు బి వసంత కుమార్, పొత్తూరి సీతారామారావు, గుర్రం ఏడుకొండలు, సామినేని శైలజ, విమలావతి, హారిక, వేణుగోపాల్ కార్యక్రమాన్ని పర్యవేక్షి ంచారు. పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.

# నాణ్యతతో కూడిన నిరంతర విద్యుత్

## - సోలార్ ఎనర్జీ పై ప్రత్యేక దృష్టి

## - ఎస్పిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్

**తిరుపతి కలెక్టరేట్, అక్టోబర్ 13 ప్రభాతవార్త :** నాణ్యత కూడిన నిరంతర విద్యుత్తును, సోలార్ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు నూతన ఏపీ ఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ వెల్లడించారు. సోమవారం ఏపీ ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొట్టమొదటగా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ ను అందించడంతో పాటు ఉద్యోగులు, సబ్ స్టేషన్లు, వినియోగ దారుల సమస్యల పరిష్కారానికి నిరంతరం సైనికుల పనిచేయనున్నట్లు తెలియజేశారు. అంతేకాకుండా విద్యుత్ అవసరమైన చోట స్టేజీలు మార్చుకుంటూ ముందుకెళ్లడం జరుగు తుందన్నారు. విద్యుత్తు శాఖలోని అన్ని విభాగాలను ఒక్క త్రాటిపై నడిపి ఎవరికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా భవిష్యత్తు తరాలకు బాసటగా నిలుస్తానని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల, డిస్కం సూచనలను సలహాలను నిరంతరం ఎప్పటికప్పుడు వినియోగదారులకు ఉద్యోగులకు తెలియజేస్తూ వారిలో అవగాహన పెంచడంతోపాటు విద్యుత్ శాఖ పనితీరును మెరుగు పరచడం జరుగుతుందన్నారు. తనపై ఎంతో నమ్మకంతో ఈ పదవిలో నియమించిన సీఎం చంద్రబాబుకి, విద్యుత్ శాఖ మంత్రికి, డిప్యూటీ సీఎం పవన్‌కు,మంత్రి లోకేష్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

# రెడ్ క్రాస్ జాతీయ కార్యవర్గ సభ్యునిగా ఎన్నికైన వై డి రామారావు



**విజయవాడ, అక్టోబరు 13,ప్రభాత వార్తప్రతినిధి:** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ చైర్మన్ వై.డి. రామారావు ఈరోజు రెడ్ క్రాస్ జాతీయ కార్యవర్గానికి జరిగిన ఎన్నికల్లో దక్షి ణ భారత దేశానికి ప్రాతినిధ్యం వహిస్తు ఎన్నికయ్యారు. భారత ప్రభుత్వ ఆరోగ్య,. కుటుంబ సంక్షేమ శాఖ కేంద్రమంత్రి జె.పి. నడ్డా అధ్యక్షతన ఈ జాతీయ మేనేజింగ్ కమిటీ పనిచేస్తుంది. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ లోని 28 రాష్ట్ర మరియు కేంద్రపాలిత ప్రాంతాల శాఖల నుండి రెండు సంవత్సరాల పదవీకాలానికి పన్నెండు రాష్ట్రాల సభ్యులు ఎన్నికయ్యారు. కాకినాడ జిల్లా శాఖ చైర్మన్‌గా, ఆయన అనేక మానవతా మరియు సమాజ సేవా ప్రాజెక్టులకు నాయకత్వం వహించారు, ఈ ప్రాంతంలో రెడ్ క్రాస్ ఉద్యమాన్ని గణనీయంగా బలోపేతం చేశారు. రెడ్ క్రాస్‌కు ఆయన చేసిన అత్యుత్తమ కృషికి గుర్తింపుగా, ఆయనకు 2018-19 సంవత్సరానికి రాష్ట్రపతి బంగారు పతకాన్ని ప్రదానం చేశారు. జాతీయ మేనేజింగ్ బాడీలోకి ఆయన చేరిక దక్షిణ భారతదేశం అంతటా, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో రెడ్ క్రాస్ సేవా ప్రాజెక్టుల పరిధి మరియు ప్రభావాన్ని మరింత పెంచుతుంది.

# నెల్లూరు నగర శివార్లలో రోడ్డు ప్రమాదం

## - ఇద్దరు మృతి, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

**నెల్లూరు క్రైమ్, అక్టోబర్ 13, ప్రభాతవార్త :** నెల్లూరు నగర శివార్లలోని ప్రశాంతి నగర్ సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలై చికిత్స పొందుతున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే.. కోవూరు పట్టణ పరిధిలోని ఇంద్రలోక్ అవెన్యూలో షేక్ మస్తాన్ వలి డ్రై క్లీనర్స్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. నగరంలోని ప్రముఖ హాస్పిటళ్లు, హోటళ్లలోని దుప్పట్లు, బెడ్ షీట్లు ఇతర దుస్తులను కాంట్రాక్టు పద్ధతిలో తీసుకొని శుభ్రపరచి తిరిగి అందజేస్తుంటారు. ఈ క్రమంలోనే సోమవారం ఉదయం మస్తాన్ వలీ కుమారుడు షేక్ మన్సూర్ (28), తమ వద్ద వాహనానికి డ్రైవర్‌గా పనిచేస్తున్న విడవలూరు మండలం ఊటుకూరు గ్రామానికి చెందిన సురేష్ రెడ్డి (49), తమ వద్ద పనిచేసే అనిల్, షమీమ్, అన్సార్ అనే వారిని వెంటబెట్టుకుని శుభ్రం చేసిన దుస్తులను తమ వాహనంలో నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు బయలుదేరారు.

ఈ క్రమంలో జాతీయ రహదారిపై పెన్నా వంతెన దాటగానే మూడవ మైలుకు వెళ్లే సర్కిల్ సర్కిల్ వద్ద వెనుక నుండి వస్తున్న లారీ వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని వెనుక నుండి బలంగా ఢీ కొట్టింది. దీంతో వీరి వాహన ముందు ఉన్న మరో లారీని వెనుక నుండి బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న సురేష్ రెడ్డి, అతని పక్కన సీటులో కూర్చున్న మన్సూర్‌లు తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందారు. వాహనం ట్రక్కులో కూర్చున్న అన్సార్, షమీమ్ లకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన సమాచారం అందుకున్న నార్త్ ట్రాఫిక్ ఎస్ఐ బలరామిరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని శతక్షతులను అంబులెన్స్ ద్వారా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం వలన జాతీయ రహదారిపై స్తంభించిపోయిన ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

# రోడ్డు ప్రమాదంలో మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి అనుచరుడు మృతి

**బిట్రగుంట (నెల్లూరు), అక్టోబర్ 13, ప్రభాతవార్త :** బోగోలు మండలం ముంగమూరు క్రాస్ రోడ్ సమీపంలో జరిగిన రోడ్డుప్రమాదంలో మాజీ శాసనసభ్యులు కాటంరెడ్డి విష్ణువర్ధనరెడ్డి ముఖ్య అనుచరుడు పాలవెల్లి. పద్మనాభరెడ్డి (59) మృతిచెందారు. కావలి నార్త్ జనతాపేటకు చెందిన పద్మనాభరెడ్డి తమ నేత విష్ణువర్ధనరెడ్డి అల్లూరుకు వచ్చి ఉన్నాడని తెలుసుకొని ఆయనను కలిసేందుకు మోటార్సైకిల్ పైన కావలి నుండి బయలుదేరి మార్గమధ్యంలో పెట్రోల్ పట్టించుకునేందుకు రోడ్డు క్రాస్ చేస్తునప్పుడు కావలి నుండి నెల్లూరు వైపు వెళ్లే కారు వెనుకనుండి మోటార్సైకిల్ ను ఢీకొనడంతో తీవ్రగాయలు అయినాయి. ప్రమాదంజరిగినవెంటనే మెరుగైన చికిత్సకోసం నెల్లూరు లోని ఓప్రైవేట్ వైద్యశాలకు తరలిస్తుండటంతో అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ సంఘటనతో విష్ణు అనుచరులు తీవ్ర కలత చెందారు. కేసును బిట్రగుంట ఎస్ఐ ప్రభాకర్ దర్యాప్తు చేస్తున్నారు.

# శ్రీశైలంలో నూతన బోర్డు ప్రమాణస్వీకారం

## పాల్గొన్న మంత్రి సత్యకుమార్ యాదవ్

**శ్రీశైలం, అక్టోబర్ 13 ప్రభాతవార్త:** శ్రీశైలం దేవస్థానంలో నూతనంగా ప్రభుత్వం ప్రకటించిన ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారం అట్టహాసంగా ప్రారంభమైంది స్థానిక చంద్రవతి కళ్యాణ మండపంలో శ్రీస్వామి అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి కర్పూరహారతులిచ్చి అనంతరం పాలక మండలి చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు,సభ్యులు మొత్తంగా 17 మందితో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు అట్టహాసంగా ప్రారంభమైన ట్రస్ట్ బోర్డ్ ప్రమాణస్వీకారంలో ఏపీ ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు బోర్డ్ సభ్యులలో ఇద్దరు సభ్యులు గైర్హాజరు అయ్యారు అయితే నేడు ప్రమాణస్వీకారం చేసిన చైర్మన్, సభ్యులు రెండు సంవత్సరాల పాటు దేవస్థానం ధర్మకర్తల మండలిగా కొనసాగనుంది.

# టపాసులు ఐదు కిలోలకు మించితే పోలీసు అనుమతి తప్పనిసరి

## దుకాణాలు, గోదాములు వద్ద తగిన భద్రత

**హైదరాబాద్, అక్టోబరు 13, ప్రభాత వార్త:** టపాసుల దుకాణాలకు, గోదాములకు పోలీ సు, ఫైర్ సర్వీస్ శాఖలు అనుమతులు ఇస్తుండడం తెలిసిందే. అయితే ఈసారి కొత్తగా టపాసులు కొనేవారు భారీగా అంటే ఐదు కిలోలు అంతకు మించి ఎవరైనా ఖరీదు చేసి, తమ ఇళ్లలో నిలువచేస్తే పోలీసు, ఫైర్ సర్వీస్ శాఖల నుంచి అనుమతులు తీసుకో వాల్సి వుంటుంది. దీనిపై పోలీసులు టపాసుల దుకాణాల నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశారు.

# 2030 నాటికి అత్యంత ఆకర్షణీయమైన పర్యాటక స్థానంగా ఎపి

## - పర్యాటక మంత్రి కందుల దుర్గేష్



**విజయవాడ,అక్టోబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలో పర్యాటక రంగం అభివృద్ధికి సంబంధించిన కేంద్ర బడ్జెట్ 202526 ప్రకటనల అమలుపై రాష్ట్ర విజన్‌ను సమర్పించేందుకు అక్టోబర్ 14, 15 తేదీల్లో రాజస్థాన్ లోని ఉదయ్‌పూర్‌లో కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అధ్యక్షతన జరుగనున్న జాతీయ మిషన్ లో మంత్రి కందుల దుర్గేష్, పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్, ఎండీ ఆమ్రపాలి కాట పాల్గొననున్నారు. దేశంలో ప్రపంచవ్యాప్తంగా పోటీపడగల 50 పర్యాటక గమ్యస్థానాల అభివృద్ధి, పనితీరు ఆధారిత ప్రోత్సాహకాల కల్పన కోసం ఉద్దేశించిన జాతీయ మిషన్ పై చర్చించేందుకు ఏపీ ప్రభుత్వం తరపున ప్రతినిధిగా మంత్రి కందుల దుర్గేష్ బృందం హాజరుకానుంది. ఈ సందర్భంగా జాతీయ మిషన్ క్రింద ఆంధ్రప్రదేశ్ తరపున పర్యాటక ప్రతిపాదనలను మంత్రి దుర్గేష్ వివరించనున్నారు. ఈ చారిత్రాత్మక సమావేశంలో జాతీయ మిషన్ లక్ష్యాల సాధనకు చేయనున్న కృషి, ప్రైవేట్ పెట్టుబడులు, స్థానిక ఆర్థిక వృద్ధికి అందించే ప్రోత్సాహం, యువతకు ఉపాధి కల్పన, రాష్ట్ర పర్యాటక శాఖలో అవలంభిస్తున్న విధానాలు, పెట్టుబడులు పెట్టేందుకు ఇన్వెస్టర్లకు అందిస్తున్న ప్రోత్సాహకాలు తదితర అంశాలపై కూటమి ప్రభుత్వం తీసుకోనున్న చర్యలను వెల్లడించనున్నారు. అంతేకాదు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడం, పర్యాటకులకు అద్భుత అనుభవాలను కల్పించే లక్ష్యంతో ఏపీ ప్రభుత్వం పని చేస్తున్న తీరుపై ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. 2030 నాటికి ఆసియాలోనే అత్యంత ఆకర్షణీయమైన పర్యాటక గమ్యస్థానాలలో ఏపీని ఒకటిగా నిలిపేందుకు తీసుకోనున్న చర్యలను సమావేశంలో వివరించనున్నారు. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాల్లో ఎంపిక చేసిన ప్రధాన పర్యాటక గమ్యస్థానాలను రాష్ట్రాల భాగస్వామ్యంతో ఛాలెంజ్ మోడ్‌ లో కేంద్రం అభివృద్ధి చేయనుంది. పర్యాటక సౌకర్యాలు, పరిశుభ్రత, మార్కెటింగ్ ప్రయత్నాలతో సహా సమర్థవంతమైన గమ్యస్థాన నిర్వహణ కోసం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు పనితీరు ఆధారిత ప్రోత్సాహకాలు అందించనుంది. ఈ సందర్భంగా పర్యాటక ప్రాంతాల మోలిక సదుపాయాల నిర్మాణానికి అవసరమైన భూమిని రాష్ట్రాలు అందించాల్సి ఉంటుంది.

# రైతుకు కనీస మద్దతు ధర అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

## - కేంద్ర ఆహార సంస్థ రాష్ట్ర స్థాయి సంప్రదింపుల కమిటీ చైర్మన్, ఎంపి లావు శ్రీ కృష్ణ దేవరాయలు

**విజయవాడ,అక్టోబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రం లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ లో భారత ప్రభుత్వం ద్వారా 30 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణకు కేంద్ర ప్రభుత్వం అనుమతించిందని భారత ఆహార సంస్థ రాష్ట్ర స్థాయి సంప్రదింపుల కమిటీ చైర్మన్, పార్లమెంట్ సభ్యులు, లావు శ్రీ కృష్ణ దేవరాయలు తెలిపారు. నగరంలోని పటమట యనమల కుదురు రోడ్డులోని భారత ఆహార సంస్థ ప్రాంతీయ కార్యాలయంలో సోమవారం భారత ఆహార సంస్థ రాష్ట్ర స్థాయి సంప్రదింపుల కమిటీ సమావేశాన్ని చైర్మన్, పార్లమెంట్ సభ్యులు, లావు శ్రీ కృష్ణ దేవరాయలు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ లావు శ్రీ కృష్ణ దేవరాయలు పాత్రికేయులతో మాట్లాడుతూ రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అదేవిధంగా ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర రైతుకు అందించాలన్నదే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. గత ఏడాది ఖరీఫ్ లో 15.92 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని భారత ఆహార సంస్థ ద్వారా కొనుగోలు చేసామన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ లో 30 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణకు కేంద్ర ప్రభుత్వం అనుమతించిందని తెలిపారు. ఎఫ్ సీఐ నుంచి పంజాబ్ రాష్ట్రం తర్వాత 14 లక్షల టన్నుల బియ్యాన్ని 10 బ్రోకెన్ తో సేకరించడానికి అనుమతి ఉన్న రెండవ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని అన్నారు. గత అనుభవాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని ధాన్యం కొనుగోలు పెంచాలని కోరటం జరిగిందని, దానికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం లక్ష్యాన్ని పెంచిందన్నారు. గత రబీ సీజ లో 9.93 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఈ ఏడాది రబీలో కొనుగోలు లక్ష్యాన్ని పెంచే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసాయని దాంతో పంట గిగుబడి మరింత పెరిగే అవకాశం ఉందని, దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో శ్రీకాకుళం, విజయనగరం, పల్నాడు జిల్లాల్లో గిడ్డంగుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం స్థలం మంజూరు చేస్తే కొత్త వాటిని భారత ఆహార సంస్థ నిర్మించేందుకు తమ సంసిద్ధతను తెలియజేసిందన్నారు. భారత ఆహార సంస్థ గిడ్డంగుల్లో సోలార్ విద్యుత్ కు 45 మెగా వాట్స్ ఉత్పత్తి సామర్థం కలిగిన ఫ్లానెల్స్ పెట్టుకోగల అవకాశం కలిగి ఉందని వివరించారు. పోషకాలతో కూడిన ఫోర్టిఫైడ్ రైస్ పంపిణీ: భారత ఆహార సంస్థ ద్వారా ప్రతి నెలా 1.54 లక్షల మెట్రిక్ టన్నుల ఫోర్టిఫైడ్ రైస్ పంపిణీ అవుతుందన్నారు.




ఫోర్టిఫైడ్ రైస్ ను రాష్ట్రంలో 24.47 లక్షల మంది పిల్లలకు మధ్యాహ్న భోజన పథకం క్రింద, మహిళాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని 55,746 అంగన్వాడీ కేంద్రాలకు ద్వారా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. తొలుత నిర్వహించిన సమీక్షా సమావేశంలో భారత ఆహార సంస్థ కొనుగోలు, నిల్వ, పంపిణీ కార్యకలాపాలపై కమిటీ సభ్యులు, అధికారులతో చైర్మన్ చర్చించారు. రైతులకు ప్రభుత్వం కల్పించిన కనీస మద్దతు ధర (లీలీశి) ప్రయోజనం కల్పించేలా, ప్రజలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రయోజనం చేకూర్చే విధంగాను సమీక్షి ంచారు. సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, భారత ఆహార సంస్థ ఏపీ రీజనల్ జనరల్ మేనేజర్ విజయ కుమార్ యాదవ్, సివిల్ సప్లైస్ అధికారులు, భారత ఆహార సంస్థ అధికారులు, భారత ఆహార సంస్థ రాష్ట్ర స్థాయి సంప్రదింపుల కమిటీ సభ్యులు, తదితరలు పాల్గొన్నారు.

# విశాఖ సదస్సు లక్ష్యం పెట్టుబడుదారుల ఆకర్షించడమే!

## - సిఐఐ భాగస్వామ్య సదస్సు సన్నాహకాలపై సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ,అక్టోబర్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు ఆకట్టుకోవడం, ఏపీ బ్రాండ్ ఇమేజ్ పెంచుకోవడంతో పాటు సరికొత్త ఆలోచనలకు సీఐఐ భాగస్వామ్య సదస్సు వేదిక కావాలని అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. ఆంధ్రప్రదేశ్‌ను భారత ఆర్థిక, సాంకేతిక ప్రగతిలో అగ్రగామిగా ప్రతిష్ఠించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. విశాఖపట్నంలో నవంబర్ 14, 15 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించతలపెట్టిన సీఐఐ పార్టనర్షిప్ సమ్మిట్ సన్నాహకాలపై సచివాలయంలో సోమవారం అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సీఐఐ సదస్సుకు ముఖ్య అతిథిగా ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించాలని నిర్ణయించినట్టు సీఎం తెలిపారు. అలాగే వివిధ దేశాల వాణిజ్య మంత్రులను, లీడింగ్‌గ్లోబల్ సీఈవోలను ఆహ్వానించాలని నిర్దేశించారు. దేశ, విదేశాలకు చెందిన పారిశ్రామిక వేత్తలు, పాలసీ థింకర్లు, అకడమిక్స్‌కు సదస్సులో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గ్లోబల్ టెక్ ట్రాన్సఫర్మేషన్, గ్లోబల్ ట్రస్ట్ పెంచుకోవడం, గ్లోబల్ ట్రేడ్‌లో దేశం వాటా పెరగడం సదస్సు లక్ష్యంగా ఉండాలని సూచించారు. అతిథులకు అన్ని సౌకర్యాలతో ఆతిథ్యం ఇచ్చేలా ఏర్పాట్లు చేయాలని, విశాఖ నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దాలని చెప్పారు. గ్రీన్ ఎనర్జీ రంగంలో రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలుస్తోంది. అలాగే గూగుల్ వంటి అంతర్జాతీయ సాంకేతిక దిగ్గజ సంస్థలు రాష్ట్రానికి వస్తున్నాయి.

రాష్ట్రం త్వరలోనే కృత్రిమ మేధస్సు, ఇన్నోవేషన్ హబ్‌గా మారనుంది. సదస్సులో ఈ అంశాలు, రాష్ట్ర ఆకాంక్షలు ప్రతిబింబించాలి. సదస్సు ఏర్పాట్లకు సమయం తక్కువ ఉన్నందున... వేగంగా పనులు పూర్తి చేయాలి. అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సీఐఐ భాగస్వామ్య సదస్సు నవ్యాంధ్రప్రదేశ్‌లో నిర్వహించడం ఇది 4వ సారి. గతంలో 2016, 2017, 2018లో మూడు సార్లు విశాఖలోనే నిర్వహించారు. ఇప్పుడు విశాఖనే సదస్సుకు ఆతిథ్యం ఇవ్వనుంది. ఈసారి సీఐఐ సదస్సు టెక్నాలజీ, ట్రస్ట్, ట్రేడ్‌నావిగేటింగ్ ది జియోఎకనామిక్ ఆర్డర్ థీమ్‌తో మొత్తం 13 సెషన్లుగా జరగనుంది. 29 మంది వాణిజ్య మంత్రులు, 80 మంది దేశ, విదేశీ సీఈవోలు, 40 దేశాల నుంచి ప్రతినిధులు, అలాగే 13మంది కేంద్ర మంత్రులు ఈ సదస్సుకు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. జీ20 దేశాలు, మిడిల్ ఈస్ట్, యూరప్, ఆసియా, పశ్చిమాసియా తదితర ప్రాంతాల నుంచి ప్రతినిధులు పాల్గొనే అవకాశం ఉంది.

ట్రేడ్, జియోఎకనామిక్ ఫ్రేమ్ వర్క్, టెక్నాలజీఇన్నోవేషన్, డిఫెన్స్, ఏరోస్పేస్, హెల్త్ కేర్, బయోటెక్నాలజీ, స్మార్ట్ మాన్యుఫాక్చరింగ్, లాజిస్టిక్స్ సప్లయ్ చైన్, సస్టెయినబిలిటీక్లీన్ ఎనర్జీ, లెవరేజింగ్ టెక్నాలజీ అంశాలపై సెషన్లు జరుగుతాయి.

14-10P g7exHMNWJQE 11_14-10P g7exHMNWJQE.qxd 10/14/2025 12:07 AM Page 1



# తొలిరోజు పది నామినేషన్లు దాఖలు

## రిక్షా తొక్కుతూ వచ్చి నామినేషన్ దాఖలు చేసిన టిఆర్‌పిఎస్ అభ్యర్థి

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్),అక్టోబరు 13, ప్రభాత వార్త:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా తొలి రోజైన సోమవారం పదిమంది అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. పద మంది అభ్యర్థులు మొత్తం 11 సెట్ల నామినేషన్లను షేక్‌పేట మండల కార్యాలయంలోని ఎన్నికల నామినేషన్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి పి. సాయిరాంకు తమ నామినేషన్లను అందించారు. ఇందులో 8మంది స్వతంత్ర అభ్యర్థులు కాగా, ఇద్దరు పార్టీల నుంచి తమ నామినేషన్లను అందించారు. శ్రీకాంత్ సిలివేరు, పెసరికాయల పరీక్షిత్‌రెడ్డి, చంద్రశేఖర్, సపవాత్ సుమన్, వేముల విక్రమ్ రెడ్డి, ఇబ్రహింఖాన్, సయ్యద్ ముస్తఫా హుస్సేన్, సల్మాన్‌ఖాన్‌లు స్వతంత్రులుగా నామినేషన్లను దాఖలు చేయగా తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణ సమితి(టీఆర్‌పీఎస్) నుండి పూస శ్రీనివాస్, నవతరం పార్టీ నుంచి అరవల్లి శ్రీనివాస్ రావులు దాఖలు చేశారు. టీఆర్‌పీఎస్ అభ్యర్థి రిక్షా తొక్కుతూ తనతోపాటు వచ్చిన ఇద్దరు డప్పు కళాకారులు మరో ఇద్దరు మద్దతుదారులతో కలిసి నామినేషన్ దాఖలు చేసి వెళ్లారు. సల్మాన్‌ఖాన్ బోరబండ ప్రాంతం నుంచి భారీ ర్యాలీగా తరలివచ్చి నామి నేషన్‌ను దాఖలు చేశారు.

శ్రీకాంత్ సిలివేరు రెండు సెట్ల నామినేషన్లను దాఖలు చేయగా మిగిలిన అభ్య ర్థులు ఒక్కో నామినేషన్‌ను దాఖలు చేశారు. ఈ సందర్భంగా పోలీసు నోడల్ అధికారి, పంజాగుట్ట ఏసీపీ మురళీకృష్ణ, బంజారాహిల్స్ ఏసీపీ వెంకటరెడ్డి, ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో ఇక్కడ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వంద మీటర్ల దూరంలోనే ర్యాలీలను నిలిపివేశారు.




సోమవారం ఎస్పీఆర్ హిల్స్ గ్రౌండ్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు హరీష్‌రావు, తలసాని తదితరులు

# కారు కావాలా, బుల్డోజర్ కావాలా!

## బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు.

**హైదరాబాద్ (యూసుఫ్‌గూడ), అక్టోబరు 13, ప్రభాతవార్త:** కారు కావాలా బుల్డోజర్ కావాలా అనేది జూబ్లీహిల్స్ ఓటర్లు నిర్ణయించుకోవాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సోమవారం జూబ్లీహిల్స్ నియోజక వర్గం లోని రహమత్ నగర్ డివిజన్ పరిధిలోని ఎస్పీఆర్‌హిల్స్ గ్రౌండ్‌లో నియోజకవర్గం బీఆర్ఎస్ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. దీనికి ముఖ్యఅతిథులుగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే హరీష్ రావు, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతా గోపినాథ్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ మంత్రులు మల్లారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే షకీల్, పి.విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ చీఫ్ విప్ దాశ్యం వినయ్ భాస్కర్, కార్పొరే టర్లు దేదిప్యా విజయ్‌కుమార్, రాజ్‌కుమార్ పటేల్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడగొడితే ప్రతి పథకం రాష్ట్ర వ్యాప్తంగా అమలు అవుతాయని అన్నారు. హైడ్రా పేరుతో పెద్దోళ్ల ఇళ్లను కూల్చకుండా పేదోళ్ల ఇళ్లను కూలుస్తున్నారని అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఒక్క ఇంట్లో 43 దొంగ ఓట్లు కాంగ్రెస్ నాయకులు రాయించారని ప్రజలు ప్రతీది గమనిస్తున్నారన్నారు. మాగంటి గోపినాథ్ రుణం తీర్చుకోవాలంటే నియోజకవర్గంలోని ఓటర్లు మాగంటి సునీత కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. అనంతరం మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ ఒకప్పుడు తెలంగాణ అంటే పరిశ్రమలకు నిలయమని నేడు కాంగ్రెస్ పాలనీలో తెలంగాణ దివాలా తీసిందని నవంబర్ 11న జరగనున్న ఉప ఎన్నికల్లో మాగంటి సునీతాను గెలిపించుకునే బాధ్యత మన అందరిపై ఉందని కలసికట్టుగా పనిచేయాలని ఏ కార్యకర్తకి ఎలాంటి సమస్య వచ్చినా తాము అందుబాటులో ఉండి అందర్ని ఆదు కుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని డివిజన్ల ఇంచార్జ్‌లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కారు పాలన వద్దని కంటోన్మెంట్‌లోనే తేల్చారు

## హరీష్ రావుకు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ కౌంటర్

**హైదరాబాద్, అక్టోబరు 13,ప్రభాతవార్త:** కారు పాలన వద్దని ప్రజలు కంటోన్మెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ను ఎలా గెలిపించారో జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ప్రజలు అలా గెలిపిస్తారని ఎమ్మెల్సీ దయాకర్ అన్నారు. గాంధీభవన్‌లో సోమవారం మాట్లాడుతూ తెలంగాణలో విధ్వంసం సృష్టించింది బిఆర్ఎస్ కారు మాత్రమే అని ఆయన విమర్శించారు. మీ బామ్మర్ది, నువ్వు సెంటిమెంట్ తో ఎంత చేసినా ఉపయోగం లేదు హరీష్‌రావుకు హితవు చెప్పారు. జూబ్లీహిల్స్ లో ప్రజలు కాంగ్రెస్‌ను కోరుకుంటున్నారని ఆయన అన్నారు. మీ విధ్వంస, బుల్డోజర్ పాలనను తెలం గాణ ప్రజలు కోరుకోరని తెలిపారు. మీరు ప్రతి పక్షంలో లేరు, అసలు ఉనికిలోనే లేరు అని ఆయన చెప్పారు. మీరు ఇంకా గెలుస్తామని భ్రమల్లోనే ఉన్నారని ఎద్దేవా చేశారు.

# జూబ్లీహిల్స్ ఎన్నికల్లో 300నామినేషన్లు వేస్తాం

## తెలంగాణ మాలసంఘాల జెఎసి

**హైదరాబాద్, అక్టోబరు 13,ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం జిల్లాల వారీగా 300 మంది మాలలు నామినేషన్లు వేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు తెలంగాణ మాల సంఘాల జేఏసీ ప్రకటించింది. రాష్ట్రంలో ఆరు నెలలుగా జరిగిన ఉద్యోగ నియామకాల్లో ఎస్సీల్లోని 58 కులాలకు తీరని అన్యాయం జరిగిందని పేర్కొంది. కాంగ్రెస్‌ను ఓడించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు జేఏసీ ఛైర్మన్ మందాల భాస్కర్ పేర్కొన్నారు. సోమవారం సోమాజిగూడలోని ప్రెస్ క్లబ్లో వారు మాట్లాడారు. ఎంపెరికల్ డేటా తీసుకుని, అన్ని వర్గాలతో చర్చించి వర్గీకరణ చేస్తామన్నారు. అవేవీ చేయకుండానే వర్గీకరణ చేసి 58కులాల గొంతుకోశారు. రోస్టర్ పాయింట్ల కేటాయింపులో తీవ్ర అన్యాయం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు అనే ఆయుధంతో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం' అని జేఏసీ నేతలు తెలిపారు.




సోమవారం గన్‌పార్కు వద్ద వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య, నారగోని, జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

# 18న జరిగే బిసిల బంద్‌ను విజయవంతం చేయాలి

## అన్ని వర్గాలకు పిలుపు నిచ్చిన తెలంగాణ బిసి జెఎసి

**హైదరాబాద్ (సైఫాబాద్), అక్టోబరు 13 ప్రభాతవార్త:** బిసి రిజర్వేషన్‌లకు వ్యతిరేకంగా రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన స్టేని నిరసిస్తూ ఈ నెల 18వ తేదీన నిర్వహించతలపెట్టిన 'తెలంగాణ రాష్ట్ర వ్యాప్త బంద్'ను విజయవంతం చేయాలని తెలంగాణ బిసి జెఎసి నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమ వారం గన్‌పార్కులోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద బిసి జెఎసి ఛైర్మన్, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, వైస్-ఛైర్మన్ వి.జి.ఆర్.నారగోని, వర్కింగ్ ఛైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిసిల రిజర్వేషన్‌లు విదా , ఉద్యోగ, రాజకీయ రంగాలలో సాధించడానికి 18వ తేదీన నిర్వహించతలపెట్టిన బంద్‌కు అన్ని వర్గాల ప్రజలు పూర్తిగా సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. బిసిలు బిచ్చగాళ్ళు కాదని, రిజర్వేషన్‌లు తమ హక్కని స్పష్టం చేశారు. రిజర్వేషన్‌లు సాధించేంతవరకు ఉద్యమం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు గుజ్జ కృష్ణ,గుజ్జసత్యం, రాజారామ్‌యాదవ్, ఎం.భాగ్యలక్ష్మి,నీల వెంకటేష్, సి.రాజేందర్, గణేషాచారి,జిల్లపల్లి అంజి, కుల్కచర్ల శ్రీనివాస్, వేముల రామకృష్ణ, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

# ఎపిపి పోస్టుల భర్తీకి డిసెంబర్ 14న రాత పరీక్ష

**హైదరాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** తెలంగాణ పోలీసు శాఖలో భర్తీ చేయనున్న అసిస్టంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఎపిపి) పోస్టులకు వచ్చే డిసెంబర్ 14వ తేదీన రాత పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలు జంట నగరాలతో పాటు శివార్లలో ఎంపిక చేసిన కేంద్రాలలో వుంటుందని పోలీసు ని యామక మండలి సోమవారం వెల్లడించింది. ఈ పోస్టులకు 3132 దరఖాస్తులు రాగా ఇందులో 1908పురుష అభ్యర్థులవి, 1224 మహిళా అభ్యర్థులవిగా నియామక మండలి ఛైర్మన్ శ్రీనివాసరావు తెలిపారు. మొత్తం అభ్యర్థుల్లో 18శాతం ఓసి కేటగిరి, 47 శాతం బిసి కేటగిరి,26శాతం ఎస్‌సి కేటగిరి, తొమ్మిది శాతం ఎస్‌టికేటగిరి వారు వున్నారని ఆయన తెలిపారు. కాగా అభ్యర్థులకు ఉదయం పది గంటల నుంచి ఒంటి గంట వరకు మూడుగంటల పాటు మొదటి దఫాగా ఎంసిక్యూ టైప్‌లో 200 ఆబ్జెక్టివ్ ప్రశ్నలువుంటాయి.

# హ్యామ్‌రోడ్ విధానంలో ఎన్‌హెచ్ నిర్మాణానికి కేంద్రం సమ్మతి

**హైదరాబాద్, అక్టోబరు13,ప్రభాతవార్త:** రాష్ట్రంలో పలు జాతీయ రహదారులను హ్యామ్ విధానంలో నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం సమ్మతి తెలిపింది. అంతేకాదు దేశవ్యాప్తంగా పలు జాతీయ రహదారుల పనులు హ్యామ్ విధానంలో చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.25,661 కోట్ల నిధులను జాతీయ రహదారులకు కేటాయించింది. రాష్ట్ర వ్యాప్తంగా 431 కిలోమీటర్ల మేర రహదారులను హ్యామ్ పద్ధతిలో నిర్మించేందుకు అంచనాలు రూపొందించారు. హ్యామ్ విధానంలో ఎన్ హెచ్ఎఐ నిర్మించే రహదారులను కేంద్ర ప్రభుత్వం, నిర్మాణ సంస్థలు 40:60 నిష్పత్తిలో నిధులు వ్యయాలను పంచుకొంటారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది జాతీయ స్థాయిలో 124 జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. రూ.3,45,466 కోట్లతో 6,376 కిలోమీటర్ల మేర నిర్మాణాలు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించారు. రూ.500 కోట్ల కంటే ఎక్కువ ఖర్చు చేసి చేపట్టే ఈ రహదారుల నిర్మాణాల తాత్కాలిక జాబితాలో రాష్ట్రానికి చెందిన ఐదు జాతీయ రహదారులకు చోటు దక్కింది. ఆర్మూర్-జగిత్యాల, జగిత్యాల-మంచిర్యాల్ కారిడార్లో భాగమైన జాతీయ రహదారిని నాలుగు లేన్లకు విస్తరించనున్నారు. అంతే కాకుండా జగిత్యాల- కరీంనగర్ మధ్యలో కూడా రహదారి విస్తరణ పనులు చేపట్టనున్నారు. హైదరాబాద్ ట్రిపుల్ ఆర్, హైదరాబాద్-పనాజీ సెక్షన్ పరిధిలోని మహబూబ్ నగర్ నుంచి రాయచూర్ ఎన్.హెచ్ 167 రహదారి పనులు చేపట్టేందుకు మొత్తం రూ.25,661 కోట్ల నిధులు మంజూరు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన జాతీయ రహదారుల నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు ఆమోదం తెలిపింది. హైదరాబాద్ రీజనల్ రింగ్ రోడ్డు 160 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రూ.15,627 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీనిని జాతీయ రహదారిగా గుర్తించి ఎన్.హెచ్161ఏఏ నెంబరును కూడా ఖరారు చేసింది. హైదరాబాద్‌పనాజీ సెక్షన్ పరిధిలోని మహబూబ్ నగర్ నుంచి రాయచూర్ ఎన్.హెచ్167 వెళ్లే రహదారి, మహబూబ్ నగర్ నుంచి కర్ణాటక సరిహద్దులోని గుడెబల్లూర్ (రాయచూరుకు సమీపంలో)వరకు ఉన్న 80కి.మీ డబుల్ రోడ్డును రూ.2,662 కోట్ల అంచనాలతో ఫోర్ లైన్‌గా విస్తరించనున్నారు. జగిత్యాల-మంచిర్యాల్ జాతీయ రహదారి విస్తరణ పనులకు రూ.2,550 కోట్ల వ్యయంతో 68 కిలోమీటర్ల మేరకుపనులు చేపట్టనున్నారు. అర్మూర్‌జగిత్యాల 64కిలోమీటర్ల జాతీయరహదారి నిర్మాణానికి రూ.2,338కోట్లు మంజూరు చేశారు. జగిత్యాల కరీంనగర్59కిలోమీటర్ల జాతీయరహదారి నిర్మాణ పనులకు రూ.2,384కోట్లు మంజూరు చేశారు.

# నవంబర్ 19 నుంచి ఉచిత చీరెల పంపిణీ

**హైదరాబాద్,అక్టోబరు 13, ప్రభాతవార్త :** బతుకమ్మ కానుకగా ఇందిరా మహిళా శక్తి పేరుతో ఆడపడుచులకు చీరలు పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే పండుగ నాటికి చీరలు సిద్ధం కాకపోవడంతో పంపిణీ వాయిదా పడింది. వీటిని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా నవంబర్ 19న పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం ఎట్టిపరిస్థితుల్లోనూ నవంబర్ 15 వరకు చీరల తయారీ పూర్తి చేసి.. పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకుంది. తెలంగాణ పూల పండుగ బతుకమ్మ కానుకగా.. రాష్ట్ర మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందిరా మహిళా శక్తి పేరుతో చీరలు పంపిణీ చేయాలనుకుంది. కానీ అది సాధ్య పడలేదు. దీంతో చీరల పంపిణీ కార్యక్రమాన్ని వాయిదా వేసింది. పండుగ తర్వాత పంపిణీ చేస్తామని ప్రకటించింది. అయితే ఈ చీరల పంపిణీని దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి రోజున (నవంబర్ 19న) ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేంకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 18,848 స్వయం సహాయకం బృందాల్లో (ఎస్‌హెచ్‌జీ) 1.94లక్షల మంది సభ్యులు ఉన్నారు. ఈ గ్రూపుల్లో ఉన్న వారందరికీ.. ఒక్కో చీర చొప్పున ప్రభుత్వం పంపిణీ చేయనుంది. అంటే మొత్తం 1.94 లక్షల చీరలు అవసరం అవుతాయి. అయితే ఇందులో జిల్లాలకు 50 శాతం చీరలు మాత్రమే సరఫరా అయ్యాయి. వాటిని గోదాముల్లో భద్రపరిచారు. మిగతా 50శాతం చీరలు త్వరలో జిల్లాలకు సరఫరా కానున్నాయి. చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, కమిషనర్ శైలజా రామయ్యర్ చీరల తయారీ, పంపిణీ గురించి అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# మంత్రి సీతక్కను కలిసిన బ్రాక్ ప్రతినిధులు

**హైదరాబాద్,అక్టోబరు 13, ప్రభాతవార్త:** సచివాలయంలో సోమవారం పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్కను బ్రాక్ ప్రతినిధుల బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. రాష్ట్రంలోని అత్యంత పేద, వెనుకబడిన వర్గాల జీవన ప్రమాణాలను మెరుగుపరచే లక్ష్యంతో అమలవుతున్న తెలంగాణ ఇన్ క్లూజివ్ లైవ్లీహుడ్స్ ప్రోగ్రామ్ (టిజిఐఎల్‌పి)అమలు ప్రగతిపై ఈ సందర్భంగా వారు మంత్రికి నివేదిక అందజేశారు. బ్రాక్ సంస్థ సెర్ప్ కలిసి ఆదివాసీలు, జోగినీలు, ఇతర పేద కుటుంబాల ఆర్థిక సాధికారత కోసం పలు కార్యక్రమాలు చేపడుతోంది. ఎంపిక చేసిన పేద కుటుంబాలకు అవసరమైన నైపుణ్య శిక్షణ, ప్రోత్సాహకాలు, లోన్లు, రాయితీలు అందించి, స్వయం ఆదాయ వనరులు సృష్టించేందుకు టిజిఐఎల్‌పి లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 3554 అత్యంత పేద కుటుంబాలను గుర్తించి, మండల మహిళా సమాఖ్య ద్వారా 108 మంది నిపుణులను నియమించి దీర్ఘకాలిక ఆదాయం మార్గాలు కల్పించి వారిని ఆర్థికం స్వాలంబన దిశగా తీసుకెళ్తున్నామని వారు వివరించారు. ఈ సమావేశంలో బ్రాక్‌ప్రతినిధులు గ్రెగరీ చెన్, శ్వేతా బెనర్జీ,ఉషారాణి, వి.రమేష్, అభిషేక్ ,సెర్ప్ సీఈవో దివ్యాదేవరాజన్ తదితరులు పాల్గొన్నారు.

ఎప్ సెట్ బైపిసి మొదటి ఫేజ్ కౌన్సెలింగ్‌లో

# 10,012 మందికి సీట్ల కేటాయింపు

## నేడు ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి

## 51 కాలేజీల్లో 100 శాతం సీట్ల కేటాయింపు

## ఈడబ్ల్యూఎస్‌లో 462 మందికి సీట్లు

## సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన

**హైదరాబాద్, ప్రభాతవార్త, అక్టోబరు 13:** ఇంటర్మీడియట్‌లో బైపీసీ చదివిన విద్యార్థులు ఎప్‌సెట్-2025 ద్వారా.. బి ఫార్మసీ, పార్మా-డి, బైయో టెక్నాలజీ, బయో మెడికల్ ఇంజనీరింగ్, ఫార్మాసూటికల్ ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరడానికి నిర్వహించే కౌన్సెలింగ్‌లో భాగంగా మొదటి విడత సీట్ల కేటాయింపును సోమవారం చేశారు. 10,708 సీట్లకి గానూ 10,012 సీట్లను మొదటి విడతలోనే కేటాయించారు. సీటు పొందిన విద్యార్థులు నేడు(మంగళవారం) ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని లేకపోతే సీటు రద్దవుతుందని సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన ఒక ప్రకటనలో తెలిపారు. 71,309 మంది ఎప్‌సెట్-2025లో అర్హత సాధించగా వారిలో 15,775 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కి హాజరయ్యారు. వారిలో 15,192 మంది 3,90,122 వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారిలో 10,012 మందికి సీట్ల కేటాయింపు చేయగా.. మరో 696 సీట్లు ఖాళీగా ఉన్నాయి. మొత్తం సీట్లలో 93.5 శాతం సీట్లను కేటాయించారు. మొదటి ఫేజ్‌లో 462 మంది ఈడబ్ల్యూఎస్ కోటా సీట్లను కేటాయించారు. 51 కాలేజీల్లో 100 శాతం సీట్లను కేటాయించారు. వాటిలో 7 యూనివర్సిటీ కాలేజీలుండగా, ఒకటి గవర్నమెంట్ కాలేజీ ఉంది. మరో 43 ప్రైవేటు కాలేజీల్లో 100 శాతం సీట్లను కేటాయించారు. బి ఫార్మసీలో 122 కాలేజీల్లో 8686 సీట్లు అందుబాటులో ఉంటే.. అందులో 8017 సీట్ల(92.2శాతం)ను కేటాయించగా మరో 669 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఫార్మా డీలో 74 కాలేజీల్లో 1657 సీట్లు ఉంటే వాటిల్లో 1637 సీట్ల(98.7శాతం)ను కేటాయించారు. మరో 20 సీట్లు మాత్రమే ఖాళీగా ఉన్నాయి. బయోమెడికల్ ఇంజనీరింగ్‌లో 2 కాలేజీల్లో 48 సీట్లు ఉంటే మొత్తం సీట్లను కేటాయించారు. బయోటెక్నాలజీలో 5 కాలేజీల్లో 202 సీట్లు ఉండగా వాటిలో కూడా 202 సీట్లను కేటాయించారు. మొత్తం 10,708 సీట్లకు గానూ 10,012 సీట్ల(93.5శాతం)ను కేటాయించగా మరో 696 సీట్లు ఖాళీగా ఉన్నాయి.

# రూ.1,000 కోట్ల రుణానికి ఇండెంట్

**హైదరాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** రాష్ట్ర సర్కార్ మరో 1,000 కోట్ల రూపాయల మేర రుణం కావాలని రిజర్వ్ బ్యాంక్‌కు ఇండెంట్ పెట్టింది. ప్రతి మంగళవారం నిర్వహించే ఈ వేలం ద్వారా ఈ మొత్తం తీసుకుంటామని ప్రతిపాదించింది. ఇందుకు ప్రభుత్వం సెక్యూరిటీ బాండ్లను తనఖా పెట్టనుంది. రిజర్వ్ బ్యాంక్ ఈ నెల 14న నిర్వహించే బహిరంగ వేలంలో ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను తనఖా పెట్టి 26 ఏండ్ల కాలానికి 1,000 కోట్ల రూపాయలు తీసుకుంటామని రాష్ట్ర ఆర్థికశాఖ ఇండెంట్ పెట్టినట్టు ఆర్బీఐ ఒక ప్రకటనలో తెలిపింది. అయితే, ఇప్పటికే ఈ ఏడాది ఒక్క ఆర్బీఐ నుంచే రాష్ట్ర ప్రభుత్వం 50 వేల కోట్ల రూపాయల రుణ సమీకరణ చేసింది. ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ రుణాల కింద 54,009 కోట్ల రూపాయలు సమీకరిస్తామని అంచనా బడ్జెట్‌లో ప్రతిపాదించింది. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని రెండు త్రైమాసికాల్లోనే 49,900 కోట్ల రూపాయల చొప్పున రుణాలను సేకరించింది. ఈ నేపథ్యంలో అదనపు రుణ సమీకరణ కోసం మూడో త్రైమాసికం కింద తమకు రూ.9,600 కోట్లకు ప్రతిపాదనలు పంపించినట్టు ఆర్బీఐ క్యూ3 క్యాలెండర్‌లో వెల్లడించింది.

# మాదక ద్రవ్య రహితంగా దేశం మారాలి

**హైదరాబాద్, ప్రభాతవార్త, అక్టోబరు 13:** వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా సోమవారం యూనివర్సిటీ క్యాంపస్‌లో ర్యాలీ నిర్వహించారు. విశ్వవిద్యాలయంలోని హ్యూమన్ క్యాపిటల్ డెవలప్మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ఈ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్(విసి) ప్రొఫెసర్ సూర్య ధనుంజయ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లోకపావని, ఆంటీ డ్రగ్ కమిటీ కోఆర్డినేటర్ డాక్టర్ మాధురి ఠాగూర్‌తోపాటు యూనివర్సిటీ అధ్యాపక బృందంతో పాటు విద్యార్థినులు ఉత్సాహంతో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విసి ప్రొఫెసర్ సూర్య ధనుంజయ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ మాదక ద్రవ్య రహితంగా తమ యూనివర్సిటీతోపాటు తెలంగాణ రాష్ట్రం, మొత్తం దేశం కూడా మాదకద్రవ్య రహితంగా మారాలని.. ఆ విధంగా విద్యార్థుల కృషి ఉండాలన్నారు. ఉత్తమ పౌరులుగా మారాలంటే మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ సమావేశానికి ఆత్మీయ అతిథులుగా సుల్తాన్ బజార్ ఇన్స్పెక్టర్ కె. నరసింహ విద్యార్థుల ఉద్దేశించి ఉపన్యసిస్తూ యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ విషయాలను వివరిస్తూ అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలు ఈ సమాజాన్ని ఏ విధంగా పట్టిపీడిస్తున్నాయో, అవి ఏ, ఏ రూపాలలో డ్రగ్స్‌గా విద్యార్థులకు అందుతున్నాయో ఇన్స్పెక్టర్ వివరించారు. ఇటువంటి ప్రమాదకరమైన డ్రగ్స్ తమను చేరకుండా ఎలా జాగ్రత్తతో ఉండాలో ఎస్ఐ సాయిరాం విద్యార్థినులకు వివరించారు. ర్యాలీ అనంతరం విద్యార్థినులచే ఇన్స్పెక్టర్ డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రమాణాన్ని చేయించారు.




మహిళా విశ్వవిద్యాలయంలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులచే ప్రమాణం చేయిస్తున్న దృశ్యం

# కొత్త మద్యం పాలసీపై హైకోర్టులో పిటిషన్

**హైదరాబాద్,అక్టోబరు 13, ప్రభాతవార్త:** కొత్త మద్యం పాలసీపై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. అనిల్‌కుమార్ అనే వ్యక్తి ఈ పిటిషన్ దాఖలు చేశాడు, ఒక్కో దరఖాస్తుకు రూ.3 లక్షలు రుసుంపెట్టారని, పిటిషన్‌లో అభ్యంతరం వ్యక్తం చేశాడు. లాటరీలో షాపు దక్కక పోతే రూ.3లక్షలు ఆబ్కారిశాఖకే వెళ్తాయని, ఈ డబ్బును తిరిగిచ్చేలా ఆశాఖను ఆదేశించాలని పిటిషనర్ విజ్ఞప్తి చేశాడు, లిక్కర్ పాలసీపై జారీ చేసిన జీవోను కొట్టివేయాలని కోరాడు. దీనిపై ఆబ్కారిశాఖ కమిషనర్‌కు నోటీసులు జారీ చేస్తూ విచారణను రెండువారాలకు వాయిదా వేసింది.

# ఎక్సైజ్ శాఖకు 97 మంది ఎస్సైలు

## వరంగల్ జిల్లాకు 63, హైదరాబాద్‌కు 34 మంది కేటాయింపు

**హైదరాబాద్,అక్టోబరు 13, ప్రభాతవార్త :** గ్రూపు 2 ద్వారా ఎక్సైజ్ ఎస్సైలుగా ఎంపికైన 97 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను సోమవారం పరిశీలించాలని ఇచ్చిన ఎక్సైజ్ శాఖకు అదేశాలు ఇచ్చారు. ఈ మేరకు సోమవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ నాంపల్లిలోని అబ్కారీ భవన్‌లోని సమావేశ మందిరంలో గ్రూపు 2 ద్వారా వచ్చిన అభ్యర్థుల సరిఫికెట్ల పరిశీలన చేపట్టారు. హైదరాబాద్‌కు 34 మందిని గ్రూపు 2 ద్వారా ఎస్సైలుగా ఎంపిక చేయగా సరిఫికెట్ల వేరిఫికేషన్ కోసం 33 మంది హాజరయ్యారని హైదరాబాద్ డిప్యూటి కమిషనర్ అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. వరంగల్ జిల్లాకు చెందిన గ్రూపు 2 ద్వారా 63 మందినికేటాయించగా అందరు సరిఫికెట్ల వేరిఫికేషన్‌కు హాజరయ్యారని వరంగల్ డిప్యూటి కమిషనర్ జి. అంజన్‌రావు తెలిపారు. సర్టిఫికెట్ల వేరిఫికేషన్ వరంగల్ డిప్యూటి కమిషనర్‌కార్యాలయంలో జరిగినట్లు ఆయన తెలిపారు. హైదరాబాద్‌లో సర్టిఫికెట్ల వేరిఫికే షన్‌లో ఏఈఎస్‌లు స్మితసౌజన్య,మొహన్ బాబు పర్యవేక్షణలో జరగ్గా మరో ఏఈఎస్ శ్రీని వాసరావు కూడ ఈ సర్టిఫికేట్ల వేరిఫికేషన్‌లో పాల్గొన్నారు.

# విద్యుత్ రంగ ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం కుట్ర

## సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు

## బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం కేంద్రంతో పోరాడాలి: తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, ప్రభాతవార్త, అక్టోబరు 13:** దేశంలో విద్యుత్‌రంగాన్ని ప్రయివేటుపరం చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు విమర్శించారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటుపరం చేస్తే వ్యాపారవేత్త అదానీకే లాభం కలుగుతుందన్నారు. ఇదే జరిగితే ప్రజలు, రైతులు, వినియోగదారులు, విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని రాఘవులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యులు టి జ్యోతితో కలిసి రాఘవులు మాట్లాడారు. విద్యుత్ సవరణ చట్టం-2025 పేరుతో ఈనెల 9న కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదనలను విడుదల చేసిందని రాఘవులు తెలిపారు. 30 రోజులపాటు అభ్యంతరాలను తెలపాలంటూ గడువు విధించిందని.. 2021లో విద్యుత్ చట్టానికి సవరణలను ప్రతిపాదిస్తే తీవ్ర ప్రతిఘటనతో వెనక్కి తగ్గిందని గుర్తు చేశారు. 2022లో మళ్లీ సవరణలు తెస్తే ప్రతిపక్షాలు వ్యతిరేకించాయనీ, దాన్ని జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి అప్పగించిందని వివరించారు. అది చట్టరూపం దాల్చలేదన్నారు. పాత అంశాలతోపాటు కొత్తవి జోడించి విద్యుత్ సవరణ చట్టం ప్రతిపాదనలను దుర్మార్గం, ప్రమాదకరంగా రూపొందించిందని విమర్శించారు. కొత్త చట్టం వస్తే సుమోటోగా ఏప్రిల్ ఒకటి నుంచి విద్యుత్ చార్జీల పెంపు అమల్లోకి వచ్చేలా మార్పులు చేస్తున్నారని విమర్శించారు. ఈ ప్రమాదకరమైన మార్పులకు వ్యతిరేకంగా రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు, ప్రజలు, రైతులు, సంఘాలు ముందుకు రావాలనీ, కేంద్రం తీరుకు నిరసనగా ఉద్యమించాలని రాఘవులు పిలుపునిచ్చారు. తెలంగాణలో కొత్త డిస్కం తేవాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నారని సీపీడీసీఎల్, ఎన్‌పీడీసీఎల్ కాకుండా కొత్త డిస్కం ప్రతిపా దనలను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటున్నదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. బీసీ రిజర్వే షన్లపై రాష్ట్రంలోని కేంద్ర మంత్రులకు చిత్తశుద్ధి ఉంటే కేంద్రంపై ఒత్తిడి తేవాలనీ లేదంటే ఆ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చిన వెస్లీ అక్కడ తాము పోటీచేయడంపై నగర పార్టీతో చర్చిస్తామన్నారు. పోటీ చేయకుంటే బీజేపీని ఓడించే పార్టీకి మద్దతిస్తామని తెలిపారు. ఆర్‌ఆర్‌ఆర్ నిర్వాసి తులకు సంబంధించి రైతుల ఆమోదం లేకుండా భూమిని తీసుకోవద్దని, నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లిం చాలని, రైతులతో చర్చలు జరపాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు.

# రూఫ్‌టాప్ సోలార్‌పై నిబంధనలు మార్పు

## రాష్ట్రాలకు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ సమాచారం

**హైదరాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** రూఫ్‌టాప్ సోలార్ పాంట్ల విషయంలో కేంద్రం మార్పులు చేసింది. ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన (పీఎంఎస్‌జీవై) పథకం కింద ఏర్పాటు చేసే సోలార్ ప్లాంట్లకు సంబంధించి ప్రత్యేక నెట్ మీటరింగ్ ఒప్పందాలు అవసరంలేకుండా నింబంధనలు సడలింపు చేసింది. సూర్యఘర్ యోజన పథకానికి సంబంధించిన నిబంధనలు మార్గదర్శకాలను మరింత సరళీకరించాలని కేంద్ర విద్యుత్తు శాఖ రాష్ట్రాలకు సమాచారం అందించింది. నెట్ మీటరింగ్ కోసం ప్రత్యేకంగా ఒప్పందాలు చేసుకోనవసరంలేదని స్పష్టం చేసింది, ఇందుకు గాను సూర్యఘర యోజన పోర్టల్‌లోని ఆన్‌లైన్ దరఖాస్తు ఫారమ్‌లో డిజిటల్ ఒప్పందం చేసుకుంటే సరిపోతుందని స్పష్టం చేసింది. కర్ణాటక, గుజరాత్, జార్ఖండ్, రాజస్థాన్, హర్యానా తదితర రాష్ట్రాల్లో విద్యుత్ సంస్థలు డిజిటల్ ఒప్పందాలను విజయవంతంగా అమలు చేస్తున్నాయని వెల్లడించింది. ఇదే విధానాన్ని మిగిలిన రాష్ట్రాలు కూడా అమలు చేయాలని తెలిపింది. అలాగే నెట్ మీటిరింగ్ చార్జీలను ఇప్పటికే 17 రాష్ట్రాలు మాఫీ చేశాయని పేర్కొన్నది. అంతే కాకుండా ఈ సోలార్ ప్లాంట్లకు వసూలు చేస్తున్న నెట్ మీటరింగ్ చార్జీలను కూడా మినహాయించాలని నిర్ణయించినట్లు రాష్ట్రాల విద్యుత్ సంస్థలకు తెలియచేసింది.

14-10pg10-final 12 ONG_14-10pg10-final.qxd 10/13/2025 10:36 PM Page 1



## టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్:
# క్వార్టర్స్‌లోనే భారత్ నిష్క్రమణ
### 0-3 తేడాతో హాంకాంగ్ విజయం




**న్యూఢిల్లీ:** ఆసియా టీమ్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్-2025లో భారత పురుషుల విభాగం క్వార్టర్స్‌లోనే నిష్క్రమించింది. భువనేశ్వర్‌లో జరిగిన ఛాంపియన్‌షిప్‌లో భారత పురుషుల టేబుల్ టెన్నిస్ జట్టు క్వార్టర్ ఫైనల్స్‌లో హాంకాంగ్ చేతిలో 0-3 తేడాతో ఓడిపోయింది. క్వార్టర్స్‌లోకి బై లభించిన తర్వాత, ఇద్దరు అరంగేట్ర ఆటగాళ్లతో కూడిన భారత జట్టు బలమైన ప్రత్యర్థులతో పోటీ పడలేకపోయింది. టైలోని మొదటి మ్యాచ్ ఆడుతున్న మనుష్ షా, వాంగ్ చున్ టింగ్ చేతిలో 0-3 తేడాతో ఓడిపోయాడు. ప్రస్తుత భారత జాతీయ ఛాంపియన్, అనుభవజ్ఞుడైన ప్యాడ్లర్ చేతిలో వరుస గేమ్‌లలో 5-11, 9-11, 11-13 తేడాతో ఓడిపోయాడు. భారత పురుషుల సింగిల్స్ ప్యాడ్లర్‌లో అత్యున్నత ర్యాంక్ పొందిన మానవ్ ఠక్కర్ తర్వాతి స్థానంలో నిలిచాడు. అతను చాన్ బాల్డ్విన్ చేతిలో 2-3 తేడాతో ఓడిపోయాడు. ఠక్కర్ మొదటి రెండు గేమ్‌లను 8-11 తేడాతో ఓడిపోయినా, తరువాతి రెండు గేమ్‌లను 12-10, 11-9 తేడాతో గెలిచి నిర్ణయాత్మక జట్టుకు చెక్ పెట్టాడు. అయితే భారత్ కెప్టెన్ బాల్డ్విన్ టాప్ స్పిన్‌ను ఎదుర్కోవడంలో విఫలమై 0-2 తేడాతో వెనుకబడి ఉండటంతో చివరి ఆటను 8-11తో వదులుకున్నాడు. భట్టాచార్జీ తీవ్రంగా పోరాడిన మూడో గేమ్‌ను 14-12 తేడాతో గెలుచుకున్నా తరువాతి రెండు గేమ్‌లను వరుసగా 6-11, 7-11 తేడాతో ఓడిపోయాడు. దీంతో భారత్ క్వార్టర్ ఫైనల్స్‌లో ఓడిపోయింది.

## తొలి ఆర్చరీ ప్రీమియర్ లీగ్
# ఛాంపియన్‌గా రాజ్‌పుతానా




**న్యూఢిల్లీ:** తొలి ఆర్చరీ ప్రీమియర్ లీగ్ ఛాంపియన్‌గా రాజ్‌పుతానా రాయల్స్ నిలిచింది. న్యూఢిల్లీలో జరిగిన ఈ ఆర్చరీ లీగ్‌లో రాజ్‌పుతానా ఉత్కంఠభరితమైన షూటాఫ్‌లో యోధాస్‌ను ఓడించింది. చివరికి రాయల్స్ టైటిల్ పోరులోకి తిరిగి దూసుకుపోవడమే కాకుండా షూటాఫ్‌లో గెలిచి ఛాంపియన్‌గా నిలిచింది. టై బ్రేకింగ్ షూటాఫ్‌లో ఇది హిట్ అండ్ మిస్ మ్యాచ్‌గా మారింది. యోధాస్ జట్టు రాయల్స్ కు గట్టి పోటీ ఇచ్చినందుకు మాత్రమే కాకుండా మొత్తం 10 బాణాలతో 80 పాయింట్లు సాధించిన మొదటి జట్టుగా అవతరించింది. తొలి సెట్‌లో ఖడకే వేసిన బాణంతో యోధాస్‌కు తొలి సెట్‌లో 78-77 తేడాతో విజయం లభించింది. అయితే, రాయల్స్ తదుపరి సెట్‌లో 78-75 తేడాతో తిరిగి విజయం సాధించి ఫైనల్‌ను 2-2తో సమం చేసింది. మూడో సెట్‌లో యోధాస్ ఆర్చర్లు చరిత్ర సృష్టించి 80-77తో అపూర్వమైన స్కోరుతో విజయం సాధించారు. నాల్గవ సెట్ ముగిసే సమయానికి మ్యాచ్ కత్తిమీద సాములా సాగింది, యోధాస్‌కు ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకోవడానికి గ్రాండేకు 9 పాయింట్లు అవసరం అయినా అతను 8 చేయడంతో రాయల్స్ 78-77తో సెట్‌ను గెలుచుకుని 4-4తో నిలిచింది. దీంతో షూటాఫ్ నిర్వహించగా, గిబ్సన్, డియోటేల్ ఆ లక్ష్యాన్ని రెండుసార్లు ఛేధించడంతో రాజ్‌పుతానా రాయల్స్ విజేతగా నిలిచింది.

# విజయానికి చేరువలో టీమిండియా
### 58 రన్స్ దూరంలో వెస్టిండీస్ ఓటమి!

**న్యూఢిల్లీ:** వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్‌లో భారత్ విజయం దిశగా దూసుకువెళుతోంది. 121 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ నాలుగో రోజు సోమవారం ఆట ముగిసే సమయానికి ఒక వికెట్ నష్టపోయి 63 పరుగులు చేసింది. క్రీజులో కేఎల్ రాహుల్ (25), సాయి సుదర్శన్ (30)లు ఉన్నారు. భారత్ విజయానికి ఇంకా 58 పరుగులు అవసరం కాగా చేతిలో 9 వికెట్లు ఉన్నాయి. 121 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆదిలోనే షాక్ తగిలింది. విండీస్ ఎడమ చేతి వాటం స్పిన్నర్ జోమెల్ వారికన్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడేందుకు యత్నించి ఆండర్సన్ ఫిలిప్ క్యాచ్ అందుకోవడంతో యశస్వి జైస్వాల్ (8) పెవిలియన్‌కు చేరుకున్నాడు. దీంతో 9 పరుగుల వద్ద భారత్ తొలి వికెట్‌ను కోల్పోయింది. ఆ తరువాత వన్‌డౌన్‌లో వచ్చిన సాయి సుదర్శన్‌తో కలిసి కేఎల్







రాహుల్ విండీస్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. వీలు చిక్కినప్పుడల్లా ఈ జోడి బంతిని బౌండరీకి తరలించింది. నాలుగో రోజు మరో వికెట్ పడకుండా రోజును ముగించింది. కాగా ఓవర్‌నైట్ 173/2 స్కోరుతో నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన విండీస్ అద్భుతంగా పోరాడింది. మరో 217 పరుగులు జోడించి మిగిలిన 8 వికెట్లను కోల్పోయింది. కాంప్‌బెల్ (115), షై హోప్ (103) శతకాలు చేశారు. జస్టిన్ గ్రీవ్స్ (50), రోస్టన్ ఛేజ్ (40), జైడెన్ సీల్స్ (32) లు రాణించారు.

గ్రీవ్స్, సీల్స్ పదో వికెట్‌కు 79 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్, బుమ్రాలు చెరో 3 వికెట్లు, సిరాజ్ 2 వికెట్లు, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ చెరో 1 వికెట్ సాధించారు. అంతకముందు తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 518/5 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. ఆ తరువాత విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 248 పరుగులకే కుప్పకూలింది. దీంతో భారత్‌కు 270 పరుగుల కీలక తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. ఫాలో ఆన్ ఆడిన వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 390 పరుగులు చేయగా, భారత్ ముందు 121 పరుగుల లక్ష్యం నిలిచింది.




# హరిహరన్‌కు డబుల్ స్వర్ణం

**న్యూఢిల్లీ:** టర్కియే ఇంటర్నేషనల్ ఛాలెంజ్‌లో హరిహరన్ అంశకరుణన్ ఆధిపత్యం చెలాయించి డబుల్ స్వర్ణం సాధించాడు. ట్రీసా జాలీ, ఎమ్మార్ అర్జున్‌లతో కలిసి మిశ్రమ, పురుషుల డబుల్స్ టైటిళ్లను గెలుచుకున్నాడు. భారత బ్యాడ్మింటన్ ఏస్ హరిహరన్ ఈ టోర్నమెంట్‌లో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చి ఒకే రోజులో ట్రీసా జాలీతో మిక్స్‌డ్ డబుల్స్, అర్జున్‌తో పురుషుల డబుల్స్ టైటిళ్లను సాధించాడు. ఉత్కంఠభరితంగా జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్‌లో హరిహరన్-ట్రీసా జాలీ 52 నిమిషాల పోరాటం తర్వాత ఇండోనేషియాకు చెందిన ఎం నవాఫ్ ఖోయిరియాన్సా-నహ్యా ముహిఫాను 21-14, 18-21, 21-11 తేడాతో ఓడించి ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. ఆ తర్వాత వెంటనే, హరిహరన్ అర్జున్‌తో కలిసి కోర్టుకు తిరిగి వచ్చి పురుషుల డబుల్స్ ఫైనల్‌లో జపాన్‌కు చెందిన యుటో నోడా-షున్యా ఓటాను 21-13, 21-6 తేడాతో ఓడించి అద్భుతమైన ప్రదర్శన ఇచ్చాడు. ఈ నెల ప్రారంభంలో అల్ ఐన్ మాస్టర్స్ 2025లో విజయం సాధించిన తర్వాత, ఈ విజయం హరిహరన్, అర్జున్ లకు వరుసగా రెండవ టైటిల్‌ను అందించింది. భారత జంటకు మొదటి రౌండ్‌లో బై లభించినప్పటికీ, రెండో రౌండ్‌లో జపాన్‌కు చెందిన యోషిఫుమి ఫుజిసావా-షుంటారో మెజాకిల నుంచి గట్టి పోటీ ఎదురైంది. అక్కడి నుంచి, వారు ఒక్క గేమ్ కూడా ఓడిపోకుండా టోర్నమెంట్‌లో ముందుకు సాగారు. అలాగే మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్‌లో హరిహరన్-ట్రీసా పోటీ మొత్తంలో ఒకే ఒక గేమ్‌ను కోల్పోయారు. ఇతర భారత్ ప్లేయర్లలో లక్ష్య శర్మ పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకోగా, ఆకర్షి కశ్యప్, అదితి భట్ మహిళల సింగిల్స్ రెండవ రౌండ్‌లోనే నిష్క్రమించారు. మహిళల డబుల్స్‌లో హృషా దుబే-రిధి కౌర్ టూర్, అశ్విని భట్-శిఖా గౌతమ్ కూడా రెండో రౌండ్‌లోనే నిష్క్రమించారు.

## మహిళల వరల్డ్ కప్..
# సెమీఫైనల్స్ సంక్లిష్టం
### 2 విజయాలు, 2 ఓటములతో భారత్

**న్యూఢిల్లీ:** ఐసీసీ మహిళల ప్రపంచ కప్-2025లో టీమిండియా సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఆస్ట్రేలియాపై 330 పరుగులు చేసినప్పటికీ, భారత మహిళా క్రికెట్ జట్టు మూడు వికెట్ల తేడాతో ఓడిపోయింది. దీంతో నాలుగు మ్యాచ్‌ల్లో నాలుగు పాయింట్లతో భారత్ మూడో స్థానంలో నిలిచింది. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓడిన తర్వాత టీం ఇండియా సెమీఫైనల్‌కు ఎలా చేరుకుంటుందనేది ఇప్పుడు ప్రశ్న. భారత్ ఆడిన 4 మ్యాచ్‌ల్లో రెండింటిలో విజయం సాధించగా, మరో రెండింటిలో ఓటమి పాలైంది. దక్షిణాఫ్రికా కూడా 4 పాయింట్లతో ఉన్నా కానీ నెట్ రన్ రేట్ పరంగా వెనుకబడి ఉంది. దానికి ఇంకో మ్యాచ్ మిగిలి ఉంది. ఇంగ్లాండ్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్‌లతో మిగిలిన




మ్యాచ్‌లు ఉన్నందున టీమిండియా ముందుకు సాగే మార్గం దాని చేతుల్లోనే ఉంది. ఈ రెండు మ్యాచ్‌లలో భారత్ గెలిస్తే, దాని నెట్ రన్ రేట్ ఈ జట్ల కంటే మెరుగ్గా ఉంటే, అది నాల్గవ స్థానాన్ని కైవసం చేసుకోవడానికి ఎనిమిది పాయింట్లను కలిగి ఉంటుంది. భారత్ మిగిలిన మూడు మ్యాచ్‌లలో గెలిస్తే, అది నెట్ రన్ రేట్‌తో సంబంధం లేకుండా మొదటి నాలుగు స్థానాల్లో స్థానం సంపాదించుకుంటుంది. ఈ విధంగా టీం ఇండియాకు ఇంకా అవకాశం ఉంది. ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయినప్పటికీ, సెమీఫైనల్‌కు చేరుకోవాలనే భారత ఆశలు చెక్కుచెదరకుండా ఉన్నాయి. అయితే టీమిండియా ఎట్టి పరిస్థితుల్లోనూ ఇక్కడి నుండి గెలవాలి. టీమిండియా తన 3మ్యాచ్‌లలో రెండింటిలో ఓడిపోతే, సెమీఫైనల్‌కు వెళ్లే మార్గం చాలా కష్టమవుతుంది. న్యూజిలాండ్, ఇంగ్లాండ్ వంటి బలమైన జట్లతో ఇంకా ఆడాల్సి ఉండటం టీం ఇండియాకు ఆందోళన కలిగించే అంశం. ఇక అగ్రస్థానంలో ఆస్ట్రేలియా కొనసాగుతోంది. ఈ టోర్నమెంట్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోని జట్లు ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ మాత్రమే. ఆస్ట్రేలియా ఆడిన నాలుగు మ్యాచ్‌లలో మూడింటిలో గెలిచింది, ఒక మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఆస్ట్రేలియా 7 పాయింట్లతో మొదటి స్థానంలో ఉంది. ఇంగ్లాండ్ తన మూడు మ్యాచ్‌లలో మూడింటిలో గెలిచి 6 పాయింట్లతో రెండవ స్థానంలో ఉంది.

# ఆల్‌టైమ్ రికార్డు దిశగా పసిడి పరుగు



### ప్రొద్దుటూరులో రూ.1,30,200
### హైదరాబాద్‌లో రూ.1,27,920
### అదేబాటలో వెండి ధరలు కూడా
### ఒక్కరోజే రూ.7వేలు పెరుగుదల
### వెండి కిలో రూ.1,97,000కు చేరిక

**ముంబయి, అక్టోబరు 13:** పసిడి ధరలు రోజురోజుకు ఆకాశాన్నంటుతున్నాయి. కొనుగోలుదారులకు చుక్కలు చూపిస్తూ సరికొత్త గరిష్టాలకు చేరుకున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా 10 గ్రాముల ధర ఏకంగా లక్షా 25 వేల రూపాయల మైలురాయిని దాటి ఆల్‌టైమ్ రికార్డు సృష్టించింది. ధన త్రయోదశి డిమాండ్‌తో ఈ వారాంతంలో పుత్తడి ధర దేశవ్యాప్తంగా రూ.1.30 లక్షలు దాటే అవకాశముందని బులియన్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇప్పటికే ప్రొద్దుటూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.1,30,200 పలుకుతోంది. ఇక హైదరాబాద్‌లో సోమవారంనాడు పుత్తడి ధర రూ.320లు పెరిగి, రూ.1,27,920కు చేరుకుంది. ఇక 22 క్యారెట్ల బంగారం ధర రూ.300 పెరిగి రూ.1,14,950 పలికింది. అటు కిలో వెండి ధర సోమవారంనాడు ఒక్కరోజే రూ.7 వేలు పెరిగి, రూ.1,97,000లకు చేరింది. ఈ నెల 9వ తేదీన, 10వ తేదీన వరుసగా రెండు రోజులూ రూ.7 వేలు చొప్పున పెరగ్గా, 11వ తేదీన రూ.6 వేలు పెరిగి రూ.లక్షా 90 వేలకు చేరగా, తాజాగా ఆ ధర రూ.1,97,000కు చేరింది.

ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక అనిశ్చితి, ట్రంప్ టారిఫ్‌లు వెరసి అంతర్జాతీయ విపణిలో బంగారంపై మదుపర్లు ఆసక్తి కనబరచడం, డాలర్‌తో రూపాయి మారకం విలువ కూడా తోడవడంతో పసిడి ధరలకు రెక్కలొచ్చాయని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇది మరికొంతకాలం కొనసాగే అవకాశముందని చెబుతున్నారు. వీటికి తోడు ధనత్రయోదశి డిమాండ్‌తో బంగారం ధరలు పెరుగుతున్నాయి. గత పది రోజులుగా పెరుగుతూ వస్తున్న పసిడి ధర, సోమవారం కూడా అదే జోరును కొనసాగించింది. బంగారంతో పాటు వెండి ధరలు కూడా పరుగులు పెట్టడం మార్కెట్‌లో కలకలం రేపుతోంది.

మరోవైపు వెండి ధర కూడా భారీగా పెరిగింది. తెలుగు రాష్ట్రాల్లో దాని ధర రూ. 1,97,000కు చేరింది. పండుగలు, శుభకార్యాలతో సంబంధం లేకుండా ధరలు వరుసగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుత మార్కెట్ సరళిని బట్టి చూస్తే, సమీప భవిష్యత్తులో బంగారం, వెండి ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

ఇక 2026 ఆరంభం నాటికి 10 గ్రాముల బంగారం ధర రూ.1.50లక్షలకు చేరొచ్చని ఎస్ఎంసీ గ్లోబల్ సెక్యూరిటీస్ కమోడిటీ రీసెర్చ్ పేర్కొంది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 4,071.50 డాలర్లుగా ఉంది. ఈ వారాంతానికి ఔన్సు ధర 4,150 నుంచి 4,250 డాలర్లు చేరుకునే అవకాశముందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

## వాణిజ్యం



# రెండు రోజుల లాభాలకు బ్రేక్
### నష్టాలతో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, అక్టోబరు 13:** దేశీయ స్టాక్ మార్కెట్లలో రెండు రోజులుగా కొనసాగుతున్న లాభాల జోరుకు సోమవారం అడ్డుకట్ట పడింది. బలహీన అంతర్జాతీయ సంకేతాలు, ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీయడంతో సూచీలు నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 174 పాయింట్లు, నిఫ్టీ, 58 పాయింట్లు నష్టపోయింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 173.77 పాయింట్లు (0.21 ) క్షీణించి 82,327.05 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 58 పాయింట్లు (0.23 ) నష్టపోయి 25,227.35 వద్ద ముగిసింది. చైనాపై కఠినమైన సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు మార్కెట్లను కలవరపెట్టాయి. మళ్లీ అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం మొదలవుతుందనే భయాలు మదుపర్లలో అమ్మకాలకు దారితీశాయి. ఆదివారం నాటికి ట్రంప్ తన వైఖరిని కొంత సడలించినప్పటికీ, మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించారు. దీనికి తోడు అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్, ఇటీవలి ర్యాలీల తర్వాత లాభాల స్వీకరణ వంటి అంశాలు కూడా మార్కెట్లపై ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. సెన్సెక్స్‌లో ప్రధానంగా టాటా మోటార్స్, ఇన్ఫోసిస్, హిందుస్థాన్ యూనిలీవర్ (హెచ్‌యూఎల్), పవర్ గ్రిడ్ షేర్లు నష్టపోయి సూచీని కిందకు లాగాయి. మరోవైపు అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు లాభపడి నష్టాలను కొంతవరకు పరిమితంచేశాయి. రంగాలవారీగా చూస్తే, ఐటీ, ఎఫ్ఎంసీజీ రంగాల్లో అమ్మకాల ఒత్తిడి స్పష్టంగా కనిపించింది. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 0.78 , నిఫ్టీ ఎఫ్ఎంసీజీ ఇండెక్స్ 0.9 మేర నష్టపోయాయి. అయితే, వీటికి భిన్నంగా నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండెక్స్ 0.35 లాభపడింది. బ్రాడర్ మార్కెట్‌లో మిశ్రమ స్పందన కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 స్వల్పంగా 0.11 లాభపడగా, స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.17 నష్టపోయింది.

"నిఫ్టీ 25,000 కీలక మద్దతు స్థాయి పైన ఉన్నంతవరకు మార్కెట్ ట్రెండ్ సానుకూలంగానే ఉంటుంది. సూచీ 25,500 నిరోధక స్థాయికి చేరే అవకాశం ఉంది" అని మార్కెట్ నిపుణులు అంచనా వేశారు. అంతర్జాతీయ వాణిజ్య ఉద్రిక్తతల కారణంగా సమీప భవిష్యత్తులో మార్కెట్లు ఒడుదొడుకులకు లోనయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.




### హెచ్1బి వీసా ఫీజుల పెంపు ఎఫెక్ట్
# టిసిఎస్‌లో ఆ నియామకాల్లేవు
### -తేల్చిచెప్పిన సిఇఒ కృతివాసన్

**ముంబై, అక్టోబరు 13:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్-1బి వీసాల ఫీజు భారీగా పెంచిన నేపథ్యంలో టిసిఎస్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ముఖ్యంగా ఈ ఏడాది హెచ్-1బి వీసా కింద కొత్త నియామకాలు చేపట్టబోమని టిసిఎస్ సిఇవో కృతివాసన్ స్పష్టం చేశారు. అమెరికాలో తమకు సరిపడా హెచ్-1బి ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. యూఎస్‌లో టిసిఎస్‌లో 32 వేల మందికి పైగా ఉండగా, అందులో దాదాపు 11 వేల మంది హెచ్-1బి వీసాపై వచ్చిన వారేనని పేర్కొన్నారు. ఈ ఏడాది ఇప్పటికే 500 మందిని ఈ వీసాలతో భారత్ నుంచి అమెరికాకు పంపించామని తెలిపారు. అయితే, ప్రస్తుతం ఏడాదిలో హెచ్-1బి కింద కొత్తగా ఉద్యోగ నియామకాల ప్రణాళిక లేదని టిసిఎస్ సిఇవో కృతివాసన్ తేల్చిచెప్పారు. స్థానిక ఉద్యోగుల నియామకాలే యథాతథంగా కొనసాగిస్తామన్నారు. అటు అమెరికాలో కూడా స్థానికులనే తీసుకోవాలని నిర్ణయించినట్లు చెప్పారు. హెచ్-1బి వీసా ఉద్యోగులపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గించుకోవాలని నిర్ణయించామని, ఎల్-1 వీసాల సదుపాయం కూడా ఉంది, అయితే, అవి పూర్తిగా హెచ్-1బిని భర్తీ చేయలేవు. ఈ నేపథ్యంలోనే టిసిఎస్‌లో కొత్త నియామకాలపై కొంత ప్రణాళిక ప్రకారం చేయనున్నట్లు కృతివాసన్ వివరించారు.

# రిటైల్ ద్రవ్యోల్బణం 1.54 శాతమే
### ఎనిమిదేళ్లలో ఇదే అత్యల్పం

**ముంబయి, అక్టోబర్ 13:** దేశ రిటైల్ ద్రవ్యోల్బణం సెప్టెంబర్ మాసంలో 1.54శాతానికి తగ్గింది. ఇది జూన్ 2017 తర్వాత కనిష్ట స్థాయికి చేరుకుంది. ఆగస్టులో 2.07శాతం నుండి ఈ తగ్గుదలకు కూరగాయలు, నూనెలు, పండ్లు, పప్పుధాన్యాలు, తృణధాన్యాలు, గుడ్లు వంటి ఆహార ధరలు తగ్గడమే కారణమని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. వినియోగదారుల ఆహార ధరల సూచిక వార్షికంగా 2.28శాతం తగ్గింది. ఆహార ద్రవ్యోల్బణం వరుసగా నాలుగో నెల కూడా ప్రతికూలంగానే ఉంది. ద్రవ్యోల్బణం తగ్గుదల గ్రామీణ రంగంలో కూడా ప్రతిబింబిస్తుంది. ఆగస్టులో ప్రధాన ద్రవ్యోల్బణం 1.69శాతం నుండి 1.07శాతానికి తగ్గింది. ఆహార ద్రవ్యోల్బణం -0.70శాతం నుండి -2.17శాతానికి తగ్గింది. పట్టణ ప్రాంతాల్లో ప్రధాన ద్రవ్యోల్బణం 2.47శాతం నుండి 2.04శాతానికి తగ్గింది. ఆహార ద్రవ్యోల్బణం -0.53శాతం నుండి -2.47శాతానికి తగ్గింది. మొత్తం మీద తగ్గుదల ఉన్నప్పటికీ, కొన్ని రంగాలు ధరలలో పెరుగుదలను చూశాయి. గృహ ద్రవ్యోల్బణం ఆగస్టులో 3.09శాతం నుండి 3.98శాతానికి పెరిగింది. విద్య ద్రవ్యోల్బణం 3.60శాతం




నుండి 3.44శాతానికి స్వలనపంగా తగ్గింది. ద్రవ్యోల్బణం తగ్గడానికి కాలానుగుణంగా ఆహార పదార్థాల ధరలు తగ్గడం, పప్పు ధాన్యాల ధరలు తగ్గడం, ప్రపంచ మార్కెట్‌లో ఇంధన ధరలు తగ్గడం కారణమని ఆర్థిక వేత్తలు వివరిస్తున్నారు. ప్రధాన ద్రవ్యోల్బణం ఇప్పుడు ఆర్‌బిఐ నిర్దేశించిన 2-6శాతం లక్ష్య బ్యాండ్ కంటే తక్కువగా ఉండటంతో కేంద్ర బ్యాంకు భవిష్యత్ రేటు చర్యలను నిర్ణయించేటప్పుడు సడలింపు ధోరణిని అంచనా వేయవచ్చు.

# ఇపిఎఫ్‌లో వందశాతం ఉపసంహరించుకోవచ్చు
### సిబిటి సమావేశంలో కీలక నిర్ణయం
### ఉద్యోగులకు భారీ ఊరట

**న్యూఢిల్లీ, అక్టోబర్ 13:** ఇపిఎఫ్ పథకంలో పలు సంస్కరణలు తీసుకొచ్చారు. కార్మిక మంత్రి మన్సుఖ్ మాండవీయ నేతృత్వంలో సోమవారంనాడు సమావేశమైన ఇపిఎఫ్‌వో అత్యున్నత నిర్ణయాధికార సంస్థ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (సిబిటి) సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇపిఎఫ్ చందాదారులను దృష్టిలో పెట్టుకొని సరళీకృత పాక్షిక ఉపసంహరణ పథకానికి ఆమోదముద్ర వేసింది. దీంతో ఈపీఎఫ్‌వో ఖాతా బ్యాలెన్స్‌లో వందశాతం వరకు ఉపసంహరించుకునే అవకాశం ఉంది. అలాగే 13 సంక్లిష్ట నిబంధనలను ఒకే క్రమబద్ధీకరించిన రూల్‌లో విలీనం చేయాలని తీర్మానించారు. ఇపిఎఫ్ పథకంలో పాక్షిక ఉపసంహరణ నిబంధనలను సవరించారు. వాటిని అవసరమైన (అనారోగ్యం, విద్య, వివాహం), గృహ అవసరాలు, ప్రత్యేక పరిస్థితులుగా వర్గీకరించారు. దీంతో సభ్యులు ఇప్పుడు ఉద్యోగి, యజమాని సహకారంతో సహా వారి అర్హత కలిగిన ప్రావిడెంట్ ఫండ్




బ్యాలెన్స్‌లో 100 శాతం వరకు ఉపసంహరించుకునే అవకాశం ఏర్పడింది. ఇందుకు సంబంధించి విత్‌డ్రా పరిమితులను సవరించారు. విద్య కోసం పాక్షిక ఉపసంహరణలు, వివాహం కోసం ఐదుసార్లు పాక్షిక ఉపసంహరణకు అనుమతి ఉంటుంది. అన్ని పాక్షి క విత్‌డ్రాలకు కనీస అవసరం కూడా కేవలం 12 నెలలకు తగ్గించారు. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (సిబిటి) సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నట్లు కార్మిక మంత్రిత్వశాఖ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ నిర్ణయాలతో దాదాపు 70 మిలియన్లకు పైగా ఉన్న చందాదారులకు లబ్ధి చేకూరనుంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps